

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బంగారు గనిలో బందీ

- మూసిన గనిలో తవ్వకానికి 4వేల మంది
- ఆకలి దప్పులతో అల్లాడుతున్న వైనం
- బయటకు వచ్చే మార్గాలు బంద్
- నేరస్థులకు సహకరించేది లేదని స్పష్టం
- దక్షిణాఫ్రికా నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లో ఘటన

2

శుక్రవారం | 15-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 227 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 2.58 తదుపరి పాడ్యమి; నక్షత్రం: భరణి రా. 9.55 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.9.05-10.31; దుర్ముహూర్తం: ఉ.8.38-9.22, మ.12.22-1.06; అమృతఘడియలు: రా.5.38-7.04; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్టీలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

కులగణన.. అధిక నిధులకే..

- రిజర్వేషన్లు పెరగాలన్నా గణన జరగాల్సిందే
- విద్య, ఉద్యోగ అవకాశాలకూ ఇదే మార్గం
- సీఎం, మంత్రులు తినే సన్నన్నమే గురుకులాల్లో
- విద్యార్థులకు నాసిరకం భోజనం పెడితే జైలే
- ప్రజాప్రతినిధులు స్కూళ్లను సందర్శించాలి
- 11 నెలల్లో అత్యంత సంతోషం ఇచ్చిన రోజిది
- ప్రభుత్వ విజయోత్సవాలకు ఇదే ప్రారంభం
- బాలల దినోత్సవ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి
- చెడు వ్యసనాలకు బానిసలం కాబోమంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించిన సీఎం

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): "సమాజం నుంచి వచ్చిన డిమాండ్ మేరకు కుల గణన చేపట్టాం. జనాభా దామాషా ప్రకారం నిధులు అందాలంటే కుల గణన జరగాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే కుల గణన జరగాలి. రిజర్వేషన్లు పెరగాలంటే కుల గణన జరగాలి. దీనిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మళ్లీ కుట్రలకు తెరలేపుతున్నారు. వాటిని తిప్పికొట్టే బాధ్యత విద్యార్థులదే. కుల గణన వల్ల ఏ ప్రభుత్వ పథకాలూ ఆగవు. ఏ ఒక్క పథకాన్నీ తొలగించం. మీకు ఇంకా ఎక్కువ నిధులను కేటాయించడానికే ఈ కుల గణనను చేపడుతున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కుల గణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టే జన గణనలో భాగం అయ్యేలా చూద్దామని, కేంద్రం మెడలు వంచి, కుల గణనను అందులో చేర్చేలా, రాజకీయ,

మిగతా 13వ పేజీలో...

21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ

- వయో పరిమితి తగ్గించాలి
- అప్పుడే యువత రాణించే చాన్స్
- రాజకీయాల్లోకి వచ్చే అవకాశం
- పిల్లల మాక్ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం 13

'లగచర్ల'పై ఉన్నత స్థాయి విచారణ

- పరిగికి అదనపు డీజీ మహేశ్ భగవత్
- దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం
- హైకోర్టులో నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్
- రిమాండ్ రిపోర్టులో అంశాలు అబద్ధాలు
- కేటీఆర్ ప్రోద్బలం ఉందని వాంగ్మూలమివ్వలే
- కొడంగల్ కోర్టు బెయిల్ పిటిషన్‌లో పట్నం
- మావాళ్ల అరెస్టు అన్యాయం.. భూములివ్వం
- అరెస్టయిన వారి కుటుంబ సభ్యుల ఆరోపణ



నిందితులను పరిగి సబ్‌జైల్ నుంచి సంగారెడ్డి జైలుకు తరలిస్తున్న దృశ్యం

హైదరాబాద్, పంజాగుట్ట, పరిగి, వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఫార్మావిలేజ్‌లో అధికారులపై దాడి ఘటనను పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. దీంతో.. శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేశ్.ఎం.భగవత్ రంగంలోకి దిగారు. ఆయన నేతృత్వంలో దర్యాప్తు కొనసాగనుంది. ప్రాథమిక విచారణలో రాజకీయ కుట్రకోణం వెలుగుచూడడంతో.. ఆధారాలు పకడ్బందీగా ఉండేలా, అవసరమైతే న్యాయనిపుణుల

మిగతా 14వ పేజీలో...

ఉద్యోగులపై దాడి దుర్మార్గం

రాష్ట్రవ్యాప్తంగా సంఘాల ఆందోళన 14



బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో లగచర్ల మహిళలతో మాట్లాడుతున్న కేటీఆర్

కేసు పెట్టాల్సింది.. సీఎం బ్రదర్స్‌పైనే

- వాళ్లకు అర్థమయ్యే భాషలోనే లగచర్ల ప్రజలు సమాధానం చెప్పారు.. తప్పేంటి?
- ఫార్మా సిటీని ఆపేదెవరంటూ గిరిజన రైతులపై తిరుపతిరెడ్డి బూతులు
- సొంత నియోజకవర్గంలో ఎస్టీల భూముల్ని సీఎం బంధువులకివ్వాలనేది ప్రణాళిక
- రేవంత్ ప్రైవేటు సైన్యంలా కొందరు ఐపీఎస్‌లు
- విఫల సీఎం.. వైఫల్యాల వారోత్సవం చేస్తాం
- ఏడాది పాలనకు మైనస్ 10 మార్కులు
- బావమరిదికి అమృత్ కాంట్రాక్టుపై న్యాయ విచారణకు సిద్ధమా?
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): '11నెలల నుంచీ ఈ ప్రభుత్వం పని వదంతులు, ఇచ్చికాల మాటలు. చెవులు కొరకడమే. నేను డ్రగ్స్ తీసుకోలేదు, ఫోన్లు ట్యాపింగ్ చేయలేదు, అవినీతి అంతకన్నా చేయలేదు. గతంలో మోదీని ఉద్దేశించి.. మోడీయా.. బోడీయా ఏం పీక్కుంటారో పీక్కో అన్నాను. నా నిజాయతీకి ఉన్న ధైర్యంతో ఇప్పుడు రేవంత్‌రెడ్డికీ అదే చెబుతున్నా.. చిట్టినాయుడూ ఏం పీక్కుంటావో.. పీక్కో' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అసలు కేసులు

మిగతా 12వ పేజీలో...

కొడంగల్ నుంచే ప్రజల తిరుగుబాటు: హరీశ్ 14

మేమే పర్యవేక్షిస్తాం

- హెచ్‌ఎండీఏ పరిధి జల వనరులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించండి
- ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయండి
- ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చేదాకా పరిశీలిస్తాం
- హెచ్‌ఎండీఏ, సర్కారుకు హైకోర్టు ఆదేశాలు
- ప్రత్యేకంగా సుమోటో పిటిషన్ నమోదు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) పరిధిలోని చెరువులు, జల వనరులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు గుర్తించాలని, ఆక్రమణలను తొలగించి, అభివృద్ధి చేయాలని హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం, హెచ్‌ఎండీఏకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసే వరకు ఈ వ్యవహారాన్ని తామే పర్యవేక్షిస్తామని, ఇందుకు ప్రత్యేకంగా

మిగతా 3వ పేజీలో...



నిజాం కూడా ఇలా భూములు పంచలేదు

- అమోయ్‌ పై ఇప్పటికే సీబీఐ, ఈడీ కేసులున్నాయి 3
- మీరు మరో కేసు పెడతారా?
- భూదాన్ బోర్డు పిటిషన్ విచారణలో హైకోర్టు వ్యాఖ్యలు



కాళోజీ క్షేత్రం సిద్ధం

- 19న ప్రారంభించనున్న సీఎం
- పదేళ్లుగా నత్తనడకన పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తి

13



ఆ 2 నంబర్లు ఎందుకు పంపారు?

- తిరుపతన్న, భుజంగరావుతో మీకు ఉన్న పరిచయం ఏంటి?
- మునుగోడు ఉప ఎన్నికలో పదేపదే ఎందుకు మాట్లాడారు?
- ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు ప్రశ్నలు
- మరికొందరు నేతలకూ నోటీసులు!

డిగ్రీ రెండున్నరేళ్లలోనే!



- 4 ఏళ్ల డిగ్రీ మూడేళ్లలో చేసే అవకాశం
- నిదానంగా చదివేవారికి మూడేళ్ల డిగ్రీని 4 సంవత్సరాల్లో పూర్తి చేసే చాన్స్
- కల్పించేందుకు సిద్ధమైన యూజీసీ

చెన్నై, నవంబరు 14: విద్యార్థులందరూ ఒకేలా చదవలేరు. కొందరు పాఠాల్ని బాగా అర్థం చేసుకుని వేగంగా ముందుకు దూసుకుపోతారు. మరికొందరు.. నిదానంగా చదవగలుగుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని.. రెండు రకాల విద్యార్థులకూ వారి వారి వేగాలకు తగినట్టుగా విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని కల్పించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సిద్ధమైంది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి మూడేళ్ల డిగ్రీని రెండున్నరేళ్లలో, నాలుగేళ్ల డిగ్రీని మూడేళ్లలో పూర్తిచేసే అవకాశాన్ని, కాస్త నెమ్మదిగా చదివే విద్యార్థులకు మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లలో పూర్తిచేసే చాన్స్‌ను, చేస్తున్న కోర్సుకు మధ్యలో విరామం ఇచ్చి మళ్లీ చేరే అవకాశాన్ని కల్పించనున్నట్టు యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ గురువారం చెన్నైలో ప్రకటించారు. 'జాతీయ విద్యా విధానం, 2020' అమలుపై చెన్నైలో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమం నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "వేగంగా చదవగలిగే సామర్థ్యం ఉన్న విద్యార్థులు


మిగతా 2వ పేజీలో...

14 రకాల వివరాలివ్వండి

- పాలమూరు ఎత్తిపోతలపై కాగ్ లేఖ
- మే 31న ప్రభుత్వానికి ముసాయిదా
- అక్టోబరు 15న జవాబులిచ్చిన సర్కారు
- మరిన్ని వివరాలు కోరిన కాగ్ 3

ఆ వ్యాఖ్యలు నీచం

- అవమానకరమైనవి కూడా.. 2
- కస్తూరి వ్యాఖ్యలు హింస ప్రేరేపించేవే
- తెలుగువారి మనోభావాల్ని దెబ్బతీశారు
- ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందే
- మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం



20 నుంచి కాళేశ్వరంపై విచారణ పునఃప్రారంభం!

- 2 వారాలు హైదరాబాద్‌లోనే ఉండనున్న జస్టిస్ పీసీ ఘోష్
- ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌ల విచారణ.. ఇద్దరు నేతలకూ సమన్లు?

3



అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తులసి

- 20 ఏళ్లు సైన్యంలో సేవలు
- 2013 నుంచి హవాయి పార్లమెంటేరియన్
- 2020 ఎన్నికల్లో డెమొక్రటిక్ అధ్యక్ష రేసులో..
- 2022లో డెమొక్రటిక్‌ను వీడి రిపబ్లికన్ వైపు



వాషింగ్టన్, నవంబరు 14: అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తులసి గబార్డ్ నియమితులయ్యారు. అమెరికాకు మొట్టమొదటి హిందూ ఇంటెలిజెన్స్ చీఫ్ తులసి కావడం గమనార్హం..! అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన వెంటనే.. కీలక పదవుల్లో రిపబ్లికన్లను నియమిస్తున్నారు. ఈ క్రమంలో అత్యంత కీలక పదవులను సాధించిన వారిలో ఈలాన్ మస్క్, భారతీయ-అమెరికన్ వివేక్‌రామస్వామితోపాటు.. తులసి ఉన్నారు. అమెరికా వ్యాప్తంగా ఉన్న 18 నిఘా సంస్థలకు ఆమె డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

తులసి హిందువే.. ఇండియన్ కాదు

తులసి గబార్డ్ హిందువే అయినా.. భారత్‌తో ఆమెకు గానీ, ఆమె పూర్వీకులకు గానీ ఎలాంటి సంబంధాలు లేవు. తులసి 1981 ఏప్రిల్ 12న అమెరికాలోని లియోనేలాలో జన్మించారు. ఆమె తల్లి కారోల్ ఇండియానాకు చెందినవారు. తులసికి రెండేళ్ల వయసున్నప్పుడే వీరి కుటుంబం హవాయి దీవుల్లో స్థిరపడింది. తులసి గబార్డ్‌ను అంతా భారతీయ మూలాలున్న వ్యక్తి అనుకుంటారు. అయితే.. తాను అమెరికన్‌నే అని 2012లోనే తులసి సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. తులసి తల్లికి హిందూమతం అంటే ముందు నుంచి అభిమానం ఉండేది. దాంతో ఆమె హిందూ మతాన్ని స్వీకరించారు. అందుకే తన పిల్లలకు హిందూ పేర్లను పెట్టారు. తులసి కూడా హిందూమతాన్ని ఆచరిస్తున్నారు. 2013 నుంచి ఆమె హవాయి పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. తొలి హిందూ మహిళా పార్లమెంట్ సభ్యురాలు కూడా తులసి కావడం గమనార్హం..! పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం సమయంలో ఆమె భగవద్గీతపై ప్రమాణం చేసి, అందరినీ ఆకట్టుకున్నారు. ఆమె వైష్ణవ సంప్రదాయాన్ని పాటిస్తూ.. భగవద్గీత పఠనం, ఇస్కాన్ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటారు. తులసి వివాహం సినిమాటోగ్రాఫర్ అబ్రహం విలియమ్స్‌తో జరిగింది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పుచ్చుకున్న తులసి.. 20 ఏళ్లపాటు అమెరికా ఆర్మీ.. నేషనల్ గార్డ్‌లో సేవలందించారు. అమెరికా సైన్యం తరఫున ఇరాక్, కువైట్‌లోనూ పనిచేశారు. నిజానికి తులసి డెమొక్రటిక్ పార్టీలో చురుగ్గా ఉండేవారు. 2020 అధ్యక్ష ఎన్నికల రేసులోనూ నిలిచారు. అయితే.. పార్టీలో ఆమెకు ప్రాధాన్యం లేకపోవడంతో 2022లో రిపబ్లికన్ పార్టీలో చేరారు. ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ను ముందుండి నడిపించిన వారిలో తులసి ఒకరు. తులసిని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రకటించే సందర్భంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తులసి ఒక గర్వించదగ్గ వ్యక్తి అని, ఆమె అమెరికాకు కీర్తిని తీసుకువస్తారని వ్యాఖ్యానించారు.

క్యాబినెట్‌లో మరో ఇద్దరు

ట్రంప్ ఈసారి తన క్యాబినెట్‌ను యువతతో భర్తీ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మరో ఇద్దరి పేర్లను ప్రకటించారు. వారిలో అటార్నీ జనరల్‌గా మాట్‌గేట్జ్‌ను.. విదేశాంగ మంత్రిగా ఫ్లోరిడా పార్లమెంట్ సభ్యుడు మార్కో రుబియోను నియమించారు.



కెనడాకు నో.. ఆస్ట్రేలియాకు సై!

- మారుతున్న భారత విద్యార్థుల ప్రాధాన్యతలు

న్యూఢిల్లీ, నవంబరు 14: కెనడా వీసా విధానంలో మార్పుల నేపథ్యంలో భారతీయ విద్యార్థుల ప్రాధాన్యతలు మారుతున్నాయి. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా, యూరప్ దేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భారత్ సహా 16 దేశాలకు చెందిన విద్యార్థులు త్వరగా వీసాలు పొందడానికి సహాయపడే ఫాస్ట్‌ట్రాక్ స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్) ప్రోగ్రామ్‌తోపాటు నైజీరియా స్టూడెంట్ ఎక్స్‌ప్రెస్ పథకాన్ని కెనడా గతవారం రద్దు చేసింది. కెనడాలో ఉద్యోగం రావడం వల్ల అక్కడ శాశ్వత నివాసం పొందడానికి అవకాశం కల్పించే పోస్టు గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ల (పీజీడబ్ల్యూపీ) అర్హతల్లోనూ ట్రూడో ప్రభుత్వం గతేడాది మార్పులు చేసింది. ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ విద్యార్థి అనుమతులపై రెండేళ్ల పరిమితిని విధించింది. ఈ కొత్త నిబంధనలతో కెనడా వెళ్లాలనుకున్న భారత విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. కేరళకు చెందిన ఓ విద్యార్థి కెనడాలోని వర్సిటీలో అడ్మిషన్ కోసం ఫీజు కట్టిన తర్వాత ఆ సీటును వదిలేసుకున్నారు. ఢిల్లీకి చెందిన ఓ కన్సల్టెంట్ తరఫున గతేడాది 50మంది విద్యార్థులు కెనడా వెళ్తే ఈసారి నలుగురికే పరిమితమైంది. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు ఫ్రాన్స్, ఐర్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వెళ్లడానికి ఆసక్తి చూపిస్తున్నారని ఆ కన్సల్టెంట్ నిర్వాహకులు తెలిపారు. 2023లో భారత విద్యార్థుల నమోదు 29% పెరిగిందని ఆస్ట్రేలియా హైకమిషన్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి1నాటికి ఇతర దేశాలకంటే కెనడాలో అత్యధికంగా 4.27లక్షల మంది భారతీయ విద్యార్థులున్నారని విదేశీ వ్యవహారాలశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆ తర్వాత అమెరికాలో 3.37లక్షలు, యూకేలో 1.85 లక్షలు, ఆస్ట్రేలియాలో 1.22లక్షల మందికిపైగా ఉన్నారు. ఈయూలో, జర్మనీ, ఫ్రాన్స్, ఐర్లాండ్‌లోనూ అత్యధిక సంఖ్యలో భారత విద్యార్థులున్నారు.

ఢిల్లీలో అతిపెద్ద ప్రభుత్వ పాఠశాల

- 131 గదులు, 7 ల్యాబ్‌లు, లిఫ్ట్ వంటి అత్యాధునిక వసతులు

న్యూఢిల్లీ, నవంబరు 14: దేశ రాజధాని ఢిల్లీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన అతిపెద్ద ప్రభుత్వ పాఠశాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆతిశీ గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు. సుందర్‌నగరిలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో 131 గదులు, 7 ల్యాబ్‌లు, లెక్చర్ హాల్, గ్రంథాలయం, లిఫ్ట్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ఈ పాఠశాలను నిర్మించినట్లు సీఎం ఆతిశీ 'ఎక్స్' వేదికగా తెలిపారు. భూమాఫియా నుంచి స్వాధీనం చేసుకున్న స్థలంలో నిర్మించిన ఈ బడి... వేల మంది పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు.

బోయింగ్‌లో 17 వేల మంది ఉద్యోగుల తొలగింపు!

న్యూయార్క్, నవంబరు 14: బోయింగ్ సంస్థ.. అంతర్జాతీయంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా దాదాపు 17వేల మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో ఇది 10శాతంకావడం గమనార్హం. అమెరికాలోని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నట్లు సంస్థ తెలిపింది. అయితే నోటీసులిచ్చిన ఉద్యోగులకు జనవరివరకు వేతనాలు చెల్లిస్తామని పేర్కొంది. "మా వాస్తవ ఆర్థిక పరిస్థితులకనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించాం. అలాగే ప్రాధమ్యాలపై మరింత దృష్టిపెట్టనున్నాం"అని బోయింగ్ ప్రకటించింది. బోయింగ్ కొత్త సీఈవో కెల్లీ ఆర్ట్‌బెర్గ్ నేతృత్వంలో ఉద్యోగుల తొలగింపు నోటీసులు జారీ అవుతున్నాయి. బోయింగ్ ఎక్కువగా విక్రయించే 737 మ్యాక్స్ విమానాల తయారీని పునఃప్రారంభించేందుకు సీఈవో చర్యలు చేపడుతున్నారు. 33వేల మంది అమెరికా వెస్ట్ కోస్ట్ ఉద్యోగుల సమ్మెతో విమానాల ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ ఏడాది జనవరిలో 737మ్యాక్స్ విమానం గాల్లో ఉండగానే డోర్ ప్యానెల్ ఊడిపోయింది. అప్పట్నుంచి బోయింగ్ వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నాటి సీఈవో రాజీనామా చేశారు. భద్రతా ప్రమాణాల విషయంలో నియంత్రణ సంస్థల తనిఖీలతో విమానాల ఉత్పత్తి మందగించింది.

మణిపూర్‌లో మళ్లీ సాయుధ దళాల చట్టం

న్యూఢిల్లీ, నవంబరు 14: మణిపూర్‌లో తాజా ఉద్రిక్తతల వేళ కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలోని ఆరు పోలీసుస్టేషన్ల పరిధిలో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని విధిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ఇంఫాల్ జిల్లాలోని సెక్మయ్, లాంసంగ్, లామ్‌లై, జిరిమామ్ జిల్లాలోని జిరిబామ్, కాంగ్పోక్పి జిల్లాలోని లైమాఖోంగ్, బిష్ణుపూర్ జిల్లాలోని మాయిరంగ్ ప్రాంతాలలో ఈ చట్టాన్ని విధించింది.

ట్రంప్ ద్వేషులకో ట్రిప్పు..

- నాలుగేళ్ల పర్యాటక ప్యాకేజీ ప్రకటించిన అమెరికా క్రూయిజ్ సంస్థ

న్యూయార్క్, నవంబరు 14: "చెరుకు మిషన్‌లో చెయ్యి అయినా పెడతాం గానీ.. డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమెరికాలో ఉండలేం బాబోయ్".. అనే స్థాయిలో ట్రంప్‌ను ద్వేషించేవారి కోసం అమెరికాకు చెందిన విల్లా వై రెసిడెన్సెస్ అనే లగ్జరీ క్రూయిజ్ సంస్థ నాలుగేళ్ల ప్రపంచ ట్రిప్పును ప్రకటించింది. ఈ ట్రిప్పునకు..'స్కిప్ ఫార్వార్డ్' అనే పేరు పెట్టింది. అంటే ఈ క్రూయిజ్‌లో వెళ్లేవారు తిరిగి అమెరికాకు వచ్చేసరికి ట్రంప్ నాలుగేళ్లపాలన పూర్తయి ఉంటుందన్నమాట!! ట్రిప్పులో భాగంగా ప్రయాణికులను 'విల్లా వై ఒడెస్సీ' అనే క్రూయిజ్‌లో నాలుగేళ్లపాటు ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని 400 ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు తిప్పుతారు. టికెట్ ధరలు మన కరెన్సీలో రూ.1.35 కోట్ల నుంచి (డబుల్ ఆక్యుపెన్సీ-ఒకే గదిలో ఇద్దరుంటే), రూ.2.2కోట్ల దాకా (సింగిల్ ఆక్యుపెన్సీ) ఉన్నాయి. ఇది కేవలం ట్రంప్ ద్వేషుల కోసమే ఉద్దేశించిందికాదని, ఎన్నికల్లో ఎవరు గెలిచినా వారి వ్యతిరేకులు ప్రశాంతత కోసం అలా తిరిగొచ్చేందుకే ఎన్నికలకు ముందే ఈ ప్యాకేజీని రూపొందించామని విల్లా వై సీఈవో మైకేల్ పీటర్సన్ తెలిపారు. నాలుగేళ్లు ప్రయాణించలేని వారుంటే ఏడాది, రెండు, మూడేళ్ల ప్యాకేజీలూ ఉన్నాయన్నారు.

'ఎక్స్'కు బైబై.. ఖాతాలు మూసేస్తున్న అమెరికా యూజర్లు

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచాక.. అగ్రదేశానికి చెందిన యూజర్లు పెద్దఎత్తున 'ఎక్స్'లో తమ ఖాతాలు మూసేస్తున్నారు. ఇప్పటి వరకు 1,15,000 మందికిపైగా ఎక్స్ నుంచి వైదొలగినట్లు ఓ నివేదికలో సీఎన్ఎన్ పేర్కొంది.

సౌతాఫ్రికాలో బంగారు గనిలో 4వేల మంది బందీ

న్యూఢిల్లీ, నవంబరు 14: సౌతాఫ్రికాలో మూసివేసిన ఓ బంగారు గనిలో తవ్వకాలు జరిపేందుకు 4వేల మంది అక్రమంగా ప్రవేశించారు. నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లోని స్టిఫోంటిన్ అనేచోట గనిలోకి వీరు ప్రవేశించారు. బంగారం ఏమైనా దొరుకుతుందేమోనన్న ఆశతో గనిలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఇలా వెళ్లినవారంతా లోపలే ఉండిపోయారు. అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక విధానం అమల్లో ఉండటంతో వీరిని కాపాడేందుకు దక్షిణాఫ్రికా ప్రభుత్వం ససేమిరా అంటోంది. 'నేరస్థులకు సాయం చేసేది లేదు' అని ప్రకటించింది. వారు గనిలోంచి బయటకురాకుండా ద్వారాలను మూసివేసి.. నిత్యావసరాలను అందించకుండా చర్యలు చేపట్టింది. అయితే గనిలో చిక్కుకుపోయిన వారంతా ఆహారం, నీరు, ఇతర కనీస అవసరాల కొరతతో అల్లాడిపోతున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వారు బయటకొస్తే అరెస్టు చేసేందుకు క్లోజ్ హోల్ ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ మేరకు అక్కడ ప్రత్యేక సిబ్బందిని మోహరించింది. అక్రమంగా గనిలోకి ప్రవేశించిన మైనర్లకు ప్రభుత్వం ఎలాంటి సాయమూ చేయదు అని ఓ మంత్రి స్పష్టం చేశారు.

కెనడా మా సొంతం: మీరు ఇంగ్లండ్ వెళ్లిపోండి

- స్థానికులకు ఖలిస్థాన్‌వాదుల హెచ్చరిక
- వారంతా దురాక్రమణదారులని వ్యాఖ్య
- తీవ్రవాదులపై ప్రధాని ట్రూడో మెతక వైఖరి
- భారత నిఘా వర్గాల అంచనా



అట్టావా, నవంబరు 14: కెనడాలో ఖలిస్థాన్ సానుభూతిపరులు మరో వివాదానికి తెరతీశారు. ఇంతవరకు హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసిన వారు తాజాగా స్థానికులైన కెనడా వాసులనే హెచ్చరించడం ప్రారంభించారు. తమ కష్టాలకు భారతదేశమే కారణమంటూ నిందిస్తూ వచ్చిన ఖలిస్థాన్ వాదులు ఇప్పుడు స్థానికులపై విమర్శలు గుప్పిస్తున్నారు "మీరంతా దురాక్రమణదారులు. తిరిగి ఇంగ్లండ్, యూరోప్‌లకు వెళ్లిపోండి" అని హెచ్చరించారు. ఇటీవల జరిగిన నగర సంకీర్తనలో పాల్గొన్న కొందరు వ్యక్తులు ఇలాంటి హెచ్చరిక చేస్తూ రెండు నిమిషాల నిడివిగల వీడియోను విడుదల చేశారు. "ఇది కెనడా. మా సొంత దేశం. మీరు సొంత దేశాలకు తిరిగి వెళ్లిపోండి" అని హెచ్చరించడం అందులో కనిపించింది.

దీనిపై భారత నిఘా వర్గాలు స్పందిస్తూ కెనడాలో ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో సర్వసాధారణమయ్యాయని అభిప్రాయపడ్డాయి. అక్కడ తగిన నిఘా లేకపోవడంతో వారు అన్ని వ్యవస్థలను అదుపు చేస్తున్నారని తెలిపాయి. భద్రంగా ఉండాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండు చేస్తూ వచ్చిన వారు ఇప్పుడు స్థానికులను కూడా అదే విధంగా హెచ్చరిస్తున్నారని పేర్కొన్నాయి. ఖలిస్థాన్ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకొని ఇండియా ఏజెంట్లు పనిచేస్తున్నారంటూ సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో ప్రకటించిన దగ్గర నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇరుదేశాల దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకునే వరకు పరిస్థితి వెళ్లింది. ట్రూడో ఆరోపణలను ఖండించిన భారత్.. ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఆయనే ఆశ్రయం కల్పిస్తున్నారని ప్రత్యారోపణ చేసింది. ఖలిస్థాన్‌వాదులు భారత్‌లో అల్లర్లు సృష్టించడానికి కుట్ర పన్నుతుండడంతో పాటు, కెనడాలోని హిందువులపైనా దాడులు చేస్తున్నారని తెలిపింది. ప్రజాదరణ కోల్పోయిన తన పార్టీ ఎంపీ జగ్మీత్ సింగ్‌ను వచ్చే ఏడాదిలో జరిగే ఎన్నికల్లో గెలిపించడానికే ట్రూడో ఖలిస్థాన్‌వాదులకు మద్దతు ఇస్తున్నారని భారత నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే ఎలాంటి ఆధారాలు లేకుండానే భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నాయి. 'ప్రతిదానికీ భారత్‌ను నిందిస్తూ ట్రూడో చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తున్నారు. ఐఎస్ఐ, ఖలిస్థాన్‌వాదుల చేతిలో చిక్కుకొని ఎంత ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారో గుర్తించడం లేదు. రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలను దెబ్బ తీస్తున్నారు" అని వ్యాఖ్యానించాయి. కొందరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఖలిస్థాన్ సానుభూతిపరుల హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆరోపణలు చేశానని ట్రూడో గతంలో చెప్పారు. అయితే ఆ నాయకుల పేర్లు చెబితే వారి గుణగణాలతో పాటు అన్ని వివరాలు చెబుతామని నిఘా వర్గాలు అంటున్నాయి. కెనడా పార్లమెంటు మొత్తం ఖలిస్థాన్ సానుభూతిపరులతో నిండిపోయింది. వారు ట్రూడోపై కూర్చొని స్వారీ చేస్తున్నారు. కొందరు వ్యక్తులు చెప్పిన మాట లు నమ్మి ఆయన భారత్‌పై ఎలా అరోపణలు చేయగలుగుతారు?" అని నిఘా వర్గాలు వ్యాఖ్యానించాయి.

కెనడాలో మారుతున్న పరిస్థితుల్లో త్రిశంకు స్వర్గంలో తెలుగు యువత

- మనోవ్యథతో మానసిక రుగ్మత
- శ్రమ దోపిడీ చేస్తున్న వ్యాపారస్థులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉత్తర అమెరికాలో తేలిగ్గా శాశ్వత నివాస వసతి పొందే ఆవకాశాలున్న కెనడాలో బంగారు భవిష్యత్తు కోసం వచ్చిన తెలుగువారు సహా వేల మంది భారతీయ యువకులు దేశంలో మారుతున్న నివాస వీసా నిబంధనలు, సన్నగిల్లుతున్న ఉపాధి అవకాశాల కారణంగా అయోమయంలో కొట్టామిట్టాడుతున్నారు. దీనికి తోడు ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణిస్తుండటంతో వీరు అగమ్యగోచర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాలపై ఆశతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అప్పులు చేసి కెనడాకు రాగా మరోవైపు ఆశించిన విధంగా ఉపాధి అవకాశాలు లేక వీసా గడువు సమీపిస్తుండటంతో నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక మంది మానసిక రుగ్మతలకు గురై మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సునాయసంగా లభించే శాశ్వతనివాస వీసా, పుష్కల ఉపాధి ఆవకాశాల కారణంగా కొద్దికాలం క్రితం వరకు భారతీయ విద్యార్థులకు కెనడా ఒక భూతల స్వర్గంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో భారతీయ విద్యార్థులు ఉన్న దేశంగా కెనడా నమోదైంది. అమెరికాలో 3.37 లక్షల మంది భారతీయ విద్యార్థులుండగా అదే కెనడాలో 4.27లక్షల మంది ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ గణంకాలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పెరిగిపోతున్న విదేశీ విద్యార్థుల సంఖ్యను తగ్గించడానికి కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రానున్న సంవత్సరానికి విదేశీ విద్యార్థుల కోటాను 4.37 లక్షలకు కుదించింది కానీ అందులో సగం కూడా కెనడాకు వెళ్లకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కెనడాలోని విదేశీ విద్యార్థుల్లో దాదాపు సగం కంటే ఎక్కువ మంది భారతీయులే ఉండటం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా భారతదేశంలో గతంలో ఉన్న 27 మంది కెనడా వీసా అధికారులను ప్రస్తుతానికి కెనడా ప్రభుత్వం ఏడుకు తగ్గించడంతో వీసా జారీలో జాప్యం జరుగుతుందనేది మరో విషయం. టొరంటో, వాంకోవర్, మోంట్రియల్, ఒట్టవాతో సహా దేశవ్యాప్తంగా ఇంటి అద్దెలు పెరగడం, అనూహ్యంగా జీవన వ్యయం పెరుగుతుండటం మరోవైపు ఉపాధి ఆవకాశాలు లేకపోవడంతో జీవన్మరణ సమస్యగా మారుతోంది. పది డాలర్లకు అయిదు సమోసాలను పంజాబీల నుంచి కొనుగోలు చేస్తున్నామంటే ద్రవ్యోల్బణం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునని ఏపీలోని గుంటూరుకు చెందిన సామినేని విజయ చౌదరి వ్యాఖ్యానించారు.

తినడానికి తిండి లేక..

ఒక వైపు ఉద్యోగాలు లేక మరోవైపు తినడానికి సరిగ్గా తిండి కూడా లేక అవస్థలు పడుతున్నామని తమ దీన స్థితి గురించి స్వదేశంలోని తమ తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోతున్నట్లుగా కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి లేదా తల్లిదండ్రుల కష్టార్జితాన్నంతా వెచ్చించి ఉన్నత విద్య అంటూ గొప్పగా వచ్చిన విద్యార్థుల్లో అత్యధికులు ఇక్కడ క్లీనర్లు, వెయిటర్లుగా పని చేస్తుండగా అందులో సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేయడమే గొప్ప అని మురిసిపోయే పరిస్థితి దాపురించింది. నిబంధనలకు విరుద్ధంగా 20 గంటలకు మించి అడ్డదారిలో నగదు విధానం కింద పనిచేస్తే సాధారణంగా ఈ అడ్డదారిన పని ఇచ్చే పంజాబీ, గుజరాతీ, తెలుగువాళ్లు కొందరు సగానికి సగం వేతనం తగ్గించి ఇవ్వడం.. అనేక సందర్భాలలో దాన్ని కూడా ఎగ్గొడుతూ శ్రమదోపిడీ చేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో ఆప్ విజయం

- కేవలం 3 ఓట్ల మెజార్టీతో గెలుపు
- డిప్యూటీ మేయర్ పదవి ఏకగ్రీవం


మహేశ్ కిచి

న్యూఢిల్లీ, నవంబరు 14: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆమ్ ఆద్మీ పార్టీకి పెద్ద ఊరట లభించింది. గురువారం జరిగిన ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి, దళిత నాయకుడు మహేశ్ కిచి విజయం సాధించారు. ప్రత్యర్థి బీజేపీకి చెందిన కిషన్‌లాల్‌పై ఆయన కేవలం మూడు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మహేశ్‌కు 133 ఓట్లు రాగా, కిషన్‌లాల్‌కు 130 ఓట్లు లభించాయి. పరిస్థితిని గమనించిన బీజేపీ డిప్యూటీ మేయర్ పదవికి తన అభ్యర్థి నీతా బిష్త్‌ను పోటీ నుంచి ఉపసంహరించుకొంది. దాంతో ఆ పదవికి ఆప్ అభ్యర్థి రవీందర్ భరద్వాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎనిమిది మంది ఆప్ కౌన్సిలర్లు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి బీజేపీకి ఓటు వేసినా ఆప్ అభ్యర్థి విజయం సాధించారు. బీజేపీకి చెందిన ఒకరు, ఆప్‌నకు చెందిన మరొకరు మొత్తం ఇద్దరు కౌన్సిలర్ల ఓట్లు చెల్లలేదు. ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. చివరి నిమిషంలో ఓ కాంగ్రెస్ కౌన్సిలర్ పార్టీకి రాజీనామా చేసి ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు తెలిపారు. ఇన్ని మలుపుల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో తమ పార్టీ విజయం సాధించడంతో ఆప్ కౌన్సిలర్లు జై భీం అంటూ నినాదాలు చేశారు. నిజానికి మేయర్ ఎన్నిక ఏప్రిల్‌లో జరగాల్సి ఉన్నప్పటికీ వివిధ సాంకేతిక కారణాలతో ఇంతవరకు వాయిదా పడుతూ వచ్చింది. అయితే నూతన మేయర్ పదవిని మొత్తం కాలానికి కాకుండా కేవలం నాలుగు నెలలకే పరిమితం చేశారంటూ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఆప్ దళిత వ్యతిరేకి అని ఆరోపించింది. ఈ కారణంగానే ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు తెలిపింది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగినప్పటికీ వివిధ సాంకేతిక కారణాలతో మేయర్ ఎన్నికలు జరగక ఏడు నెలలు వృథా అయ్యాయి. దాంతో మిగిలిన అయిదు నెలలుకే మేయర్ పదవీ కాలం పరిమితమయింది.

డిగ్రీ రెండున్నరేళ్లలోనే!

(మొదటి పేజీ తరువాయి)

ఇకపై తక్కువ సమయంలోనే డిగ్రీ ప్రోగ్రాములను పూర్తిచేయొచ్చు. దీని ద్వారా వారికి ఆర్నెల్ల నుంచి ఏడాది సమయం కలిసొస్తుందని మేం భావిస్తున్నాం" అని ఆయన వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వికామకోటి నేతృత్వంలోని కమిటీ సమర్పించిన నివేదికను బుధవారం ఆమోదించినట్టు తెలిపారు. దీనికి సంబంధించి సవివర మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు. అలాగే, నిబంధనలను ఉల్లంఘించి, నాసిరకం పీహెచ్‌డీలను ప్రదానం చేస్తున్న 20 యూనివర్సిటీలను గుర్తించి, వాటిపై నిఘా పెట్టామని జగదీశ్ కుమార్ చెప్పారు. లోపాలు ఉన్నట్టు విచారణలో తేలితే ఆ వర్సిటీలు పీహెచ్‌డీలు ఇవ్వకుండా నిషేధిస్తామని స్పష్టం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రాణాలైనా ఇస్తా: రాహుల్


మహారాష్ట్రలోని నాందెడ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ; చిత్రంలో తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నదుర్బార్(మహారాష్ట్ర), నవంబరు 14 : భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నదుర్బార్‌లో రాహుల్ గాంధీ గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. తన చేతిలో రెడ్ బుక్(రాజ్యాంగం ప్రతి) ఉండడాన్ని అర్బన్ నక్సలిజం అంటూ బీజేపీ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలపై రాహుల్ ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని ఒక్కసారి కూడా చదవకపోవడం వల్లే రెడ్ బుక్‌లో ఏం లేదని, ఖాళీ అని మోదీ అంటున్నారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం భారతదేశ ఆత్మ అని విషయాన్ని మోదీ గ్రహించాలని అన్నారు. బిర్సా ముండా, మహాత్మా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ తదితర మహనీయుల స్ఫూర్తి రాజ్యాంగంలో ఉందని తెలిపారు. రాజ్యాంగంలో ఏమీ లేదని అంటే ఆ మహనీయులను అవమానించినట్టేనని అన్నారు. ఆదివాసీలను వనవాసీలని పిలుస్తూ బీజేపీ, ఆరెస్సెస్ గిరిజనులను అవమానిస్తున్నాయని ఆరోపించారు. గిరిజనులు అడవికే పరిమితం కావాలనేది బీజేపీ ఆలోచనని చెప్పారు. అంతేకాక, దేశంలో ఆదివాసీలు, దళితులు, బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియాలంటే కుల గణన చేపట్టాల్సిందేనని పునరుద్ఘాటించారు. ఆదివాసీలు, దళితులు, బీసీలకు రాజ్యాధికారం ఉండాలనేది తన లక్ష్యమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

సీనియర్ కథారచయిత వుప్పల నరసింహం కన్నుమూత

- మావోయిస్టులపై పలు విమర్శనాత్మక రచనల ప్రచురణ



హైదరాబాద్ సిటీ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథారచయిత, కవి, మావోయిస్టు సిద్ధాంతంపై విమర్శనాత్మక రచనలు చేసిన వుప్పల నరసింహం(70) కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం గోల్నాకలోని స్వగృహంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలడంతో సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నరసింహం స్వస్థలం రంగారెడ్డి జిల్లా దేవరయాంజల గ్రామం. ఆంధ్రప్రభలో సుదీర్ఘకాలం పాత్రికేయుడిగా సేవలందించారు. మావోయిస్టు సిద్ధాంతాన్ని విమర్శిస్తూ 'రక్తచరిత్ర', 'జంగల్‌నామాపై జనం ప్రజా ప్రశ్న', 'విధ్వంసమే విప్లవమా?' తదితర రచనలు చేశారు. ఆయన రాసిన కథలు 'మట్టి మనిషి' సంపుటిగా వెలువడ్డాయి. నరసింహం మృతిపట్ల పలువురు కవులు, రచయితలు, పాత్రికేయ సంఘం ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. నరసింహం అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు గోల్నాకలోని శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అవి నీచమైన, అవమానకరమైన వ్యాఖ్యలు

- కస్తూరి వ్యాఖ్యలు ముమ్మాటికీ హింసను ప్రేరేపించేలా ఉన్నాయి
- మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం
- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



చెన్నై, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన వారే తెలుగువారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీనటి కస్తూరి పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష ప్రేరేపితమేనని తేల్చిచెప్పింది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కస్తూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై తమిళనాడులో పలు చోట్ల కేసులు నమోదవ్వగా, ముందస్తు బెయిల్ కోసం కస్తూరి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ నేతృత్వంలోని మదురై ధర్మాసనం విచారణ జరిపింది. ఇప్పటికే కస్తూరి క్షమాపణ చెప్పినందున కేసుల్ని కొట్టివేయాలని ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థించగా, జాతివిద్వేష వ్యాఖ్యలు చేసిన కస్తూరికి ముందస్తు బెయిల్ ఇవ్వరాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'వాక్ స్వాతంత్ర్యం అనేది వ్యక్తు లు తమ ఆలోచనలు, నమ్మకాలు, అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ఉన్న ప్రాథమిక హక్కు. అయితే ఆ మాటలు విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికో, లేదా మత సామరస్యాన్ని దెబ్బ తీయడానికో దుర్వినియోగం చేయకూడదు. కస్తూరి వ్యాఖ్యలు ముమ్మాటికీ హింసను ప్రేరేపించేవిలా ఉన్నాయి. బహిరంగ వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సింది. ఆమె మాట్లాడినప్పుడు ప్రేక్షకుల నుంచి చప్పట్లు ఉండవచ్చు. కానీ, ఆ మాటలు తెలుగు ప్రజల మనోభావాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇది మొత్తం తెలుగు ప్రజలను కించపరచినట్లయింది. మన లాంటి వైవిధ్యభరితమైన దేశంలో ఇలాంటి వ్యాఖ్యలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయోనని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. ఇలాంటి నీచమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేసినవారెవరైనా చట్టప్రకారం విచారణను ఎదుర్కోవాల్సిందే' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. కస్తూరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

ఢిల్లీలో తీవ్ర కాలుష్యం.. ప్రైమరీ స్కూళ్ల మూసివేత

- పలు విమానాల దారి మళ్లింపు.. బీఎస్3, 4 వాహనాలపైనా ఆంక్షలు



న్యూఢిల్లీ, నవంబరు 14: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం మితిమీరిన కారణంగా ప్రాథమిక పాఠశాలలన్నింటినీ మూసివేస్తున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేదాకా ఆన్‌లైన్‌లోనే తరగతులు నడుస్తాయని ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ 'ఎక్స్'లో వెల్లడించారు. వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ)... వరుసగా రెండో రోజు అత్యంత ప్రమాదకర స్థాయిలో 400 మార్కు దాటడంతో ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో శుక్రవారం నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులను నిలిపివేయనున్నారు. బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ వాహనాలను రోడ్లపైకి అనుమతించరు. తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో ఇప్పటికే సుమారు 350 విమానాలకు అంతరాయం ఏర్పడిందని ఫ్లైట్ రాడార్ 24 సంస్థ వెల్లడించింది. పలు విమానాలను జైపూర్, లక్నో తదితర నగరాలకు దారి మళ్లించారు. ఢిల్లీకి వచ్చే రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి.

మేమే పర్యవేక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సుమోటోగా పిటిషన్ నమోదు చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. గచ్చిబౌలిలోని రామమ్మ కుంటను ఆక్రమించి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం) భవనం నిర్మించారని హ్యూమన్‌రైట్స్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెల్ అనే సంస్థ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. జూలై 24న ఈ పిటిషన్ విచారణ సందర్భంగా గతంలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న అన్ని జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తిస్తూ ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా గురువారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం, హెచ్ఎండీఏ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదించారు. నవంబరు 14 నాటికి 464 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. మరో 3,068 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వడానికి మూడు నెలల గడువు ఇవ్వాలని కోరారు.

పిల్ వేశాక పిటిషనర్‌కు హక్కులు ఉండవు..

ప్రభుత్వం అన్ని చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందని.. మరింత సమయం ఇవ్వాలని కోరడాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ 5 శాతం చెరువులకు కూడా ఎఫ్‌టీఎల్ ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. దీంతో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం అంటే వ్యతిరేక పిటిషన్ కాదని.. ఒక్కసారి పిల్ ద్వారా విషయం కోర్టు దృష్టికి వచ్చిన తర్వాత సదరు అంశంపై పిటిషనర్ హక్కును కోల్పోతారని.. దానికి సరైన ముగింపునకు తీసుకొచ్చే బాధ్యత తమపై ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసలు పిటిషన్ దాఖలైంది ఒక్క రామమ్మ కుంట గురించి మాత్రమేనని.. తాము సుమోటోగా హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని చెరువుల వివరాలు కోరామని వ్యాఖ్యానించింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ అంశాన్ని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా సుమోటో పిటిషన్ నమోదు చేస్తామని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రత్యేకంగా పిటిషన్ రిజిస్టర్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. ఇక రామమ్మ కుంట బఫర్ జోన్‌లో అక్రమంగా ఎన్ఐటీహెచ్ఎం భవనం నిర్మించారన్న అంశంపై ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. సదరు కుంటకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌లోని హద్దుల ప్రకారం బఫర్‌జోన్‌లో ఉన్న ఎన్ఐటీహెచ్ఎం భవనంలోని భాగాన్ని తొలగించామని పేర్కొన్నారు. దీనిని పిటిషనర్ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. అక్రమ నిర్మాణాల్లో కొంతభాగం మాత్రమే తొలగించారని.. అక్కడికి వెళ్లి పరిశీలించడానికి తమను అనుమతించడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంయుక్త సర్వేకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఆ వాదనలను అఫిడవిట్ల రూపంలో ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా పడింది.

20 నుంచి కాళేశ్వరంపై విచారణ పునఃప్రారంభం!

- 2 వారాలు హైదరాబాద్‌లోనే ఉండనున్న జస్టిస్ పీసీ ఘోష్
- ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌ల విచారణ.. ఇద్దరు నేతలకూ సమన్లు ?

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ ఈ నెల 20 నుంచి పునఃప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ రెండు వారాలపాటు హైదరాబాద్‌లోనే ఉండనున్నారు. ఈనెల 20 నుంచి ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. కమిషన్ విచారణ పూర్తిచేసి నివేదిక ఇచ్చేందుకు డిసెంబరు ఆఖరు వరకు గడువు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం జీవో జారీ చేయడంలో జాప్యం కారణంగా విచారణ రెండు వారాలు ఆలస్యమైంది. ఈ నెల 12 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ చేపట్టాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయించగా.. ప్రభుత్వం మాత్రం కమిషన్ గడువును పెంచే జీవోను ఈనెల 13న విడుదల చేసింది. జీవో కోసం 13 రోజులుగా వేచిచూసిన జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వ తీరుపై కాస్త నారాజ్ అయినట్లు సమాచారం. ఇక ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్/మాజీ ఐఏఎస్‌లను విచారించిన అనంతరం...మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఇద్దరు మాజీ కీలక ప్రజాప్రతినిధులను విచారణకు రావాలని సమన్లు పంపనుంది. వీరి విచారణకు అవసరమైన సాక్ష్యాలను ఇప్పటికే కమిషన్ సేకరించింది. ఈనెలాఖరున లేదా డిసెంబరు తొలి వారంలో ఇద్దరికి సమన్లు పంపే అవకాశాలున్నాయి. డిసెంబరులో నివేదికకు తుదిరూపునిచ్చి నెలాఖరులో ప్రభుత్వానికి సమర్పించేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

ఏసీబీకి పట్టుబడ్డ లింగంపేట ఎస్సై

- స్టేషన్ బెయిల్ కోసం రూ. 10 వేల డిమాండ్
- ఎస్సై, రైటర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

లింగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ. 10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడో ఎస్సై. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ గౌడ్ కొన్ని రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్సై అరుణ్ అతడిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ కేసులో స్టేషన్ బెయిల్ కోసం ఎస్సైని సంప్రదించగా రూ.10వేలు లంచం డిమాండ్ చేయడంతో శివకుమార్ ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం పోలీసు స్టేషన్‌లో శివకుమార్ నుంచి రైటర్ రామస్వామి రూ.10వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

హైదరాబాద్ - నాగ్‌పూర్ కారిడార్ అభివృద్ధికి చర్యలు

చొరవ తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. జహీరాబాద్ వద్ద ఇప్పటికే పూర్తయిన భూ సేకరణ

- న్యాల్‌కల్, జరాసంగంలోని 17 గ్రామాలూ ఇందులో భాగమే
- 'ఆంధ్రజ్యోతి'తో ఎన్ఐసీడీసీ ఎండీ రజత్ కుమార్ సైనీ


రజత్ కుమార్ సైనీ

న్యూఢిల్లీ, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్ అభివృద్ధికి వేగంగా చర్యలు ప్రారంభమయ్యాయని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఐసీడీసీ) ఎండీ రజత్ కుమార్ సైనీ చెప్పారు. రేవంత్ రెడ్డి రెండు సార్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌ను కలుసుకుని ఈ కారిడార్ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిందిగా కోరారని సైనీ గురువారం ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. దీనికి సంబంధించి జహీరాబాద్ వద్ద భూసేకరణ కూడా పూర్తయిందన్నారు. ఇక్కడ రక్షణ రంగానికి చెందిన వెమ్ టెక్నాలజీస్ ఇప్పటికే కొనసాగుతుండగా, కొరియన్ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండై సంస్థ వచ్చిందని, ఈ సంస్థకు 300 ఎకరాలు ప్రభుత్వం కేటాయించిందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీల్లో ఒకటైన జహీరాబాద్ పారిశ్రామిక సిటీలో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశాలున్నాయని సైనీ చెప్పారు. 3,245 ఎకరాల్లో రూ. 2361 కోట్ల వ్యయంతో ఏర్పడే ఈ సిటీలో రూ. 15వేల కోట్ల మేరకు పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం ఉందని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్, జరాసంగం మండలాల్లోని 17 గ్రామాలు ఇందులో భాగంగా ఉంటాయన్నారు. హైదరాబాద్‌కు 80 కిమీ దూరంలో నిర్మాణమయ్యే ఈ పారిశ్రామిక నగరం పూణే-మచిలీపట్టణం జాతీయ రహదారికి సమీపంలో ఉంటుందని తెలిపారు. ఉత్తర దక్షిణ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో వ్యూహాత్మకమైన ప్రదేశంలో జహీరాబాద్‌కు, హైదరాబాద్‌లో టెక్ పరిశ్రమకు పూర్తిగా అందుబాటులో ఉందన్నారు. ఆటోమొబైల్, ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలపై ఇక్కడ దృష్టి సారించవచ్చని సైనీ తెలిపారు.

మారనున్న కృష్ణ పట్నం రూపురేఖలు

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణ పట్నం రూపురేఖలు మార్చే బెంగళూరు- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. 2026 నాటికి కృష్ణపట్నం వద్ద పోర్ట్ ఆధారిత అభివృద్ధి పూర్తి అవడంతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టి పెట్టుకుని నిర్మించే ఒక అద్భుతమైన పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పడుతుందని సైనీ తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ కారిడార్ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుని, శరవేగంతో భూసేకరణ పూర్తి చేశారని సైనీ చెప్పారు. చంద్రబాబు ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాణిజ్యమంత్రి పీయూష్ గోయెల్‌తో మూడుసార్లు చర్చలు జరిపారని ఆయన గుర్తు చేశారు. 3 దశల్లో మొత్తం 11,098 ఎకరాలు ఈ కారిడార్‌లో అభివృద్ధి చెందుతాయని సైనీ తెలిపారు.

సైనీ రాకతో కారిడార్ల అభివృద్ధి పనుల్లో వేగం

తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ సైనీ ఢిల్లీ ఐఐటి నుంచి బీటెక్, హార్వర్డ్ నుంచి ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌లో మాస్టర్స్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ విభాగం డైరెక్టర్‌గా పనిచేసి డైనమిక్ అధికారిగా గుర్తింపు పొందారు. గత ఏడాది జులైలో సైనీని ఎన్ఐసిడిసి సీఈఓగా నియమించినప్పటి నుంచి దేశంలోని వివిధ కారిడార్ అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని, 12 కారిడార్ల అభివృద్ధి ఏకకాలంలో ప్రారంభమైందని అధికార వర్గాలు తెలిపాయి.

14 రకాల వివరాలివ్వండి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై మరిన్ని వివరాలు కోరుతూ నీటిపారుదల శాఖ కార్యదర్శికి కాగ్ లేఖ

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్).. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లెక్కలు తీసే పనిలో పడింది. ఈ పథకంపై గత మే 31న కాగ్ ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి పంపించింది. తుది నివేదికను సిద్ధం చేయడానికి ముందు పలు మార్లు ముసాయిదా నివేదికలు ప్రభుత్వానికి అందిస్తుంది. వాటికి జవాబులు తెప్పించుకోవడం, సరిచేయడం వంటి పనుల తర్వాత తుది నివేదికను ఖరారు చేస్తుంది. గత మే 31న కాగ్ అందించిన ముసాయిదాపై ప్రభుత్వం అక్టోబరు 15న అంశాలవారీగా బదులిచ్చింది. వాటిని నిశితంగా పరిశీలించిన అనంతరం అదనంగా 14 రకాల వివరాలు కోరుతూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు గురువారం లేఖ రాసింది. ఉమ్మడి రాష్ట్రంలో జూరాల జలాశయం నుంచి నీటిని తరలించడానికి వీలుగా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రీ-ఇంజనీరింగ్ చేసి శ్రీశైలం నుంచి నీటిని తరలించేలా డిజైన్‌ను మార్చి, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టులో ఉద్దండాపూర్ రిజర్వాయర్ తప్ప మిగిలిన రిజర్వాయర్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. గత ఏడాది సెప్టెంబరు 16న ప్రభుత్వం నార్లాపూర్‌లో ఒక మోటార్‌ను ట్రయల్ రన్ చేపట్టింది. రూ.52 వేల కోట్లకు పైగా వ్యయంతో దీన్ని చేపడుతుండగా.. ఇప్పటిదాకా రూ.26738 కోట్లు వెచ్చించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధుల లేమితో దీనిపై దృష్టి సారించలేదు. తాజాగా కాగ్ ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టడంతో మళ్లీ ఈ అంశం తెరపైకి వచ్చింది. రాష్ట్ర నీటిపారుదల ప్రణాళిక, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, ఎప్పట్లో వీటిని ప్రారంభించారు? ప్రాజెక్టుల డీపీఆర్‌ల తయారీ బాధ్యతలను ఏ ఏజెన్సీలకు అప్పగించారు? టెండర్లు పిలిచారా? 2024 మార్చి నాటికి ప్యాకేజీల వారీగా ఆర్థిక, పనుల పురోగతి? పునరావాసం, పునర్నిర్మాణం ఏ దశలో ఉంది? ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల సంఘం అనుమతులు వచ్చాయా? కృష్ణా నది యాజమాన్య బోర్డు డీపీఆర్‌ను పరిశీలించిందా? డిస్ట్రిబ్యూటరీలు పూర్తయితే ఏ మేరకు పనుల పురోగతి ఉందో ప్యాకేజీల వారీగా వివరాలు, వాస్తవిక అంచనా వ్యయం, సవరించిన అంచనా వ్యయం ఎంత? వంటి వివరాలను అందించాలని కోరింది.

నిజాం కూడా ఇలా భూములు పంచలేదు

- అమోయ్‌ పై ఇప్పటికే సీబీఐ, ఈడీ కేసులున్నాయి
- ఆయనపై మరో కేసు పెట్టాలనుకుంటున్నారా?
- భూదాన్ భూముల రక్షణకు మీరేం చేస్తున్నారు?
- కౌంటర్ దాఖలు చేయకపోతే జరిమానా విధిస్తాం
- భూదాన్ బోర్డు పిటిషన్ విచారణలో హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు ఆస్తికి సంబంధించిన కేసులో వారసత్వ ధ్రువపత్రాన్ని అక్రమంగా జారీ చేసిన అప్పటి రంగారెడ్డి కలెక్టర్ అమోయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ భూదాన్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'సదరు అధికారిపై ఇప్పటికే ఈడీ, సీబీఐ కేసులు ఉన్నాయి.. చాలా కేసుల్లో విచారణ ఎదుర్కొంటూ ఇబ్బంది పడుతున్నారు. క్రిమినల్ కేసులకు పెట్టింది పేరుగా ఉన్నారు. మీరు పత్రికలు చదవడం లేదా? ఇప్పుడు మీరు మరో కేసు పెట్టాలనుకుంటున్నారా? నాకు తెలిసి నిజాం రాజు కూడా ఈ స్థాయిలో ఆస్తులను ఎవరికీ కేటాయించలేదనుకుంటా" అని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసలు భూదాన్ భూములకు పట్టా పాస్‌పుస్తకాలు జారీ చేస్తుంటే తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఏం చేస్తోందని బోర్డు తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. భూదాన్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్లు నిజమైనవా ? కాదా ? అనే అంశంపై ఈ కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. ఆ భూములను రక్షించడానికి బోర్డు ఏం చర్యలు తీసుకుంటోంది? అని నిలదీసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయకపోతే రూ.25 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

పాత కక్షలతో తల్లీకొడుకు దారుణ హత్య

- పట్టపగలు కత్తితో పొడిచి చంపిన నిందితుడు
- తన కొడుకు మృతికి వారే కారణమనే అనుమానంతోనే


అనిల్, సరోజ (ఫైల్)

గుమ్మడిదల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు అందరూ చూస్తుండగా తల్లి, ఆమె కుమారుడిని కత్తితో పొడిచి చంపేశాడో వ్యక్తి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. తన కుమారుడి మృతికి ఆ ఇద్దరూ కారణమనే అనుమానంతోనే అతడు ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టాడు. పోలీసుల కథనం ప్రకారం.. యూపీకి చెందిన నాగరాజు (30)... అదే రాష్ట్రానికి చెందిన సరోజ(50), ఆమె కుమారుడు అనిల్(30) మరో ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం గుమ్మడిదల మండలం బొంతపల్లికి వచ్చారు. కొన్నేళ్లుగా నాగరాజు, సరోజ కుటుంబాలు వీరభద్రనగర్‌లోని పక్కపక్క ఇళ్లలోనే ఉంటున్నారు. నాగరాజు కుమారుడు (1) ఏడాది క్రితం నీటిసంపులో పడి చనిపోయాడు. తన బిడ్డ చావుకు సరోజు, ఆమె కుమారుడు అనిల్ కారణమని నాగరాజు భావించాడు. వారే తన బిడ్డను సంపులో పడేశారని అనుమానించి, అప్పటి నుంచి వారిపై పగ పెంచుకున్నాడు. గురువారం ఉదయం సరోజ గుడికి వెళ్లేందుకు కుమారుడు అనిల్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఇంటికి సమీపంలోనే వారి కోసం కత్తితో ఎదురు చూస్తున్న నాగరాజు తన కారుతో బైక్‌ను ఢీ కొట్టాడు. వారు బైక్ ఆపి చూస్తుండగానే, నాగరాజు వెంట తెచ్చుకున్న కత్తితో ఇద్దరినీ పొడిచాడు. తీవ్రగాయాలతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బుల్డోజర్‌కు బ్రేక్

సామాన్యుడి సొంతింటి కలమీద హిందీకవి ప్రదీప్ రాసిన ఓ కవితను ఉటంకిస్తూ, బుల్డోజర్ కూల్చివేతలను ఇకపై సహించేది లేదంటూ సుప్రీంకోర్టు బుధవారం ప్రశంసనీయమైన తీర్పు వెలువరించింది. అధికారులే న్యాయమూర్తుల్లా వ్యవహరిస్తూ, తక్షణతీర్పులతో ఇళ్ళకూల్చివేత శిక్షను అమలు చేస్తే ఊరుకొనేది లేదని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఏదో ఒక నేరంలో నిందితుడో, దోషో అయినంతమాత్రాన నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా నేరుగా బుల్డోజర్లతో పోయి వారి నివాసాలను నేలమట్టం చేయడం అన్యాయం, అంతకుమించి రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలయ్యే మార్గదర్శకాలను కూడా విడుదలచేసి, వాటిని అతిక్రమించినా, గీతదాటి దూకుడుగా వ్యవహరించినా సదరు అధికారులను వదిలిపెట్టేది లేదని, ధిక్కరణ చర్యలు తీసుకుంటామని కోర్టు స్పష్టంచేసింది. కూల్చివేతల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు తేలితే, బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అధికారులనుంచి ముక్కుపిండి వసూలు చేస్తానన్న హెచ్చరిక అత్యంత ప్రభావవంతంగా ఉంది. ఒక వ్యక్తి నిందితుడైతే అతడి నివాసాన్ని కూల్చివేయడం ద్వారా మొత్తం కుటుంబాన్ని శిక్షించడం, రోడ్డుపాల్జేయడం సరికాదన్నది మంచిమాట. 95 పేజీల తీర్పులో న్యాయమూర్తులు పలుచోట్ల బాధ, ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిర్దిష్టమైన మార్గదర్శకాలతో భవిష్యత్తులో బుల్డోజర్ జస్టిస్‌ను నిలువరించేందుకు యథాశక్తి ప్రయత్నం చేశారు.

ఈ తీర్పుతో సర్వోన్నతన్యాయస్థానం బుల్డోజర్‌ను గ్యారేజీలోకి నెట్టేసిందని అఖిలేష్‌యాదవ్ వ్యాఖ్యానించారు. ఆ మహాయంత్రాన్ని కూల్చివేతలకు వినియోగించి, ఈ తీరున తక్షణశిక్షలు వేయడం యూపీ యోగి కనుగొన్న ప్రక్రియ కనుక విపక్షనేతలంతా ఆయన దృష్టితోనే వ్యాఖ్యలు చేశారు. బుల్డోజర్ బాబాగా ప్రసిద్ధిచెందిన యోగి చేతికి ఏకంగా సంకెళ్ళుపడినంతగా సంతోషించారు. యూపీ ప్రభుత్వానికి ఈ తీర్పు ఎలా అర్థమైందో తెలియదుగానీ, దానిని చక్కగా స్వాగతిస్తూ తనకు అనుకూలంగా భాష్యం చెప్పుకుంది. షోకాజ్ నోటీసులు, అప్పీళ్ళు, గడువులు, బాధితుల వాదనలను వినడం, మినిట్స్ రికార్డుచేయడం, యజమానికే అక్రమకట్టడాన్ని కూల్చివేసే అవకాశం ఇవ్వడం.. ఇలా పలురకాల మార్గదర్శకాలతో అధికారుల ముందరికాళ్ళకు సర్వోన్నతన్యాయస్థానం బలమైన బంధనాలు వేసింది. పాలకుల పక్షాన వారు కట్టుదాటి ప్రవర్తించకుండా లక్ష్మణరేఖలు గీసింది. కానీ, ఇప్పటికే నష్టపోయిన వందలాదిమందికి మాత్రం ఈ తీర్పు న్యాయం చేయలేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి అత్యధికంగా దుర్వినియోగపరచిన ఈ విధానాన్ని ఆ తరువాత బీజేపీ పాలిత రాష్ట్రాలన్నీ అమలు చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా మతహింసలు రేగినప్పుడు నివాసాల కూల్చివేతతో ముఖ్యంగా ముస్లింలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. హర్యానాలోని నుహ్, మధ్యప్రదేశ్‌లో ఖర్గోన్ వంటి చోట్ల మైనారిటీలను హెచ్చరించడానికి, అదుపులో ఉంచడానికి బుల్డోజర్ ఆయుధమైంది. ముస్లింలను ఆ రీతిలో శిక్షించడాన్ని బీజేపీ నాయకులు బాహాటంగా సమర్థించేవారు. నేరస్థులని నిర్ధారించేందుకు విడియోలు సరిపోతాయని, న్యాయస్థానాల అవసరం లేదని వ్యాఖ్యానించేవారు.

నిందితులను గుర్తించడం నుంచి నేరం రుజువుచేయడంవరకూ ఉన్న సుదీర్ఘ ప్రక్రియలన్నీ పక్కకు నెట్టివేసి, ఇలా కొంపలు కూల్చడం ద్వారా తక్షణశిక్షలు వేయడాన్ని ప్రజలు కూడా మెచ్చడం, బుల్డోజర్లను బ్యాండ్‌బాజాతో ఘనంగా స్వాగతించడం చూశాం. ఏ నేరానికి ఈ శిక్షవేస్తున్నదీ రాజకీయనాయకులు బాహాటంగా చెబుతుంటే, అధికారులు మాత్రం అక్రమ నిర్మాణమనో, అనుమతులు లేవనో, ఆక్రమణదారులనో చెప్పి సదరు అనుమానితుల లేదా నిందితుల ఇంటినో, దుకాణాన్నో నేలమట్టం చేస్తూపోయేవారు. ఆ నేరానికీ, ఈ శిక్షకూ సంబంధం లేదని న్యాయస్థానాల్లోనూ వాదనలు సాగేవి. కానీ, అసలు నిజం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు వెలువడిన తీర్పు పాలకుల, అధికారుల దూకుడును బాగా నియంత్రిస్తుందని ఆశించాలి. ఒక వర్గాన్ని నియంత్రించేందుకు కూల్చివేతలను ఆయుధంగా వాడేవిషయంలో పాలకుల ఆదేశాలను అధికారులు గుడ్డిగా అమలుచేయకపోవచ్చు. తీర్పు వర్తించని ప్రాంతాలంటూ న్యాయస్థానం ఇచ్చిన మినహాయింపులను పాలకులు దుర్వినియోగం చేయకుండా చూడటం ముఖ్యం. మార్గదర్శకాలు నూరుశాతం అమలయ్యేట్టుగా జిల్లాకోర్టు నుంచి హైకోర్టు వరకూ శ్రద్ధపె-

ట్రంప్ అనంతర ప్రజాస్వామ్యం!



డోనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడు! అనేక కఠిన ప్రశ్నలను ఎదుర్కోవలసిన కాల మిది. పాలనా పద్ధతులలో ప్రజాస్వామ్యం సర్వోత్తమమైనదా? సమాజానికి కీడు, ప్రజలకు హాని చేస్తున్న ప్రజాస్వామ్యంతో మన మెలాంటి బాంధవ్యం కలిగి ఉండాలి? ఒక పాలనా పద్ధతిగా ప్రజాస్వామ్యం మెరుగుపడగలదనే ఆశాభావానికి నీళ్ళొదులుకోవాలా?

ప్రజాస్వామ్యంపై ఈ సంశయాలకు, డోనాల్డ్ ట్రంప్ అధికార పునరాగమనం దాకా మనం వేచి ఉండవల్సిన అవసరం లేదు. 2016లో ఆ మహాశయుడు అమెరికా అధ్యక్షుడుగా తొలిసారి ఎన్నికయినప్పుడే ప్రజాస్వామ్యం సర్వోత్తమమైనదేనా అనే ప్రశ్నను మనం వేసుకుని ఉండవల్సింది. లేదూ, నరేంద్రమోదీ 2019లో రెండో సారి విజయం సాధించినప్పుడైనా ఆ ప్రశ్నను మనకు మనమే సంధించుకుని ఉండవల్సింది. బహుశా, 2002లో గుజరాత్ మారణకాండ తక్షణ అనంతరమే ఆయన తిరుగులేని ప్రజామోదాన్ని పొందినప్పుడే ఆ ప్రశ్న మనలో బలంగా ఉదయించి ఉండవల్సింది.

నిజానికి ఉనికిలో ఉన్న 'ప్రజాస్వామ్యాలు' శ్రేష్ఠమైనవి కావు. ప్రజాస్వామ్య పాలన ఫలితాలు పర్యవసానాలు ప్రశంసనీయంగా ఉండడం లేదన్నది అందరికీ తేట తెల్లంగా తెలిసిన సత్యం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయిన నాయకులు, మళ్లీ మళ్లీ ఎన్నికవుతున్న నేతలు రాజకీయ కల్లోలాలకు కారణమవుతున్నారు. నిరర్థక నిర్ణయాలతో సమాజాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారు. అవినీతిని పెంపొందిస్తున్నారు. నేరాలు ప్రబలిపోతున్నా ఉపేక్షిస్తున్నారు. జాతుల మధ్య వైరాలను ప్రోత్సహిస్తున్నారు. తెగల మధ్య చిచ్చు పెడుతూ అంతులేని మారణ కాండను సృష్టిస్తున్నారు. పర్యావరణ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నారు అయినప్పటికీ ఎంతో మంది 'ప్రజాస్వామిక' పాలకులు తమ ప్రజాదరణను, అధికారాన్ని నిలబెట్టుకోగలుగుతున్నారు! ఇదేమీ ఎవరికీ కొత్త విషయమేమీ కాదు. సంపన్న యూరోపియన్ సమాజాలకు వెలుపల ఏమి జరుగుతుందో నిష్పాక్షికంగా చూడండి: సాధారణ, క్రియాత్మక ప్రజాస్వామ్యాలు తమ ప్రజలకు సమకూరుస్తున్న ప్రయోజనాలు అనేవి చాలా వరకు కట్టుకథలే కాదూ? ఇటువంటి నిర్ణయానికి మనం రాలేకుండా ఉండడం అసాధ్యం. ప్రజాస్వామ్య వ్యవస్థల విజయ గాథలు సాధారణంగా యాదృచ్ఛిక పరిణామాలు మాత్రమే. పైగా అవి నిస్సందేహంగా స్వల్పకాలిక అద్భుతాలే, అంతకుమించి అవేమీ సార్థకమైనవి కావు.

ప్రజాస్వామిక పాలన ఫలితాలను అంచనా వేయడంలో కేవలం మూడు వాదనలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని సమర్థించగలిగేవిగా ఉన్నాయి. ఒకటి— ప్రజలకు శ్రేయస్సును సమకూర్చడంలో నియంతృత్వ ప్రభుత్వాల కంటే ప్రజాస్వామిక ప్రభుత్వాలు అసమర్థంగా వ్యవహరించడం లేదు. రెండు— పాలన దుష్ఫలితాలను కనుగొని, సరిదిద్దేందుకు అవకాశాలను ప్రజాస్వామ్యం సమృద్ధిగా కల్పిస్తుంది. మూడు— ప్రజాస్వామ్య పాలన తాను ఆశిస్తున్నది ఇచ్చినా ఇవ్వకపోయినా ఒక పౌరుని ఆత్మ గౌరవాన్ని ప్రజాస్వామ్యం పెంపొందిస్తుంది, కాపాడుతుంది. నియంతృత్వ పాలనా వ్యవస్థలను నిర్ద్వంద్వంగా తిరస్కరించేందుకు ఈ వాదనలు చాలు. అయితే ఈ వాదనలే ఆధునిక ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని తిరుగులేని రీతిలో ఆమోదించేందుకు సరిపోవు.

'జనసమ్మతమైన' నాయకులు ప్రజాస్వామ్యం కారణంగా కాకుండా ప్రజాస్వామ్య ప్రతిబంధకాలు ఎన్నో ఉన్నప్పటికీ అధికారాన్ని గెలుచుకుని నిలబెట్టుకోగలుగుతున్నారనే కట్టుకథను విశ్వసించడానికి ప్రజాస్వామ్య సమ్మోహన శక్తే కారణమవుతోంది. సమస్యేమిటంటే మార్కెట్ వైఫల్యాల మాదిరిగానే ప్రజాస్వామిక వైఫల్యాలు వైపరీత్యాలే గానీ, ప్రజాస్వామిక సంస్థలు సక్రమంగా పనిచేయక పోవడం వల్ల సంభవిస్తున్నవి కానేకావు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనం ప్రజాస్వామ్యంగా పరిగణించే రాజకీయ వ్యవస్థలో వాటి సంభవనీయతకు అవకాశాలు మనమే కల్పించాం. ప్రజాస్వామ్యమనేది అధిక సంఖ్యాకుల పాలన అయితే, అటువంటి పరిణామాల సంభవనీయతను అది స్పష్టంగా అనుమతిస్తుంది.

> ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య వ్యవస్థ గానీ, సమగ్ర ప్రజాస్వామ్యానికి ప్రామాణిక నమూనా గానీ ఎక్కడా లేదు. ఇది మనం అంగీకరించి తీరవలసిన వాస్తవం. మహా అయితే సంభావ్య ప్రజాస్వామ్యాలు మాత్రమే ఉన్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యమనేది ఇంకా పరిణతమవుతున్న దశలో ఉన్న ఆదర్శంగా మాత్రమే ఉన్నది. అదొక అసంపూర్ణ లక్ష్యంగా మిగిలిపోయింది. ఈ వాస్తవాన్ని మనకు బాగా ఎరుక పరిచినందుకు డోనాల్డ్ ట్రంప్‌కు మనం కృతజ్ఞత చెప్పాలి.



■ యోగేంద్ర యాదవ్

ఈ వాస్తవాన్ని అంగీకరించడాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిగా పొరపడవచ్చు. అది ఎంత మాత్రం పొరపాటు భావన కాదని నిశ్చితంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్య భావనను సంరక్షించుకోవాలంటే వాస్తవ ప్రజాస్వామ్యాల పనితీరు, సాధించిన విజయాల చరిత్రను నిశితంగా, నిష్పాక్షికంగా తనిఖీ చేయవలసి ఉంది.

ప్రజాస్వామ్య వ్యవస్థల్లో వైపరీత్యాలు సంభవించడం, అపసవ్య ధోరణులు పెచ్చరిల్లడం సహజసిద్ధ పరిణామాలు. ఇందుకు విరుద్ధమైన వైఖరులను సరిదిద్దవలసిన అవసరమున్నది. లేనిపక్షంలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రజల పేరుతో ప్రజల పక్షాన ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశమున్నది. రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు (26, నవంబర్ 1949) రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేడ్కర్ వెలువరించిన చరిత్రాత్మక ప్రసంగం ఆ ప్రమాదం గురించే మనలను అప్రమత్తం చేసింది. మానవేంద్రనాథ్ రాయ్ 'పార్టీ రహిత రాజకీయాలు', పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై లోక్ నాయక్ జేపీ విమర్శలు నూతన ప్రజాస్వామ్య నమూనా కోసం మేధో చిత్తశుద్ధితో, నైతిక నిబద్ధతతో చేసిన అన్వేషణల ఫలితాలే.

ఇటీవలి కాలంలో రాజకీయాల వాస్తవ జగత్తును సరైన రీతిలో అర్థం చేసుకునేందుకు మనకు తోడ్పడిన రాజకీయ సైద్ధాంతికులలో ప్రముఖుడు జాన్ డన్. ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితికి మూలంగా ఉన్న ఒక ఏకీకరణ గురించి ఆయన మనలను అప్రమత్తం చేశారు. మనం నేడు ప్రజాస్వామ్యంగా పరిగణిస్తున్నది మూడు అంశాలు ఒకటిగా కలగలుపు అయిన భావన అని ఆయన పేర్కొన్నారు. మన కాలంలో ప్రజాస్వామ్యం అనేది విస్తృతంగా వినియోగమవుతున్న, అదే విధంగా దుర్వినియోగమవుతున్న మాటలలో ప్రముఖమైనది. ఆశ్చర్యకరంగా అది సార్వజనీనమైనది. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ సంభాషణల్లో రాజకీయ అధికారాన్ని కోరుకునేందుకు వాడబడుతున్న ప్రభావశీలమైన పదమది. ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్యం చాలా ప్రభావశీలమైనది, స్ఫూర్తిదాయకమైనది. వర్తమానంలోనే కాకుండా భవిష్యత్తులో కూడా ప్రత్యర్థి లేని ఆదర్శమది. సమాజాన్ని మొత్తంగా ప్రభావితం చేసే సమష్టి నిర్ణయాలపై పౌరులు అందరికీ సమాన, సమర్థమైన నియంత్రణ ఉండాలనేది ప్రజాస్వామ్య దార్శనికత. అంతిమంగా ప్రజాస్వామ్యం అనేది ఒక రాజకీయ యంత్రాంగం లేదా క్రియా విధానానికి ప్రతీక.

నేడు మనం ఒక బ్రహ్మాండమైన మాయ, ఒక భావనాసంబంధమైన యుక్తిని ఎదుర్కొంటున్నాం. పదం, ఆదర్శం, క్రియా విధానం (ది వర్డ్, ది ఐడియల్, ది మెకానిజం)గా ప్రజాస్వామ్యం మూడు అర్థాలకు ఒక తుల్యతను సృష్టించడమే ఆ యుక్తి. ఇదొక మేధో చాతుర్యం. ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్య సమ్మోహన శక్తిని, ప్రజల వైయక్తిక, సమష్టి వ్యవహారాలలో నిత్యం వాడుకలో ఉండే మాట— ప్రజాస్వామ్యం —ను మరింతగా సుదృఢపరిచేందుకు ఉపయోగిస్తున్నారు. అలా ఆదర్శం, పదం సంయుక్త ప్రభావాన్ని, ప్రాబల్యాన్ని ప్రజాస్వామిక పాలకులుగా చలామణీ అవుతున్న వారిని సమర్థించేందుకు వినియోగిస్తున్నారు. ఈ మూడు ఎంతగా కలగలుపు అయిపోయాయంటే ఒక ప్రభుత్వ నమూనాగా ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించడమనేది అసలు ప్రజాస్వామ్య ఆదర్శంపై దాడిగా భావించడం జరుగుతోంది. మరి ప్రజలను విశేషంగా ఆకట్టుకునేది, మంత్రముగ్ధులను చేసే వాటిలో ప్రజాస్వామ్య ఆదర్శం ముఖ్యమైనది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజల్లో అటువంటి 'ఆకర్షణీయత' అవిశ్వసనీయమైన ప్రమాదకరమైన ప్రభుత్వాలను సమర్థించేందుకు ఒక సాకు అవుతోంది!

రాజ్య పాలనా వ్యవహారాలలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత సమున్నతం చేసే ఏ కార్యనిమగ్నత అయినా ఒక భావనగా, ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్యాన్ని వాస్తవంగా ఉనికిలో ఉన్న ప్రభుత్వ రూపాల నుంచి వేరు చేసి చూడాలి. ప్రజాస్వామ్యంగా పరిగణన అవుతున్న దేనినైనా సరే నిరాలోచనగా ప్రస్తుతించడమనేది మేధో పరంగా నష్టం చేసేది మాత్రమే కాకుండా రాజకీయంగా విపత్కర పరిస్థితులను సృష్టిస్తుంది. వర్తమాన ప్రపంచంలో పాలకులు అందరూ తమను తాము ప్రజాస్వామ్యవాదులుగా చెప్పుకుంటున్నారు. నిరంకుశ పాలనా పద్ధతులకు సైతం ప్రజాస్వామ్య ముద్ర వేయించుకోవడానికి ఆరాటపడుతున్న నియంతృత్వ పాలకుల సంఖ్య తక్కువేమీ కాదు. ఈ దృష్ట్యా ప్రజాస్వామ్యాన్ని ఒక భావనగా, ఒక విశేషణంగా ఏకీకరణ చేయడం నైతిక భ్రష్టత, రాజకీయ వైకల్యానికి దారి తీస్తుంది.

ఇప్పుడు మనముందు రెండు సంభావ్య మార్గాలు ఉన్నాయని ప్రజాస్వామ్య సైద్ధాంతికుడు జాన్ డన్ బలంగా వాదించారు. ఆయన సూచించిన మొదటి ప్రత్యామ్నాయం ప్రజాస్వామ్య సమ్మోహనశక్తిని అధిగమించి, ప్రజాస్వామ్య ఉత్కృష్ట ఆదర్శాల నుంచి 'ప్రజాస్వామిక మైనవి'గా చలామణీ అవుతున్న ప్రభుత్వాలను వేరు చేయాలి. నైతిక యోగ్యత విషయమై ప్రజాస్వామిక ప్రభుత్వాలకు ప్రత్యేక హక్కులు ఏవీ లేని, అవి కేవలం మరొక ప్రభుత్వ రూపంగా మాత్రమే పరిగణించాలని జాన్ డన్ పేర్కొన్నారు. ఇది చాలా యుక్తియుక్తమైన వాదన. ఎందుకని? ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మంచి చేయడం లేదనే వాస్తవాన్ని తిరస్కరించే పరిస్థితులలో ఇంకెంత మాత్రం లేము. ఇక రెండో మార్గం మౌలికంగా భిన్నమైనది. ప్రజాస్వామ్యాన్ని పునర్ జాగృతం చేసి, శక్తిమంతం చేయడమే అది. ఇందుకు ప్రజాస్వామ్య సమున్నత ఆదర్శాలను మనం మనసా వాచా కర్మణా పాటించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా పేరు పొందిన వ్యవస్థలు, సమాజాలలో ఆ ఆదర్శాలు వాస్తవంగా ఎలా ఆచరణలో ఉన్నాయో నిశితంగా పరీక్షించాలి. సదరు సమాజాల ప్రజాస్వామిక స్వభావాన్ని నిగ్గు తేల్చాలి. ప్రజాస్వామికమైనవిగా పిలవబడుతున్న పాలనా వ్యవస్థలు వాస్తవంగా తమ ప్రజల శ్రేయస్సుకు దోహదం చేసే పాలనను ఎంత మాత్రం అందించడం లేదనే కఠోర వాస్తవాన్ని ఆమోదించేందుకు సంసిద్ధత చూపాలి. ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య వ్యవస్థ, సమగ్ర ప్రజాస్వామ్యానికి ప్రామాణిక నమూనా అనేది ఎక్కడా లేదు. ఇది మనం అంగీకరించి తీరవలసిన వాస్తవం. మహా అయితే సంభావ్య ప్రజాస్వామ్యాలు మాత్రమే ఉన్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యమనేది ఇంకా పరిపూర్ణ పరిణతి పొందని దశలో ఉన్న ఆదర్శంగా మాత్రమే ఉన్నది. అదొక అసంపూర్ణ లక్ష్యంగా మిగిలిపోయింది. ఈ వాస్తవాన్ని మనకు బాగా ఎరుక పరిచినందుకు డోనాల్డ్ ట్రంప్‌కు మనం కృతజ్ఞత చెప్పాలి.

శాంతి సాధనకు సైన్స్!

శాంతియుత జీవనాన్ని, స్థిరమైన అభివృద్ధిని మానవ ప్రపంచం కోరుకుంటుంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతితో పుష్కలమైన ఉపాధి అవకాశాలతో -ఆకలిచావులు లేని ప్రపంచాన్ని సమాజం ఆకాంక్షిస్తున్నది. ఆ లక్ష్యసాధనకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో కలిసి అభివృద్ధి చేసుకోవడం అత్యవసరమని ప్రపంచదేశాలు గుర్తించాయి. సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడం ప్రపంచదేశాలకు అనివార్యం, అవసరం.

పారిశ్రామిక విప్లవం అనూహ్య సంపద సృష్టించింది. దీంతో పారిశ్రామిక సంస్థలు పరిశోధనలపై దృష్టి సారించి -అవసరమైన నిధులు కేటాయించాయి. ఈ కారణంగా 19వ శతాబ్దం ప్రారంభం నాటికి శాస్త్ర పరిశోధనలు అన్ని దేశాలలో ఊపందుకున్నాయి. శాస్త్రవేత్తలు వారి వారి దేశాలలో జాతీయ అకాడమీలను ఏర్పాటుచేసి -ఇతర దేశాల అకాడమీ గ్రూపులతో అంతర్జాతీయ సంఘంగా ఏకీకృతమయ్యారు. పరస్పర సహకారం, సమన్వయంతో పరిశోధనలు నిర్వహించారు. ప్రపంచ యుద్ధాల కాలంలో చీలిపోయివున్న ప్రపంచ దేశాలు అభద్రతాభావంతో శాస్త్రవేత్తల సంఘాలను ప్రోత్సహించలేదు కానీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ సంఘాలు తిరిగి పునరుద్ధరించబడి, క్రియాశీలకపాత్ర పోషిస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపాఖండంలోని 12 దేశాల శాస్త్రవేత్తలు కలసి సంయుక్తంగా అంతర్జాతీయ అణు పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాలని సంకల్పించారు. అణు పరిశోధనలను - మానవజాతి అభివృద్ధి లక్ష్యాల వైపు తరలించాలని యూరప్ శాస్త్రవేత్తలు భావించారు. ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థల సహకారంతో స్విట్జర్లాండ్‌లో CERN(Conseil Européen pour la Recherche Nucléair)ను స్థాపించారు. ప్రపంచ యుద్ధాలకు ప్రధాన కారణమై -యూరప్‌కు భారీ నష్టం కలిగించిన పశ్చిమ జర్మనీ, ఇటలీలు కూడా CERN స్థాపనకు మద్దతు తెలిపి, వ్యవస్థాపక సభ్యులుగా చేరాయి. నేడు CERN ప్రపంచంలోనే అతిపెద్ద పరిశోధనా సంస్థలలో ఒకటి. ప్రపంచ యుద్ధాల ఫలితంగా ఐరోపా దేశాలలో వేళ్లూనుకున్న రాజకీయ వైరాలను, వైషమ్యాలను తొలగించి -ఐరోపా ఐక్యతకు విజ్ఞాన శాస్త్రం ఇలా ప్రముఖ పాత్ర పోషించింది.



> దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందటానికి సైన్స్ ఒక సాధనంగా మారింది. మానవజాతికి విజ్ఞానాన్ని ప్రసాదించేదిగా మిగిలిపోకుండా, శత్రు దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి ఆధునిక కాలంలో సైన్స్ విఫలం కాని దౌత్య వ్యూహంగా రూపుదిద్దుకుంది. ఈ కారణంగానే, శాంతియుత ప్రపంచాన్ని సాధించడంలో సైన్స్ పాత్రను నొక్కిచెబుతూ ఏటా నవంబరు 9 నుంచి 15 వరకూ ఐక్యరాజ్యసమితి 'సైన్స్–ప్రపంచశాంతి' వారోత్సవాలు నిర్వహిస్తున్నది.

సైన్సు సంఘాల అంతర్జాతీయ కౌన్సిల్ 1957ను అంతర్జాతీయ జియో ఫిజిక్స్ సంవత్సరంగా ప్రకటించి ప్రపంచంలోని 67 దేశాల భాగస్వామ్యంతో భూగోళ వ్యవస్థపై పరిశోధనలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో పరస్పరం విరోధించుకునే అమెరికా, రష్యాలు ఇతర దేశాలతో కలిసి అంటార్కిటికా ట్రీటీకి అంగీకారం తెలిపాయి. అగ్రదేశాల మధ్య కుదిరిన ఈ సంచలనాత్మక ఒప్పందం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా రష్యాల తొలి ఆయుధ నియంత్రణ ఒడంబడికగా గుర్తింపు పొందింది. ఈ ఒప్పందం శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పాటుగా - ప్రపంచంలో శాంతి నెలకొంటుందనే ఆశావాదాన్ని మానవ సమాజంలో చిగురింప చేసింది. కౌన్సిల్ శాస్త్రవేత్తల క్రియాశీలక పాత్ర అగ్రరాజ్యాల సానుకూల వైఖరికి ప్రధాన కారణం.

అమెరికా అధ్యక్షుడు జాన్ కెనెడీ నేతృత్వంలో 1961లో ప్రారంభించిన అమెరికా జపాన్ సైన్సు సహకార కమిటీ కార్యకలాపాల్లో మొదట కొంత జాప్యం జరిగినా, ఆ తరువాత- రెండు దేశాల శాస్త్రజ్ఞులు, పరిశోధకుల క్రియాశీలక భాగస్వామ్యంతో జోరందుకున్నాయి. వాతావరణం, సాంకేతిక శాస్త్రం, వైద్య రంగాలలో సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని, పరిశోధనా రంగంలో పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని ప్రాథమికంగా ప్రతిపాదించారు. భూకంపాలను ముందుగానే గుర్తించే విధానాలపై పరిశోధనలు, ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధికి చికిత్స, నివారణకు పరిశోధనలు అమెరికా, జపాన్ శాస్త్రవేత్తలు ప్రారంభించారు. 1988లో ప్రారంభమైన అమెరికా జపాన్ సంయుక్త కార్యాచరణ కమిటీ (Japan Joint Working-Level Committee (JWLC)) పరిశోధనా భాగస్వామ్యాన్ని వేగవంతం చేసి -అద్భుతమైన విజయాలను సాధించి పెట్టింది. రెండు దేశాల ప్రజల మధ్య వైషమ్యాలు తొలగిపోయి స్నేహ సంబంధాలు పటిష్టమయ్యాయి. అమెరికా జపాన్‌ల సాంకేతిక శాస్త్ర సహకారం అంతరిక్షనౌకల నిర్మాణం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు విస్తరించింది. దశాబ్దాలుగా సాగుతున్న పరిశోధనా భాగస్వామ్యం 2024లో అత్యంత క్లిష్టమైన కృత్రిమ మేధపై పరిశోధనలకు శ్రీకారం చుట్టింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అణుబాంబు ప్రయోగాలతో విధ్వంసమైన అమెరికా, జపాన్ సంబంధాలు సైన్స్ శాస్త్రవేత్తల పరిణతి చెందిన దౌత్యంతో మిత్ర దేశాలయ్యాయి.

కోవిడ్ మహమ్మారి మానవజాతిపై చేసిన దాడిని ఎదుర్కోవడంలో ప్రపంచమంతా ఒక్కటై విజయం సాధించింది. పరిశోధకులు పరస్పరం సహాయ సహకారాలను ఇచ్చిపుచ్చుకొని వ్యాక్సిన్ సకాలంలో ప్రతి పౌరుడికి అందించారు. పెను ఆపదలో ఉన్న మానవ సమాజాన్ని కాపాడటం కోసం శాస్త్ర విజ్ఞానం ప్రపంచ దేశాలను ఐక్యం చేసింది. సూక్ష్మజీవశాస్త్రంలో విశేష కృషి చేస్తున్న భారతదేశం 101 దేశాలకు వ్యాక్సిన్ అందించింది. శాస్త్ర పరిశోధనా రంగాలలో భారతదేశం ప్రపంచంలోని అన్ని ప్రముఖ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను పటిష్టం చేసుకుంది. భారతదేశం, యూరోపియన్ దేశాల మధ్య శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు సంస్కృతిక ఒప్పందాలు కూడా ఉన్నాయి.

రెండు శత్రుదేశాల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వాలు ఏర్పడటం కష్టం. చాలా దేశాల ద్వైపాక్షిక ఒడంబడికలు వాటి రాజకీయ ప్రయోజనాలతో ముడిపడి -అమలుకావటం లేదు. ఈ నేపథ్యంలో సైన్స్ ఒప్పందాలు, శాస్త్రవేత్తల క్రియాశీలక పాత్ర ఆ దేశాల మధ్య స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తున్నాయి. సైన్స్ రెండు దేశాల ప్రయోజనాలను కాపాడుతూ - శాస్త్ర సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ -అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ప్రజలు తమ దైనందిన జీవితంలో కనిపిస్తున్న అభివృద్ధిని ఆస్వాదిస్తూ -శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా ఒప్పందాలను అంగీకరిస్తూ -దేశాల మధ్య స్నేహాన్ని ఆహ్వానిస్తున్నారు. దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందటానికి సైన్స్ ఒక సాధనంగా మారింది. మానవజాతికి విజ్ఞానాన్ని ప్రసాదించే ఒక శాస్త్రంగానే మిగిలిపోకుండా -శత్రు దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి ఆధునిక కాలంలో సైన్స్ విఫలంకాని దౌత్య వ్యూహంగా రూపుదిద్దుకుంది. ఈ కారణంగానే, శాంతియుత ప్రపంచాన్ని సాధించడంలో సైన్స్ పాత్రను నొక్కిచెబుతూ ఏటా నవంబరు 9 నుంచి 15 వరకూ ఐక్యరాజ్యసమితి 'సైన్స్–ప్రపంచశాంతి' వారోత్సవాలు నిర్వహిస్తున్నది.

○ భరత్ వేదాంతం


ప్రాచీన గ్రంథాలను పరిరక్షించాలి

భారతీయ సంస్కృతిని చాటి చెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్రగ్రంథాలు నలంద, తక్షశిల తదితర విశ్వవిద్యాలయాలలో భద్రపరచబడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవమేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల అపురూప సంస్కృత గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలయ్యాయి. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతులు ప్రచురణ సులభమైంది. గ్రంథస్థ విషయాలు ప్రపంచమంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. వేలాది అంశాలు, లక్షలాదిగ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీనగ్రంథాల పరిరక్షణపై బాల్యం నుండే పిల్లలకు అవగాహన కల్పించాలి.

– రామకిష్టయ్య సంగనభట్ల

మూసీపై మురికి రాజకీయం మానండి!

> కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఏనాడూ మాట్లాడని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. దేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన హైదరాబాద్ మధ్యగా మూసీ ప్రవహిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి ముగ్గురిలో ఒకరు మూసీ పరివాహకం లోనే జీవిస్తున్నారు. నగర ప్రజలతో పాటు ఉమ్మడి నల్గొండ ప్రజలు మూసీ కాలుష్యంతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఇటువంటి నది ప్రక్షాళనకు సహకరించాల్సిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అక్కసుతో వ్యవహరిస్తున్నారు.



తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరం వైపు ప్రపంచం దృష్టి సారించే మహోన్నత ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవనానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దృష్టిసారించింది. ఇది జీర్ణించుకోలేని విపక్షాలు నీచ రాజకీయాలు ప్రారంభించాయి. ఇందులో భాగంగానే 'నమామి గంగే...'ను చూసి నేర్చుకోవాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాసం రాశారు (09.11.2024).

నిజానికి చిత్తశుద్ధి లేని శివపూజలేలా అన్నట్లు సాగుతున్నది 'నమామి గంగే' కార్యక్రమం. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ కార్యక్రమాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రారంభించింది. 2005లో (నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు) ప్రారంభమైన సబర్మతీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు విడతలవారీగా కొనసాగుతోంది అని కిషన్ రెడ్డి తన వ్యాసంలో అంగీకరించారు. అంటే ఇరవై ఏళ్లుగా ఆ పనులు పూర్తి కాలేదని ఆయనే స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రధానమంత్రి అయిన పదకొండేళ్లకు కూడా ఒక నది ప్రక్షాళనను పూర్తి చేయలేదు. దాని నుంచి ఏం నేర్చుకోవాలి? సబర్మతీ నదీ ప్రక్షాళనకు వందల కోట్ల రూపాయలు వెచ్చించిన తర్వాత కూడా దేశంలోనే కలుషితమైన నదుల్లో రెండో స్థానంలో సబర్మతి నది ఉన్నదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) 2022లో నివేదిక ఇచ్చింది. మరి ఆ నిధులన్నీ ఏం చేసినట్లు? అక్కడి నుంచి ఏం నేర్చుకోవాలి?

లోక్‌సభలో ఆగస్టు 8న ఇచ్చిన ఒక రాతపూర్వక సమాధానం ప్రకారం— 'నమామి గంగే'లో గత పదేళ్లలో రూ.32,070 కోట్లతో 5,282.39 కిలోమీటర్ల సీవరేజీ నెట్‌వర్క్‌తో కలుపుకొని రోజుకు 6,217.15 మిలియన్ల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసేందుకు 200 మురుగు శుద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 120 ఎస్‌టిపిలు మాత్రమే పూర్తయ్యాయి. రోజుకు కేవలం 3,241.55 మిలియన్ లీటర్ల మురుగు నీటినే శుద్ధి చేస్తున్నారు. అంటే ఇంకా రోజుకు 3 వేల మిలియన్ లీటర్ల పైచిలుకు మురుగు నీరు గంగలో కలుస్తూనే ఉంది.

గంగా పరివాహకంలోని ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో బీజేపీ ప్రభుత్వాలు ఉండడం; బిహార్‌లో బీజేపీ మిత్రపక్షం అధికారంలో ఉండడంతో అక్కడ ఎస్టీపీల నిర్మాణం, ఇతర కార్యక్రమాల్లో భారీ అవినీతి చోటు చేసుకుంటున్నా బయటకు రానివ్వడం లేదనే ఆరోపణలున్నాయి. నమామి గంగేతో గంగా నది ఏమాత్రం శుభ్రం కాలేదనడానికి పశ్చిమ బెంగాల్ కాలుష్య నియంత్రణ మండలి (WB PCB) నిర్వహించిన అధ్యయనమే మంచి ఉదాహరణ. ఆ అధ్యయనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని బహరంపూర్ నుంచి డైమండ్ హార్బర్ వరకు గంగా నది నీరు తాగడానికి కాదు కదా కనీసం స్నానం చేయడానికి పనికి రాదు. నమామి గంగే ఎగువ రాష్ట్రాల్లో అద్భుతంగా సాగితే, మరి పశ్చిమ బెంగాల్‌లో ఇలాంటి పరిస్థితి ఎలా ఉందో కేంద్ర మంత్రి జవాబు ఇవ్వాలి.

దేశం లోని ప్రముఖ నగరాల్లో ఒకటైన హైదరాబాద్ మధ్యగా మూసీ ప్రవహిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి ముగ్గురిలో ఒకరు మూసీ పరివాహకం లోనే జీవిస్తున్నారు. నగర ప్రజలతో పాటు ఉమ్మడి నల్గొండ ప్రజలు మూసీ కాలుష్యంతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఇటువంటి నది ప్రక్షాళనకు సహకరించాల్సిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అక్కసుతో వ్యవహరిస్తున్నారు. ఆయన రివర్ సిటీస్ అలయెన్స్ గురించి గొప్పగా చెప్పారు. పైసా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేయాలో చెప్పే ఉచిత సలహాల మండలి అది. నదుల ఒడ్డున ఉన్న నగరాలు నదీ కేంద్రిత ఆలోచన, కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. నదుల పునరుజ్జీవన బాధ్యత ఆయా నగరాలదే. నదుల పునరుజ్జీవనం అనే కాకుండా ఓ అభివృద్ధి కార్యక్రమంగా చూడాలని మోదీ చెప్పారని ఓ వైపు చెప్పిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, అదే పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పైనా, ముఖ్యమంత్రి పైనా నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మూసీ పునరుజ్జీవనానికి డీపీఆర్ తయారుకాకముందే రూ.1.50 లక్షల కోట్ల వ్యయం, అవినీతి, విలువైన భూములపై కన్ను వంటి బీఆరఎస్ సోషల్ మీడియా చెప్పే మాటలన్నింటినీ కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చేయడం తన స్థాయిని తాను తగ్గించుకోవడమే.

ఒక్కసారి కలవని— కనీసం గౌరవించని గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలుసుకునేందుకు పలుమార్లు లేఖలు రాసిన కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రిని గౌరవించే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మూసీ పునరుజ్జీవనంపై మాట్లాడేందుకు ఎందుకు ఆసక్తి చూపడం లేదు? గంగా నది పరీవాహకంలో రూ.39,080.70 కోట్లతో వివిధ ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని కేంద్ర మంత్రి వ్యాసంలో స్వయంగా చెప్పారు. మరి మూసీ ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం నుంచి మంత్రి ఎప్పుడైనా ఒక్క పైసా అడిగారా? కనీసం ఇప్పుడైనా ఒక రూ.10వేల కోట్లు ఇప్పించగలరా? పదేళ్లుగా కేంద్ర మంత్రిగా ఉంటున్న కిషన్ రెడ్డి మూసీ పునరుజ్జీవనానికి ఇప్పటి వరకు చేసిన కృషి ఏమిటి? పోనీ ఇక ముందు చేసే సహాయం ఏమిటో స్పష్టం చేయాలి. నదీ గర్భం లోని ఇళ్ల కూల్చివేతలను కేంద్ర మంత్రి తప్పు పడుతున్నారా? ఆక్రమణలకు కేంద్ర మంత్రి అండగా ఉంటారా? తేల్చి చెప్పాలి.

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు. వారి తరలింపు ఖర్చుల కోసం రూ.25వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటికే కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లోకి వెళ్లిన నిర్వాసితుల పిల్లల కోసం అక్కడే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. 250 కుటుంబాలు ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లోకి వెళ్లాయి. మూసీ నిర్వాసితులకు ఓఆర్‌ఆర్ సమీపంలో ఒకొక్కరికి 150 నుంచి 200 గజాల స్థలాలు ఇచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తోంది. నిర్వాసితులైన స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తోంది. నిర్వాసితులకు ఏ నష్టం కలగనివ్వమని ప్రభుత్వం భరోసా ఇస్తున్నా ప్రతిపక్షాలు విషం చిమ్ముతూనే ఉన్నాయి.

పేదల ఇళ్లు కూలగొడుతున్నారని కిషన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారు. కానీ, వారికి పునరావాసం కల్పించిన తరువాతే ప్రభుత్వం ఇళ్లు కూలుస్తోంది. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఏం జరుగుతున్నదో కేంద్ర మంత్రి కళ్లకు కనబడటం లేదు. నేరస్థులను శిక్షిస్తున్నామనే పేరుతో ఒక వర్గం వారిపై కక్షగట్టి ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారు. అది రాజ్యాంగ విరుద్ధమని బుల్డోజర్ రాజ్యం పనికిరాదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. హైదరాబాద్ నగరంలో మెట్రోకు రూ.25 వేల కోట్లు, ట్రిపుల్ ఆర్‌కు రూ.30వేల కోట్లు, ఓఆర్‌ఆర్ టు ట్రిపుల్ ఆర్ రేడియల్ రోడ్లకు రూ.10 వేల కోట్లు, ఎస్టీపీల నిర్మాణం, నష్టపరిహారం చెల్లింపులకు రూ.10 నుంచి రూ.15 వేల కోట్లు, మల్లన్నసాగర్ నుంచి గండిపేటకు ట్రంక్‌లైన్ ఏర్పాటుకు రూ. ఆరు నుంచి రూ.ఏడు వేల కోట్లు, ఎలివేటర్లు, ఇతరత్రాలకు రూ.30వేల కోట్లు... ఇలా మొత్తంగా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు అవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతుంటే మూసీ ఒక్కదానికే ఆ నిధులంటూ కేంద్ర మంత్రి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పద్ధతిలో మూసీ రివర్ ఫ్రంట్ పనులు చేపడతామని ముఖ్యమంత్రి వివరంగా చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంతవరకు టెండర్లు పిలవలేదు, ఎవరికీ కాంట్రాక్టు ఇవ్వలేదు. ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. అయినా అవినీతి, భారీ ఖర్చు అంటూ ప్రచారం చేయడం తప్పు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఏనాడూ మాట్లాడని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి చేతనైతే హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తేవాలి, లేదా మౌనంగా ఉండాలి.




వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు


హనుమకొండలో దీపాలు, ఉసిరి కొనుగోలు చేస్తున్న మహిళలు

కార్తీక శోభితం..

నిండుపౌర్ణమి వేళ అభిషేకాలు, దీపోత్సవాలు

- నేటి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు, ఆలయాలు
- వేయిస్తంభాల గుడిలో లక్షదీపార్చన
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ


ఉత్సవాలకు సిద్ధమైన కొడవటూరు సిద్ధులగుట్ట

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్/ జనగామ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన.. పవిత్ర కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా భక్తులు ఉసిరిక స్నానాలు చేయడం, బ్రహ్మీ ముహూర్తంలో తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వం ప్రత్యేకత. దీపావళి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పూజలు పౌర్ణమి రోజున మరింత విశిష్టంగా జరుగుతాయి. దీనికి తోడు కార్తీక పౌర్ణమి రోజున శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది. కార్తీక పూజల్లో ముఖ్యమైన ఉసిరి కొమ్మలు, కాయలతో పాటు పూలు, వివిధ రకాల పండ్ల అమ్మకాలతో నగరంలో సందడి కనిపించింది. హనుమకొండ, వరంగల్ చౌరస్తాలతో పాటు అనేక ప్రధాన కూడళ్లలో రద్దీ కనిపించింది. అలాగే జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పలు ఆలయాలను, ప్రసిద్ధ శైవ క్షేత్రాలను ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేలా, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

వేయిస్తంభాల ఆలయంలో ఇలా..

వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఉదయం 5గంట నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే లక్షదీపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహా పలువురు

మిగతా 6వ పేజీలో...

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పర్వదినం సందర్భంగా గురువారం వైకుంఠ చతుర్దశి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిమాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం, శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిరవహించారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గు లు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపా దానం అందజేశారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కాల వ్యవధి	వడ్డీ (%)	సీనియర్ సిటిజన్
సేవింగ్స్ ఖాతా	3.00%	3.00%
7 రోజుల నుండి 90 రోజుల వరకు	5.50%	6.00%
91 రోజుల నుండి 180 రోజుల వరకు	5.70%	6.20%
181 రోజుల నుండి 1 సంవత్సరము లోపల	6.00%	6.50%
1 సంవత్సరము నుండి 3 సంవత్సరముల వరకు	7.25%	7.75%
3 సంవత్సరముల పైబడి 10 సంవత్సరముల వరకు	7.00%	7.50%

ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

రాయపర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. అండర్ -19 ఖోఖో విభాగంలో రాయపర్తి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ధర్మసాగర్ నిలిచింది. ఖోఖో అండర్-14 విభాగంలో విన్నర్‌గా మడికొండ, రన్నర్‌గా రాయపర్తిలు నిలిచాయి. వాలీబాల్ అండర్-19 విభాగంలో విన్నర్‌గా పరకాల, రన్నర్‌గా పర్వతగిరి నిలిచాయి. అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా రాయపర్తి, రన్నర్‌గా మడికొండ ఉన్నాయి. అండర్-19 విభాగంలో టెని కైట్ పోటీల్లో విన్నర్‌గా మడికొండ, రన్నర్‌గా ఎల్కతుర్తి నిలిచాయి. డిస్క్‌త్రో విభాగంలో ఇనుగుర్తికి చెందిన హైమావతి మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఐశ్వర్య నిలిచింది. షార్ట్‌పుట్‌లో హైమావతి మొదటి స్థానంలో నిలిచింది. ఆసక్తిగా సాగిన ఈ క్రీడలకు ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేశారని వరంగల్ డీసీవో అపర్ణ అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కుల గణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. కులగణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతీమానగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. కులగణనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. బీసీ రిజర్వేషన్‌ల పెంపునకే ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. కులగణన కోసం వచ్చే అధికారులకు ఆటంకం కలిగించవద్దన్నారు. అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. బీసీలు కులగణనలో కులం నమోదు చేసుకోవాలన్నారు. జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ గౌడ్‌లు మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లోపు కులగణన పూర్తి చేయాలన్నారు. ప్రొఫెసర్ కూరపాటి మాట్లాడుతూ.. ప్రభుత్వం కులగణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాధికారం సాధించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్క చర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, నాయకులు బోనగాని యాదగిరి గౌడ్, ఎడునూరి రాజమౌళి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ద్వారా మునిసిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పర్మినెంట్ ఐడీ నెంబరు ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర చంద్రమౌళి, స్వచ్ఛ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లెబోయిన మురళీకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్వచ్ఛ ఆటోలను కార్పొరేషన్‌లో విలీనం చేసుకొని, ప్రతీ డ్రైవర్‌కు నెలకు రూ. 25000 వేతనం చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు బుర్ర విజయ్ కుమార్, మట్టెడ సురేందర్, వక్కల కుమార్, సుభాష్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడులను ఖండించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ల వద్ద ఉద్యోగుల నిరసన



హనుమకొండలోఉద్యోగుల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అధికారులపై దాడులను పార్టీలకతీతంగా ఖండించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై జరిగిన దాడికి నిరసనగా జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. నిరసనకు సంఘీబావం తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. ప్రతిపక్షపార్టీల నాయకులు ప్రయోజనాలను పక్కనపెట్టి తమ రాజకీయ మనుగడ కోసం చూస్తున్నారని, ఇలా చేయడం సరైంది కాదన్నారు. హనుమకొండ జిల్లాలో అధికారిపై ఇలాంటి చర్యలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ ఆకుల రాజేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్ మోహన్‌రావు, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ట్రెసా అధ్యక్షుడు బాస్కర్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టీఎన్‌జీఓస్ కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గెజిటెట్ అధికారుల సంఘం నేతలు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, అన్వర్, చంద్రశేఖర్, పెన్షనర్ల సంఘం నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాడులు జరిగితే సహించేది లేదు

వరంగల్ కలెక్టరేట్: ప్రభుత్వం ఏది ఆదేశిస్తే దానికి అనుగుణంగా పనిచేయడమే ప్రభుత్వ ఉద్యోగుల విధి అని, అలాంటి ఉద్యోగులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ అన్నారు. గురువారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక ముందు ఉద్యోగులపై దాడులు జరిగితే సహించేది లేదని, ప్రభుత్వం కూడా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు గనిపాక రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరసనలు తెలపాలనుకుంటే చాలా మార్గాలు ఉన్నాయని, కేవలం దాడి అనేది సరైన మార్గం కాదన్నారు. జిల్లా కలెక్టర్‌కే రక్షణ లేనప్పుడు సామాన్య ఉద్యోగుల పరిస్థితి ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రియాజుద్దీన్, కోశాధికారి పాలకుర్తి సదానందం, రామానుజన్, జగదీశ్వర్, రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, మధుచంద్ర, గణేష్, నూతన ప్రసాద్, భానుప్రకాశ్, శెంకేసి రాజేష్, శ్రీనివాస్, యాకూబ్ నాయక్, సదానందం, వీరన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా నిలుస్తా..

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- సంఘం ఆధ్వర్యంలో వీసీకి ఘన సన్మానం



వీసీని సన్మానిస్తున్న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు

కేయూక్యాంపస్, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు అండగా నిలిచి న్యాయం చేస్తానని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కేయూ సెనెట్‌హాల్‌లో కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్, ప్రమోషన్లను వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఈసం నారాయణ, పుల్లా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారిలాంటి పోస్టులకు ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు రొటేషన్ ప్రకారం కేటాయించాలన్నారు. వర్సిటీలో బ్లాక్‌లాగ్ పోస్టుల భర్తీకి తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని అన్నారు. నాలుగేళ్లుగా వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వివక్ష చోటు చేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అధ్యాపక, అధ్యాపకేతర, పరిశోధకులు, విద్యార్థుల పట్ల అణచివేత కుట్ర జరిగిందని ఉదాహరణతో సహా సభలో వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు ఆర్టికల్ 14, 16 మేరకు రావాల్సిన హక్కులు, పదోన్నతులకు అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే బదిలీల పేరుతో బెదిరింపులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నేళ్లుగా బోధనేతర ఉద్యోగుల ప్రమోషన్లు కుట్రపూరితంగా అపారని, పరీక్షలు నిర్వహించి ఉద్యోగుల పదోన్నతుల ఫలితాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని అన్నారు. వర్సిటీ అన్ని ఏరియాల్లో తమకు ప్రత్యేక రాయితీలు కల్పించకుండా ఎస్సీ, ఎస్టీలను అణగతొక్కారని ధ్వజమెత్తారు. ఎస్డీఎల్‌సీఈలో పీహెచ్‌డీ కల్గిన ఎస్సీ, ఎస్టీలకు కో-ఆర్డినేటర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. తమ సమస్యల పరిష్కరించకుంటే

ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డిని గజమాల, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే బాస్కర్, కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, నేతలు సంగాల దయాకర్, కిరణ్, నర్మెట్ల అయిలయ్య, ప్రతాప్, బాస్కర్, రాజు నాయక్, బొక్క మొగిలి, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగ సంఘం నేత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, హకీంపేట, పోలెపల్లి రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని విముక్తి చిరుతల కక్షి (వీసీకే) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతులను విడుదల చేయాలని డిమాం డ్ చేస్తూ వీసీకేతోపాటు ప్రజాసంఘాల నాయకులు గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జిలుకర శ్రీనివాస్‌తోపాటు గద్దర్ విగ్రహ కమిటీ జిల్లా అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్ మాట్లాడు తూ.. ఫార్మా కంపెనీ ప్రతిపాదనలను ప్రభుత్వంఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మచ్చ దేవేందర్, జోరిక రమేశ్, చెరిపల్లి ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

- అనారోగ్యంతో లొంగిపోయిన మంజుల ఆలియాస్ నిర్మల
- 20 ఏళ్లుగా వివిధ కేడర్‌లలో పీపుల్స్‌వార్‌లో విధులు
- రూ.20 లక్షల రివార్డు చెక్కు అందజేసిన సీపీ
- మావోలు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు



లొంగిపోయిన మావోయిస్టుకు చెక్కును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ మహిళా సభ్యురాలు కోడి మంజుల ఆలియాస్ నిర్మల గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన కోడి మంజుల తండ్రి పీపుల్స్‌వార్‌కు సానుభూతిపరుడిగా పనిచేయడంతో పాటు ఆమె అన్న కుమారస్వామి ఆలియాస్ ఆనంద్, దగ్గరి బంధువు కోడి వెంకన్న ఆలియాస్ గోపన్న నర్సంపేట దళ కమాండర్‌గా పనిచేసి ఎదురుకాల్పుల్లో మరణించారు. వారి ప్రభావంతో పాటు పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితమైన మంజుల.. పదో తరగతిలోనే తన చదువును మధ్యలో ఆపేసి 1994లో సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ గ్రూపు నర్సంపేట దళంలో చేరింది. ఆ తర్వాత చేర్యాల దళంలో పని చేసింది. 1999లో నర్సంపేట దళ కమాండర్ పెరం బుచ్చయ్యను వివాహం చేసుకుంది. 2000లో బుచ్చయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం 2001లో మాచర్ల ఏసోబు ఆలియాస్ జగర్ సారథ్యంలో ప్రెస్ టీం ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో యేడాది పనిచేసి 2002లో మహదేవపూర్ డిప్యూటీ దళ కమాండర్‌గా పనిచేస్తున్న క్రమంలో డివిజనల్ కమిటీ మెంబర్ కుకటి వెంకట్ ఆలియాస్ రమేశ్‌ను వివాహం చేసుకుంది. వైద్యం కోసం మరో మహిళా దళ సభ్యురాలితో భూపాలపల్లికి వచ్చి 2002 డిసెంబర్ 24 పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది.

2004లో జైలు నుంచి విడుదలై తిరిగి మావోయిస్టులతో సంబంధాలు కొనసాగిస్తూ మహదేవపూర్ దళ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2005లో మాహదేవపూర్, చేర్యాల, మహరాష్ట్ర, సిరోంచ, డిప్యూటీ కమాండర్‌గా పనిచేసింది. 2007 నుంచి మణుగూర్ దళ కమాండర్‌తో పాటు పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో ఏరియా కార్యదర్శిగా, వైద్య బృందానికి బాధ్యురాలిగా 2011 వరకు పనిచేసింది. అ తర్వాత 2021 వరకు బస్తర్‌లో వివిధ క్యాడర్‌లో పనిచేసి 2022లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలుగా మంజుల బాధ్యతలు స్వీకరించింది. 2013లో దర్బా డివిజన్‌లో జీరంఘాటి ప్రాంతంలో 27 మంది పోలీసులను హత్య చేసిన సంఘటనతో పాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులుపై జరిపిన కాల్పులో మంజుల నిందితురాలిగా ఉంది.

కాగా, అనారోగ్య సమస్యలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావసం పట్ల ఆకర్షితులై మంజుల లొంగిపోయారని సీపీ తెలిపారు. కాగా, ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు చెక్కును అందజేశామన్నారు. తెలంగాణలో నక్సలిజంకు ఎలాంటి ఆదరణ లేదని, అజ్ఞాతంలో ఉన్న మావోయి స్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఈ సందర్భంగా సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

కార్తీక శోభితం..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. అలాగే హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయం, ములుగు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్తక్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయం, హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీ సీతారామ ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే వరంగల్ నగరంలోని శ్రీ వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి హోమం, అభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేస్తారు.

మహిళలు ఆలయాల్లో వత్తులు కాల్చడంతో పాటు దీపాలు వెలిగించి నైవేద్యం నివేదన చేసి పూజలు చేయనున్నారు. 365 వత్తులు, 1008 వత్తులు, లక్ష వత్తులు కాలుస్తారు. పలుచోట్ల ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున అభిషేకం, భక్తుల ముద్ర మాలలకు పూజ అనంతరం అయ్యప్ప భక్తుల మాలాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి అయ్యప్ప మాల వేసుకునే భక్తులకు ఉచితంగా మాలాధారణ చేసి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నట్లు ఆయన వివరించారు.

సోమేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతిని నిర్వహిస్తున్న మూడో దేవస్థానంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో శుక్రవారం అఖండజ్యోతి గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో సల్వాది మోహన్ బాబు తెలిపారు. అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై 8అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన ప్రమిదలో ఒక టన్ను నువ్వులనూనె, ఆవునెయ్యి, రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్స వం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 5గంటలకు ప్రారంభ మవుతుందన్నారు. ఉత్తరకాశి పీఠాధిపతి స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై అఖండజ్యోతిని ప్రారంభిస్తారన్నారు.

అలాగే జనగామ బాణాపురం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష దీప మహోత్సవం, కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు. బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధుల గుట్ట కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం తెలవారుజాము నుంచే సిద్ధేశ్వరుడికి విశిష్ట అభిషేకాలు, అన్నపూజలు, మహారుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించనున్నారు. స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం సిబ్బంది శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలను నియమించామని ఈవో చిందం వంశీ తెలిపారు.

గ్రూపు-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి..

హనుమకొండ జిల్లాలో 33,456 మంది అభ్యర్థులు, 83 కేంద్రాలు

ఉదయం 8:30గంటల వరకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు రావాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, పోలీసు, విద్య, ఆర్టీసీ, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులతో ఈనెల 17, 18 తేదీలలో జరిగే గ్రూపు-3 పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. 17వ తేదీన ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లు, 18న ఉదయం గ్రూపు-3 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8:30గంటల వరకు చేరుకోవాలని, నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. హనుమకొండ జిల్లాలో 33,456 మంది అభ్యర్థులు గ్రూపు-3 పరీక్ష రాస్తున్నారని, వీరికోసం 83 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్‌టికెట్ దానిపై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీచేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డుని మాత్రమే పరీక్షా హాల్‌లోకి తీసుకెళ్లాలని సూచించారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్(నీలం, నలుపు)తో మాత్రమే రాయాలని, సెల్‌ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్‌లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందజేయాలని, పరీక్షా ఎంట్రెన్స్ గేట్, పరీక్షాకేంద్రాల్లోని టేబుళ్ల, కుర్చీలు శానిటైజేషన్ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ఆర్టీసీ అధికారులు, ఎన్పీడీసీఎల్ అధికారులు, రెవెన్యూశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్చిలోపు కాజీపేట ఆర్వోబీ పూర్తి

- పశ్చిమఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఎంపీ క్యావతో కలిసి బ్రిడ్జి సందర్శన

కాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో అదనంగా నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు మార్చిలోగా పూర్తిచేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. కాజీపేట సెయింట్‌గ్యాబియేల్ గ్రౌండ్‌కు చేరుకున్న బౌస్ట్రింగ్ ఆర్చ్ విడిభాగాలను గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్యలు సందర్శించారు. అధికారులతో కలిసి బ్రిడ్జి స్లాబ్ నమూనా, రైల్వే ట్రాక్‌పై నిర్మించే పనులను మ్యాప్ ద్వారా పరిశీలన చేశారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సాధ్యమైనంత త్వరలో బ్రిడ్జి నిర్మించి ప్రారంభించి తీరుతామన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక చొరవతో బ్రిడ్జి నిర్మాణపనులు సాగుతున్నాయన్నారు. రైల్వే పరంగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న రైల్వే జీఎంను కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార స్వామి, అబూబక్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎమ్డీ అంకూస్, సిరిల్‌లారెన్స్, బంక సరళ, ఇప్ప శ్రీకాంత్, గాదెపాక రమే శ్, సింగారపు రవి ప్రసాద్, పాలడుగుల ఆంజనేయులు, ఎన్వీ సమతరాజుతో పాటు స్థానిక నాయ కులు పాల్గొన్నారు.


మెటీరియల్‌ను, మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ


బౌస్ట్రింగ్ ఆర్చ్ బ్రిడ్జి నమూనా

స్పెషల్ అట్రాక్షన్‌గా బౌస్ట్రింగ్ ఆర్చ్

కాజీపేట ఫాతిమానగర్ వద్ద నిర్మిస్తున్న అదనపు ఆర్వోబీ నిర్మాణంలో బౌస్ట్రింగ్ ఆర్చ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. చత్తీస్‌గడ్‌లో తయారుచేస్తున్న ఈ ఆర్చ్ విల్లు ఆకారంగా ఉంది. రాష్ట్రంలో ఇలాంటి తరహా బ్రిడ్జి ఎక్కడా లేదని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. 500 అడుగుల పొడవుతో బౌస్ట్రింగ్ ఆర్చ్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అబార్షన్లకు పాల్పడే డాక్టర్లపై కఠిన చర్యలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ ద్వారా పుట్టబోయే బిడ్డ అమ్మాయి అని తెలుసుకుని అబార్షన్‌లకు పాల్పడే డాక్టర్లు, ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు హెచ్చరించారు.



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్‌బాబు

కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం గర్భధారణ పూర్వ గర్భస్థ పిండ(లింగ నిర్ధారణ) పరీక్షల నియంత్రణ చట్టం అమలులో భాగంగా జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా న్యాయమూర్తి రమేష్ బాబు మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు, ఎంటీపీ చట్టం నియమాలకు వ్యతిరేకంగా నిర్వహించే అబార్షన్ల గురించి తెలియజేయడానికి కలెక్టరేట్ కార్యాలయం, డీఎంహెచ్‌వో కార్యాలయంలో డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమాచారం ఇచ్చే వారి గురించి పూర్తిగా రహస్యంగా ఉంచుతామని, తెలియజేసిన వారికి ప్రోత్సాహం కూడా ఇవ్వాలన్నారు. రైల్వేస్టేషన్‌లు, బస్‌స్టేషన్‌లు, ఇతర ముఖ్య ప్రదేశాలలో చట్టం గురించి ఉల్లంఘనకు విధించే శిక్షల గురించి తెలియజేసేలా బోర్డులు ప్రదర్శించాలన్నారు. ఏ హాస్పిటల్‌లోనైనా ఉల్లంఘనలకు పాల్పడితే తాత్కాలికంగా వాటి లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చేసే ఆస్పత్రులపై డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించి ఇలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేసే వారిని గుర్తించాలన్నారు. ఇప్పటికే నమోదైన కేసులను ఫాలోఅప్ చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న టోల్‌ఫ్రీ నెంబర్లతో పాటు ఫిర్యాదు చేయడానికి సఖి వన్‌స్టాప్ సెంటర్, టోల్ ఫ్రీ నెంబర్ 181ని కూడా ప్రాచుర్యంలోకి తేవాలని, అలాగే సెంటర్లను తరచుగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్, ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, సెంటర్‌వారు అప్లోడ్ చేసే రిపోర్టులను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి, జయంతి, బన్నూ ఆరోగ్య సేవ సొసైటీ నుంచి ఈవీ శ్రీనివాస్‌రావు, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, డాక్టర్ నవీన్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

బాలసముద్రం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను డయల్ యువర్ ఆర్ఎం కార్య క్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గురువారం ఆర్ఎం విజయ భాను ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర వారం వరంగల్ రిజియన్ పరిధిలోని ప్రయాణికులు బస్సు సర్వీసులపై ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటకు డయల్ యువర్ ఆర్ఎం కార్య క్రమంలో ఫోన్: 9959226056కు సంప్రదించాలని ప్రయాణికులకు తెలిపారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ కలెక్టర్ శ్రీపత్‌జైన్, ఇతర అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ఉద్యోగుల జాయిం ట్ యాక్షన్ కమిటీ జిల్లా ఛైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ అన్నారు. వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై దాడులను నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తున్న ఉద్యోగులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో భగవాన్‌రెడ్డి, వేముల సురేష్, పవన్‌కుమార్, రాజు, విజయ, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

న్యూశాయంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ములుగు రోడ్ లోని ఎల్బీ కళాశాల లైబ్రరీలో గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు మాట్లాడుతూ.. పుస్తకాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అగ్రికల్చర్, అట్లాస్, డిక్షనరీస్, సిటిజన్ షిప్, చరిత్ర, జనరల్ ఆర్గనైజేషన్, సైంటిఫిక్ టెక్నికల్ డిక్షనరీస్‌ను ఈ పుస్తక ప్రదర్శనలో ప్రదర్శించారు. ఎల్బీ కళాశాల గ్రంథపాలకుడు ఎస్.శ్రీనివాస్, డాక్టర్ ఎ.రాఘవేంద్రరెడ్డి, హెచ్.రాజేశ్వర్‌రావు, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులోకి 60 కంప్యూటర్లు

కేయూక్యాంపస్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అందచేసిన 60 కంప్యూటర్లను గురువారం వర్సిటీలోని పలు విభాగాలతో పాటు బోధనేతర సిబ్బంది అవసరాల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థ తరఫున సహకారం అందించిన వంశీ ముత్యపు, పద్మజ రమణి, మనీషా సాహూలకు వర్సిటీ తరఫున రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమిడిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, డయాబెటీస్ స్ర్కీనింగ్ పరీక్షల తీరును పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న డయా బెటిస్ పేషంట్లకు మందులను ఉచితంగా నెలనెలా అందించడమే కాకుండా ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు. టీ డయాగ్నస్టిక్ హబ్‌కు అన్ని పరీక్షల నిమిత్తం శాంపిల్స్ పంపించాలని సూచించారు.

ట్రాఫిక్‌పై బాలలకు అవగాహన సదస్సు

హనుమకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ స్కూల్లో విద్యార్థులు చదువుతో పాటు అన్ని సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ తాము తెలుసుకోవడమే కాకుండా తల్లిదండ్రులకు కూడా తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాటి నాగబాబు, ఎస్ఐలు రావేళ్ల రామారావు, ఉమాకాంత్, కనక చంద్రం, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోలాహలంగా డయాబెటిస్ డే ర్యాలీ



డయాబెటిస్ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు, యువకులు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహం (డయాబెటిస్ డే) దినోత్సవాన్ని పురష్కరించుకు గురువారం హనుమకొండ కాపువాడలో అభయం డయాబికాన్ స్పెషాలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నమిలిగొండ పాంచ్యాల్‌రాయ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం జబ్బు వచ్చినంత మాత్రాన హైరానా పడకుండా డాక్టర్ల సలహాలు, సూచనలతో వైద్యం చేయించుకోవడం ద్వారా నయం కావొచ్చన్నారు. అనంతరం ర్యాలీ కాపువాడ నుంచి అలంకార్ జంక్షన్ వరకు కోళాహలంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డీనేటర్ పులి రజినికాంత్, సభ్యులు పి.శర్మ, సుధాకర్‌రావు, శ్రీనివాస్, మెడికల్‌రిప్‌లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలి

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు బీసీ కులాల 42 శాతం సీట్లను కేటాయిస్తూ అందులో బీసీ ఏ గ్రూపు కులాల దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి బయ్య సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని బీసీ సంరక్షణ సమితి కార్యాలయంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజకతో కలిసి సమావేశంలో మాట్లాడారు. కులగణనలో సమగ్ర కులగణన చేసి తమకు రావాల్సిన రిజర్వేషన్ శాతాన్ని 7 నుంచి 15 శాతానికి పెంచినప్పుడే బీసీ ఏ కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి, బీసీ ప్రజాసంఘాల నాయకులు పల్లపు సమ్మయ్య వడ్డెర, సాయికిరణ్, సూత్రపు కిరణ్, ఇల్లందుల సంతోష్, ప్రతాపగిరి గోవర్ధన్, భిక్షపతి పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏడీసీపీ రవి

హనుమకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 14 నుంచి 20 తేదీ వరకు చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలల హక్కుల వారోత్సవాల గోడ ప్రతులను గురువారం అడిషనల్ డీసీపీ రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. దానికి భంగం కలిగించే వారు ఎవరైనా కఠినంగా చట్టరిత్యా చర్యలు ఉంటాయని అన్నారు. బాలల స్నేహ జిల్లా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసుశాఖ కూడా బాలల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తుందని అన్నారు. సీసీఆర్‌బి ఏసీపీ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ.. బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వసంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయం అని, బాలల హక్కుల రక్షణలో భాగంగా వారిపట్ల సమాజం స్నేహంగా వ్యవహరించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక దోపిడీ నుంచి బాలలను కాపాడుకోవాలసిన అవసరం అందరిపై ఉన్నదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ ప్రాజెక్టు ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, డాన్‌బాస్కో నవజీవ్ డైరెక్టర్ ఫాదర్ కోసి, అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంతోష్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్స్ మండల శ్రీరాములు, కె.అనితారెడ్డి, డాక్టర్ పాలడుగు సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారం పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

జీవిత నిర్దేశాన్ని ఏర్పరుచుకుని చదువుకోవాలి



పెద్ది వెంకటనారాయణను సన్మానిస్తున్న దృశ్యం



మైనారిటీ గురుకులంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు



మడికొండ ఎంపీఎస్‌లో దేశ నేతల వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు
- పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం

న్యూశాయంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు జీవిత నిర్దేశాన్ని ఏర్పరుచుకుని చదువుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు సూచించారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని హనుమకొండ-1 (మైనారిటీ బాలికలు) గురుకులంలో ప్రిన్సిపాల్ ఎం.నీరజ అధ్యక్షతన గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలకు 10కంప్యూటర్లు అందజేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. చదువుకునే క్రమంలో వచ్చే ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు.

• మడికొండ: భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ దేశ నాయకుల వేషధారణతో పాఠశాలలకు చేరుకొని అలరించారు. కేక్స్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాల, అయోధ్యాపురం ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ పెద్ద బాలశిక్షలు అందజేశారు. కార్యక్రమంలో మడికొండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, అయోధ్యాపురం ఎంపీఎస్ ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మడికొండలోని సెయింట్ మాథ్యూస్ హైస్కూల్‌లో బాలల దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ షెరిల్ జాయ్, ప్రిన్సిపాల్ సునిల్ ప్రతాప్‌రెడ్డి, సుజాత, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• కాజీపేట: కాజీపేట సెయింట్ గ్యాబ్రియేల్ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంటోని, ఇన్‌చార్జి స్లీవారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎం.శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులు బాగా చదువాలి

వరంగల్ ఎడ్యుకేషన్: విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని హనుమకొండ రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్, లయన్స్ ఎంజేఎఫ్ సభ్యుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ సూచించారు. గురువారం వరంగల్ ఉర్సుగుట్టలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల, కళాశాల ప్రిన్స్‌పాల్ జనగామ అంజిరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే వార్షిక పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈసందర్భంగా వరంగల్ ఉర్సుగుట్ట ఎంజేపీలో చదివి మెడిసిన్, బీడీఎస్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థినులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఏలూరు రమణారెడ్డి, 1000 పిల్లర్స్ లయన్స్‌క్లబ్ ట్రెజరర్ టి.రవికుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

• రూ.2లక్షల మేర ఆస్తినష్టం



దగ్ధమైన గృహోపకరణాలు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లోని ఓ ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. బాధితులు తాటి సారమ్మ, రజిత తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ఇందిరానగర్‌లో ఉంటున్న తాటి సారమ్మ-కొంరయ్య కుటుంబం గురువారం ఉదయం 8గంటలకు పనినిమిత్తం ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లారు. బయటకు వెళ్లిన గంట వ్యవధిలోనే పెద్దఎత్తున మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కాలిపోయాయని కన్నీటిపర్యంతమయ్యారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తో మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, గృహోపకరణాలు మంటల్లో పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సమాచారం అందుకున్న హనుమకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటంబసభ్యులను వివరాలను అడిగి తెలుసుకొని పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

సత్యం కంప్యూటర్స్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి యువత, నిరుద్యోగుల కోసం సత్యం కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యేటా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కందుకూరి విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో టాలెంట్ టెస్ట్‌కు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఫీజులో రాయితీ ఇస్తామన్నారు. ఈనెల 17న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8341211100లో సంప్రదించాలని ఆయన సూచించారు.

డీసీసీ భవన్‌లో నెహ్రూ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, నాయకులు

హనుమకొండ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమం గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు స్మరించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటరు విజయశ్రీ రజాలీ, మార్క విజయ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పోలీస్ జాగృతి కళాబృందం అవగాహన కార్యక్రమం

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మాక్షి కాలనీలో గురువారం రాత్రి పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు మూఢనమ్మకాలు, డయల్ 100, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అశోక్‌కుమార్, కె.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి లక్ష మారేడు బిల్వార్చన



హనుమకొండ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయి స్తంభాల గుడిలో కార్తీకమాసం 14 రోజు గురువారం ఆధ్యాత్మిక వేత్త చిట్టిరెడ్డి రాంరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రుద్రేశ్వర స్వామివారికి లక్ష మారేడు బిల్వార్చన నిర్వహించారు. అంతకు ముందు ఉదయం ఉత్తిష్ఠ గణపతికి, రుద్రేశ్వర స్వామి వారికి నిత్యాహ్నికం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కార్తీక సమారాధన జరుగగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మడికొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లను గురువారం పీఎస్‌కు పిలిపించి ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ స్థానిక ఎస్సై రాజబాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. భూమి తగాదాలు, గొడవలు, చట్టవ్యతిరేక పనులు చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పర్మిషన్ లేకుండా పీఎస్ పరిధి దాటి వెళ్ళకూడదని ఆదేశించారు.

ఓటర్ల నమోదుకు చైతన్యం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- స్వీప్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపరచడం, భాగస్వామ్యం చేయడంపై ముగ్గుల పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునేలా ఓటు చైతన్యంపై ముగ్గులు వేశారు. విద్యార్థినులు ఓటరు చైతన్యంపై వేసిన ముగ్గులను అధికారులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ముగ్గులతోపాటు వాటి చుట్టూ ఓటు హక్కు, దాని ప్రాముఖ్యతపై రాసిన వివరాలను విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటరుచైతన్యంపై ఆకట్టుకునేలా ముగ్గులువేసిన విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటరు చైతన్య కార్యక్రమాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థినులు ఓటరు చైతన్యంపై ఆకట్టుకునేలా ముగ్గులను వేయడం అభినందనీయమన్నారు. ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు వేసే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య విద్యార్థినీలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యాలత, ఆర్డీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల కేసులను పరిష్కరించాలి

వయోవృద్ధులకు సంబంధించిన కేసులను అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం వయోవృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం పరిధిలో వచ్చిన కేసుల పరిష్కారం కోసం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ట్రిబ్యునల్‌లో నమోదైన కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, కేసుల పరిష్కారంలో భాగంగా ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వయోవృద్ధుల కేసులను జిల్లా సంక్షేమ జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆర్డీవోల పరిధిలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, జిల్లా సంక్షేమ అధికారి, సూపరింటెండెంట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఉద్యోగుల కోసం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉద్యోగులను పరీక్షించి మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్, బీపీ, షుగర్, కార్డియాలజీ, ఆర్థో, నెఫ్రాలజీ వైద్యసేవల ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, మెడికవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీశ్వర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ముందుకు రావాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గ్రంథాలయాల అభివృద్ధికి ముందుకు వచ్చి తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కె.శశిదేవి ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ రంగనాథన్, చాచా నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటాలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, విద్యార్థులు గ్రంథాలయంలో చదువుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వారం రోజుల్లో నూతన చైర్మన్ నియామకం చేసి, గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సిబ్బంది వేతనాల ఆలస్యంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు త్వరలో శాశ్వత పరిష్కారం కల్పిస్తామని సీఎం తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు మాల్సూర్, పురుషోత్తం రాజు, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జూలైవాడ: అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రేటర్ 49వ డివిజన్ మైత్రి వనం కాలనీలో రూ.33లక్షలతో చేపట్టే అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీల్లో అభివృద్ధి పనులను కేటగిరిగా విభజించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నపాటి వర్షాలకే మునిగే కాలనీల డ్రెయినేజీల నిర్మాణాలు, రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభిస్తున్నామని, ప్రతీ కాలనీని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థుల స్టడీ టూర్

కేయూక్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ గురువారం స్టడీ టూర్‌లో భాగంగా భూపాలపల్లిలోని కాకతీయ పవన్ ప్లాంట్‌ను సందర్శించేందుకు వెళ్లారు. విద్యుత్ తయారీ ప్రక్రియలో మార్పులు, తీసుకోవాల్సిన చర్యలు, నష్టాలురాకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు తీసుకోవాల్సిన అంశాలపై విద్యుత్ అధికారులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.సుమలత, డాక్టర్ ఎ.కుమారస్వామి, వి.మల్లికార్జున్‌లు పాల్గొన్నారు. స్టడీ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులకు కేటీపీపీ ఇంజనీర్స్ ప్రకాశ్, రాజేందర్‌లు పలు అంశాలను విద్యార్థులకు చెప్పారు. కాగా కళాశాల ప్రిన్సిపాల్ రమణ, రిజిస్ట్రార్ మల్లారెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు ఉచితంగా న్యాప్‌కిన్‌ల పంపిణీ

కేయూక్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లోని సమ్మక్క-సారక్క మహిళా కళాశాల విద్యార్థినులకు గురువారం వాసవి క్లబ్ కేసీజీఎఫ్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ వి.నరేశ్ నేతృత్వంలో న్యాప్‌కిన్‌లను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఇతర అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. వాసవిక్లబ్ జాబ్ క్యాలెండర్ ఆఫ్ ఇవెంట్స్ చిల్డ్రన్స్ డేను పురస్కరించుకుని న్యాప్‌కిన్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, కోశాధికారి శివ్వా సృజన్, క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ సోమ శ్రీధర్, రిజియన్ చైర్మన్ పుల్లూరు కిశోర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శైలజ వల్లాల, వర్సిటీ హస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, జేడీ డాక్టర్ టి.రాధిక, పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జియాలజీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూక్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా జియాలజీ విభాగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని విద్యార్థులు సాంకేతికతను పెంచుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ జియాలజీ విభాగంలో 2024 జూన్‌లో యూఎస్‌ఏ బోరన్‌టెక్ సోల్యూషన్స్ ఎంఓయూలకు అనుగుణంగా జీఐఎస్ ఇంటర్న్‌షిప్, జీఐఎస్ ల్యాబ్‌లను వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమవేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా టెక్నిక్స్ పెంచుకోవాలన్నారు. విద్యార్థులు వేగవంతమైన మార్పులు గుర్తిస్తూనే ఓపెన్ మైండ్‌తో ఎదగాలని అన్నారు. జియాలజీ విభాగం మంచి సౌకర్యాలున్నాయని చెప్పారు. అమెరికాలోని బోరెన్‌టెక్ సోల్యూషన్ చీఫ్ గోత్ ఆఫీసర్ యుగేందర్ గూడూరు మాట్లాడుతూ.. రిమోట్ సెన్సింగ్‌లో యువతకు మంచి ఉద్యోగాలున్నాయని అన్నారు. ఖనిజ నిల్వలను గుర్తించిన తర్వాత ఇండస్ట్రీతో ఇంటిగ్రేడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

కేయూ జియాలజీ పూర్వ విద్యార్థి, యూవీ సైబర్ సెక్యూరిటీ యూఎస్‌ఏ ప్రెసిడెంట్ పారెపల్లి శ్రీకాంత్, మాట్లాడుతూ.. జియాలజీ స్టూడెంట్స్ టూల్స్ టెక్నిక్‌పై పట్టు సాధించాలని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ జియాలజీ విభాగం దేశ, విదేశీ సంస్థలతో ఎంఓయూ కలిగి ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో జియాలజీ విభాగాభివృద్ధిని వివరించారు. మూడో సెమిస్టర్ స్టూడెంట్స్‌కు యూఎస్‌ఏ సంస్థ ప్రాజెక్టు వర్క్స్‌లో భాగంగా నెలకు రూ.7500 స్టయిఫండ్ చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూవీ సైబర్ సెక్యూరిటీ ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుడిపల్లి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ బి.సురేశ్‌లాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైబ్రరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులందరూ లైబ్రరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ సూచించారు. గురువారం కళాశాలలో లైబ్రరీ వీక్ సెలబ్రేషన్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమణ, లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.సుజాతల నేతృత్వంలో లైబ్రరీ పితామహుడు ఏఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ లైబ్రరీ ప్రాధాన్యతలను వివరించారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ బి.నేతాజీ, సూపరింటెండెట్ బొల్నెపాక ప్రభాకర్, ఎమ్డీ యోనస్, నర్మద, ఎస్.రాజమౌళి, లావణ్య, గౌతమి, కిశోర్, పున్నం చందర్, విజయరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాసాలలో కార్తిక మాసానికి, ఈ నెలలో పౌర్ణమి తిథికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా ఇళ్ళలో, ఆలయాల్లో దీపాలు వెలిగించడం, జ్వాలా తోరణాల విశిష్టత గురించి ప్రముఖ ప్రవచనకారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటీశ్వరరావు వెల్లడించిన విశేషాలివి.



అరుణాచల దీపోత్సవం

కార్తిక పౌర్ణమి దీపాలకు... దేవాలయ ప్రాంగణాలలో అయితే కృత్తికా నక్షత్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలి. ఇంట్లో అయితే తిథిని ప్రమాణంగా తీసుకోవాలి. ఇంట కార్తికదీపం పెడితే కార్తిక పౌర్ణమి తిథి ప్రధానం. దేవాలయంలో పెడితే కృత్తికా నక్షత్రం ప్రధానం. అరుణాచలంలో కృత్తికా నక్షత్రం నాడు జ్యోతి వెలిగిస్తారు. అరుణాచలంలో వెలిగే ఆ కృత్తికా దీపోత్సవాన్ని చూడడానికి కొన్ని లక్షల మంది వస్తారు. ఆ రోజు గిరి ప్రదక్షిణం చేయడానికి అవకాశమే ఉండదు. మొత్తం కొండ చుట్టూ జనంతో నిండిపోతుంది. వారు వెలుగుతున్న దీపం ఒక్కదాన్నే చూస్తారు. చూసి నమస్కారం చేస్తారు. భగవాన్ రమణమహర్షి లాంటివారు కూడా అసురసంధ్యవేళ కాగానే వచ్చి, చెక్క సోఫాలో పడుకొని, అరుణాచలం కొండ మీద వెలిగే దీపం కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఆయనే పెద్ద జ్యోతి స్వరూపుడు. అయినా సరే, ఆ జ్యోతిని చూడ్డానికి ఆయన అక్కడికి వచ్చేవారు. ఆ జ్యోతిని చూసి, నమస్కరిస్తూ ఉండేవారు. భారతదేశం మొత్తం మీద కృత్తికా దీపోత్సవం అంటే అంత ప్రసిద్ధి. అరుణాచలం కొండే అగ్నిలింగం కాబట్టి, అక్కడ కొండ మీద వెలిగించే దీపం అంత ప్రసిద్ధి.

కార్తిక దీపం కథ

కార్తిక పౌర్ణమి నాడు ప్రతి ఒక్కరూ ఇళ్ళలో దీపం పెట్టుకుంటారు. ఆ రోజున గుత్తి దీపాలు కూడా పెడతారు. దీనికి రెండు కారణాలు. ఒక ఇల్లు మనం కడితే... ఆ ఇంట దీపం లేకుండా ఏ ఒక్కరోజూ ఉండకూడదు. మీరు ఇల్లు తాళం పెట్టి ఎక్కడికైనా వెళుతున్నప్పుడు మీ ఇంటి పురోహితుణ్ణి పిలిచి... "రోజూ మా పూజా మందిరంలో దీపం వెలిగించి, స్వామికి ఓ బెల్లం ముక్క నైవేద్యం పెట్టి వెళ్ళండి" అని చెప్పాలని శాస్త్రం స్పష్టం చేస్తోంది. ఇంట దీపం వెలగలేదు అంటే అది పరమ అమంగళకరమైన గృహం అని అర్థం. అలా మీకు ఎన్ని ఇళ్ళు ఉన్నాయో అన్ని చోట్లా దీపాలు వెలుగుతూ ఉండాలి. మీరు 'స్వగృహే' అని ఎక్కడ కూర్చొని సంకల్పం చెప్పగలరో అలాంటి అన్ని చోట్లా 365 రోజులూ దీపాలు వెలుగుతూ ఉండాలి. అలా దీపం వెలగక పోతే ఆ దోషం మీకే వస్తుంది. మళ్ళీ ఆ ఇంట్లో తిరిగినందుకు... ఆ పాపాన్ని పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తంగా లభించిన అద్భుతమైన తిథి కార్తిక పౌర్ణమి. అందుకే కార్తిక పౌర్ణమినాడు 365 వత్తులున్న గుత్తి దీపాన్ని ఆవు నేతిలో ముంచి వెలిగిస్తూ ఉంటారు. పదిరోజులో, పదిహేనురోజులో... ఇది తెలియకముందు తప్పు చేసిన రోజులు ఎన్ని ఉన్నాయో, ఆ రోజుల్లో దీపం పెట్టకపోతే తమకు ఎంత పాపం వస్తుందో అదంతా పోవాలని 365 వత్తులు వెలిగిస్తారు.

దీపం - ఆధ్యాత్మిక నిర్వచనం

దీపం పరమేశ్వర స్వరూపం. ఈశ్వరుడు కాంతి స్వరూపుడు. ఆయన ఎల్లప్పుడూ మన వెనుక వెలుగుతూ ఉంటాడు. వెనుక ఉండి ప్రకాశిస్తూ... మన శరీరం ఎంత కాలం నిలబడాలో అంతకాలం ఊపిరిని గుప్తంగా నిలబెట్టి, ఆ ఊపిరి అయిపోగానే బయటకు వెళ్ళి... శవంగా చేసి పడగొట్టగలిగిన పరమేశ్వర స్వరూపమే అక్కడ కూర్చొని ఉంటుంది. అది కాంతి. అందుకే పూజ అంతా అయిపోయిన తరువాత మంత్రపుష్పంలో చెబుతారు... 'నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా' అని... అణువంత రూపంతో ఇక్కడ ప్రకాశిస్తూ ఉంటాడు. దాన్ని ఏ పేరు పెట్టి పిలుస్తారు? ఏ పేరు పెట్టి పిలిచినా అది పలుకుతుంది. యదార్థానికి ఇది ఒక రూపం కాదు. ఒక కాంతి. అందుకే వెలుగుతోంది. 'భాస్కర' అని పేరు. 'భా' అంటే కాంతి. ఆ కాంతి ఏదో అదే పరమేశ్వరుడు. నిజానికి ఆయనకు ఒక ఆకారం ఎక్కడుంది? 'ఆకారంచ నిర్గుణంచ, సాకారంచ గుణకరం తత్త్వం తత్త్వం' అంటారు శంకరాచార్యులవారు. నిర్గుణం, సగుణం అని రెండు రకాలు. నిర్గుణంలోకి వెళ్ళాలన్నవాడు పరమ వైరాగ్యంలోకి వెళతాడు. సాధారణ ఉపాసన చేసేవాడు, బాహ్య ప్రయోజనం కావాలనుకొనేవాడు మనస్సును నిలబెట్టాలి. కాబట్టి ఒక ఆకారాన్ని పూజ చేస్తాడు. యదార్థానికి అది ఒక కాంతి పుంజం. ఆ కాంతి పుంజమే దివ్యే. దీపం అంటే ప్రకాశం. ఆ దీపమే పరమేశ్వర స్వరూపం.

యజమానే వెలిగించాలి

ఇంటి యజమాని దీపం వెలిగించాలి. 'మా ఆవిడ వెలిగిస్తుంది. నేను టీవీ చూస్తాను' అనుకోకూడదు. యజమాని పంచె కట్టుకొని వెళ్ళి దేవాలయంలో దీపం పెట్టాలి. "యజమాని ఇంట్లో దీపం పెడితే సమస్త భూతాలకు ఉపకారం" అని చెప్పాలి. సంకల్పంలో 'ధర్మపత్నీ సమేతస్య' అని ఉంది తప్ప, ఆవిడ వెలిగించి 'ధర్మపతీ సమేతస్య' అని చెప్పడం సంకల్పంలో లేదు. పురుషుడే ఇంటికి యజమాని కాబట్టి... ఈ రోజున ఆ పని చేయకపోతే... పరమేశ్వరుడు అతనికి ఇచ్చిన అద్భుతమైన అవకాశాన్ని జారవిడుచుకున్నవాడు అవుతాడు. కాబట్టి ఎంతెంత దీపాలు పెడతారో అంతంత అనుగ్రహం.



సమస్త జీవుల ఉద్ధరణ కోసం

కార్తిక పౌర్ణమినాడు వెలిగించే దీపం కేవలం మనకోసమే కాకుండా... మనం చేసే దుష్కృతులను, మన పాపాలను, అంతర తిమిరాన్ని, బాహ్యములోని తిమిరాన్ని పోగొట్టి, లోకోపకారం చేసి, సమస్త జీవులను ఉద్ధరించడానికి పెట్టే దీపం. కాబట్టి ఆశ్వయుజ మాసం చివరిలో వచ్చే దీపంతో మొదలుపెట్టి, కార్తిక పౌర్ణమి వరకూ వెలిగించే దీపాలకు అంత గొప్ప గౌరవం ఇచ్చారు. ఈ దీపాలు వెళ్ళిపోవాలి. దీపాలు వెళ్ళిపోవడం అంటే ఏమిటి? దీపాలను నీటి దగ్గరకు తీసుకువెళ్ళి, అరటి దొప్పలలో పెట్టి విడిచిపెడతారు. నీటిని ఆధారం చేసుకొని ఆ దీపం వెళ్ళిపోతూ ఉంటుంది. "దీపం విడిచిపెట్టానండీ" అంటారు. ఆ దీపం వెళ్ళి ఎక్కడో మరో దీపాన్ని కలుసుకుంటుంది. అలా వెళుతూ, వెళుతూ ఆ నీటిలోనే ఎక్కడో సమాప్తమైపోతుంది. గంగానది ఒడ్డున నిలబడి చూస్తూంటే... అసుర సంధ్య వేళ అయ్యేటప్పటికి ఆ దీపాలన్నీ నదిలో వెళ్ళిపోతూ ఉంటే చూడడానికి మహా ముచ్చటగా ఉంటుంది. గంగ సముద్రంలో కలిసిపోయేటప్పుడు ఆ దీపాన్ని కూడా తీసుకుపోయినట్టు 'రామానామ సంతుష్టాయై నమోనమః' అని లలితాపరాభట్టారికా స్వరూపంలో మీ మనసు లయమై, ఆ. భగవంతుడి గురించే చింతన చేస్తే ఆ భగవంతుడే మిమ్మల్ని తనలోకి తీసుకుంటాడనే పారమార్థిక భావన మనం నదిలో దీపాన్ని విడిచిపెట్టి చూస్తూ ఉండడం వెనుక ఉంది.

నీటి రూపంలో పరమశివుడు

ఈశ్వరుడికి 'తజ్జలా' అని పేరు. నీటికి ఈశ్వరుడనే పేరు ఉంది. లింగ పురాణంలో 'సజీవనం సమస్త నిగత సలిలభ వాయుక్తి యుచ్యతే మూర్తి భవశ్య పరమార్థః' అంటారు. "నీరుగా పరమశివుడు ఉన్నాడు" అని అర్థం. నీటిని ఆశ్రయించి దీపం వెళుతోంది. భగవంతుణ్ణి ఆశ్రయించి సంకల్పాలు వెళుతున్నాయి. సంకల్పాలు ఊపిరి మీద ఆధారపడతాయి. ఊపిరి తీసి, విడిచిపెడుతూ ఉంటే సంకల్పాలు నడుస్తూ ఉంటాయి. మనస్సు కదులుతుంది. ఈ కదలికలు పరమేశ్వరుణ్ణి పట్టుకున్నాయి. ఈ పరమేశ్వరుణ్ణి పట్టుకొని మనసు, ఊపిరి వెళుతున్నాయి. దీపం రెపరెపలాడుతూ... ఎక్కడో ఈ ఊపిరి ఆగిపోతుంది. ఆ ఆగిపోయిన ఆఖరి సంకల్పం కూడా ఆయన నుంచే వచ్చింది, ఆయనలోనే లీనమవుతుంది. అరటి దొప్ప మీద దీపం అలా అలా ప్రయాణం చేస్తూ ఉంటే, దానిలో ఉన్న ఆవు నెయ్యి ఆవిరైపోతుంది. అరటి దొప్పమీదే సమాప్తం అయిపోతుంది. కొంత ఒత్తిడికి తిరగబడి ఆ గంగలోనే కలిసిపోయింది. గంగలో ఉన్న చేప దాన్ని మింగేసింది. 'గంగను ఆధారం చేసుకొని బయలుదేరి, గంగలోనే కలసిపోయిన దీపంలా... నిన్ను ఆధారంగా చేసుకొని, నీ గురించి చేసిన ఉపాసన వల్ల నా చైతన్యం నీలో ఐక్యమగునుగాక! పునరావృత్తిరహిత శివ శాశ్వత అంత్యస్థితిని పొందునుగాక!' అనే పూనికను పెంచుకోవడమే దీపాన్ని విడిచిపెట్టడం. దాన్ని అరటి దొప్ప మీద ఉంచి విడిచిపెడతారు. ఎందుకని? ఆ జలభూతాలకు ఇబ్బంది కలుగకూడదు కాబట్టి. మనం చేసే పనులు ఇతర ప్రాణులకు హాని కలిగించేవి కాకూడదు. అరటిదొప్పలాంటివి నీటిలో నానిపోయినా జలచరాలు తినగలుగుతాయి. అంతేకాని 'నేను పెట్టిన దీపం నీటి మీద బాగా తేలాలి' అనుకొని నీటిలో కరగని పదార్థాన్ని మీరు విడిచిపెట్టారనుకోండి. అది నీటిలో ఉండే వాటికి అపకారం చేసినట్టవుతుంది. అందుకనే 'అరటి దొప్పలో దీపం విడిచిపెట్టండి' అన్నారు పెద్దవాళ్ళు.



• బ్రహ్మశ్రీ చాగంటి కోటీశ్వరరావు

అనువైన చోటే దీపాలు వెలిగించాలి.

కార్తిక దీపానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. మనకు పన్నెండు నెలలు ఉన్నప్పటికీ ఏ నెలలో పెట్టే దీపానికి ఆ నెల పేరు లేదు. ఒక్క కార్తిక మాసంలో వెలిగించే దీపానికి మాత్రమే 'కార్తిక దీపం' అని పేరు. కాబట్టి కార్తిక మాసంలో దీపం వెలిగిస్తే చాలన్నారు పెద్దలు. 'వెలిగించాలి కదా' అని కర్పూరపు బిళ్ళలు తీసుకువెళ్ళి, ఎక్కడ పడితే అక్కడ వెలిగించకూడదు. దీపం పెట్టడానికి ఎక్కడ అనువైన ప్రదేశమో... అక్కడే దీపాలు ఉంచాలి. కార్తికమాసంలో ఏ శివాలయానికైనా వెళ్ళి చూడండి... భక్తి ఎక్కువై, నందీశ్వరుడి వెనుక భాగంలో పెడతారు. ఇది పద్ధతేనా? ఇంకొకరు వచ్చి అక్కడ దర్శనం ఎలా చేసుకుంటారు? వారికి ఇబ్బంది కలుగుతుంది కదా? ఒక పని చేస్తున్నామంటే ఏదో చెయ్యడం కాదు. కొంచం మనసు పెట్టి విచారణ చేయాలి. మనిషిగా మనం ఎంత పరిజ్ఞానంతో, పరిపక్వతతో, పరిణతితో చేయవలసి ఉంటుందో... ఆ ప్రకారం ఆ కార్యాన్ని చెయ్యాలి తప్ప... సమస్త లోకానికి ఉపకారం జరగడం కోసం నిర్దేశించిన ఒక ప్రత్యేకమైన కార్యాన్ని ఎవరికైనా అపకారం మాత్రం చేయకూడదు.

పరమేశ్వరుడిచ్చిన కానుక... జ్వాలాతోరణం



యమద్వార దర్శనం అంటే భీతి చెందిన ఋషులు దాని నుంచి రక్షించేది పరమశివుడు ఒక్కడే కాబట్టి ఆయనను మహా మృత్యుంజయ మంత్రాలతో ప్రార్థన చేశారు. వారికి ఆయన వరం ఇస్తూ కార్తిక పౌర్ణమినాడు జ్వాలా తోరణం ఏర్పాటు చేయమన్నాడు. ఆ ప్రకారం యమద్వారం ఎలా ఉంటుందో ఆ విధంగా ఆలయాల ముందు జ్వాలాతోరణాన్ని నిర్మిస్తారు. రెండు కర్రలు పాతి, అడ్డంగా ఒక కర్ర కడతారు. కొత్త గడ్డి తీసుకువచ్చి దానికి చుడతారు. దాని మీద నెయ్యి పోస్తారు. ఇంధనం పోస్తారు. 'ఆ యమ ద్వారాన్ని చూడవలసిన భయాన్ని మీకు పోగొట్టడానికి నేనున్నాను' అంటూ ఆ స్వామి తనకు అవసరం లేకపోయినా... ఆ అగ్నితోరణం కిందకు పల్లకిలో మనతోపాటు వస్తాడు. కార్తిక పౌర్ణమి నాడు జ్వాలా తోరణం కింద పార్వతీ పరమేశ్వరులు పల్లకిలో వెళుతూ ఉంటే... వారితో కలిసి మూడు సార్లు ఆ తోరణం కింద అటూ ఇటూ ఎవరు వెళ్ళి వచ్చారో... వారు యమద్వారంలో ఉండే అగ్ని తోరణాన్ని చూడరు. అంటే శివ లోకాన్ని కానీ, విష్ణు లోకాన్ని కానీ పొందుతాడు. అది మహర్షులకు పరమేశ్వరుడు ఇచ్చిన అద్భుతమైన కానుక. మహర్షుల కన్నా కూడా వారి ప్రార్థన మీద మానవాళికి ఇచ్చిన కానుక. కాబట్టి కార్తిక పౌర్ణమినాడు జ్వాలాతోరణం చెయ్యకుండా ఉండకూడదు. ఆ జ్వాలా తోరణంలో కాలిపోగా మిగిలిన గడ్డి రక్ష పెడుతుందంటారు. అందుకే అగ్ని హోత్రం ఆరిపోయిన ఆ గడ్డిని ఇంటికి తెచ్చి చూరులోనో, గడ్డి వాములోనో పెడతారు. ఎప్పటికీ ధాన్యాగారాలు నిండుగా ఉండాలని కొంత గడ్డిని ధాన్యాగారంలో పెడతారు. దాని కింద నుంచి శివుడు తిరిగాడు కాబట్టి... ఆ గడ్డి వల్ల భూత ప్రేతాదులు ఇంట్లోకి రావని వాటిని వీధి ద్వారం దగ్గర పెడతారు.



గీతాసారం

చిన్న ప్రయత్నాలతో పెద్ద ఫలితాలు

కర్మ యోగాన్ని ఏ మోతాదులో సాధన చేసినా కూడా ఫలితాలను ఇస్తుందనీ, ఈ ధర్మం (క్రమశిక్షణ) మహా భయాల నుంచి మనల్ని రక్షిస్తుందని శ్రీకృష్ణుడు హామీ ఇచ్చాడు. తమ ఆధ్యాత్మిక యాత్రను ఇప్పుడే ప్రారంభించినవారికి, ఆ ప్రయత్నాన్ని కఠినంగా భావించే సాధకులకు శ్రీకృష్ణుడు ఇచ్చిన కచ్చితమైన హామీ ఇది. మన కష్టాన్ని అర్థం చేసుకున్న కృష్ణుడు... ఒక చిన్న ప్రయత్నమైనా అద్భుత ఫలితాలను ఇస్తుందని హామీ ఇచ్చాడు. నిష్కామకర్మ (ప్రేరణలేని చర్య) ద్వారా సమానత్వ మార్గాన్ని అనుసరించాల్సిందిగా ఆయన మనల్ని ప్రేరేపిస్తాడు. సాంఖ్య యోగం అనేది స్వచ్ఛమైన అవగాహన కాగా, కర్మ యోగంలో ప్రయత్నం చేయాల్సి ఉంటుందనే విషయాన్ని గమనించాలి.

వాటిలో ఒక మార్గం... శ్రీకృష్ణుడు చెప్పిన దాని మీద శ్రద్ధ కలిగి ఉండడం. కర్మయోగం గురించి ఆయన చేసిన బోధను ఆచరించడం. మన అనుభవాలను కర్మయోగం అనే దృష్టితో చూడడాన్ని అభ్యసించినప్పుడు... మన అనుభూతులు మరింత లోతుకు వెళుతూ ఉంటాయి. చివరకు అంతరంగాన్ని చేరుకుంటాయి. దీనికి ప్రత్యామ్నాయమైన మార్గం ఏమిటంటే... కర్మ యోగ సాధన ఆ భయాలను ఎలా తొలగించగలదో తెలుసుకోవడం. మన అంతర్గత అంచనాలకు, వాస్తవ ప్రపంచానికి మధ్య పొంతన కుదరకపోవడమే భయానికి మూలం. కర్మయోగం మనకు నిష్కామ కర్మ గురించి బోధిస్తుంది. ఇది మనం చేసే పనుల విషయంలో ఆశలు లేకుండా ఉండేలా సహాయపడుతుంది. తద్వారా మనలోని భయాన్ని తగ్గిస్తుంది.

నీటి స్వభావం కారణంగా... చుక్కనికి జత చేసిన ఒక చిన్న బద్ద (ట్రిమ్ ట్యాబ్) మీద కాస్త అంతర్గత శక్తిని ఉపయోగించినా... ఓడ తన గమనాన్ని మార్చుకోవడానికి అది సహాయపడుతుంది. అదే విధంగా విశ్వానికి ఉన్న స్వభావం కారణంగా... మన లోపల నుంచి సరైన దిశలో చేసే చిన్న ప్రయత్నం కూడా పెద్ద మార్పును తీసుకురాగలదు. ఇది మనకు కర్మయోగ మార్గం సుగమం కావడానికి సహాయం చేస్తుంది. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు మనం నడక, పరుగెత్తడం నేర్చుకొనే వరకూ ఆ ప్రయత్నాన్ని ఎన్నటికీ వదులుకోం. అది అంత తేలికైన పనేమీ కాదు. అదే విధంగా కర్మయోగంలో ప్రావీణ్యం సంపాదించడానికి పదేపదే చేసే ప్రయత్నాలు చిన్నవైనా... ఖచ్చితమైన విజయవంతమైన ఫలితాలను ప్రసాదిస్తాయి.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ధర్మపథం

కల్పాలు, కల్పభేదాలు

'కల్ప' (కల్పము) అనే పదం బౌద్ధమత ప్రారంభ కాలంలో పాలీ భాషలో కనబడుతుంది. బౌద్ధ సాహిత్యంలో కల్పాన్ని దీర్ఘకాలాన్ని లెక్కించడం కోసం ఉపయోగించారు. కల్పం అనేది సృష్టి, స్థితి, లయం మధ్య కాలం. 'ఒక కల్పం 4.32 బిలియన్ సంవత్సరాలకు సమానం' అని హిందూ మత పురాణాలు నిర్వచించాయి. ప్రత్యేకంగా 'విష్ణుపురాణం'లో, 'భాగవత పురాణం'లో కల్పం గురించి పేర్కొన్నారు. బౌద్ధ గ్రంథమైన 'విశుద్ధ మగ్గం'లో కల్పాలు, వాటి కాల వ్యవధుల వివరణలు ఉన్నాయి. 'కల్పం' అంటే బ్రహ్మకు ఒక పగలు. అది 432 కోట్ల ఏళ్ళు. ఒక కల్పంలో 14 మన్వంతరాలు ఉంటాయి. మన్వంతరాన్నే 'మను యుగం' అని కూడా అంటారు. మన్వంతరానికి 31,10,40,000 సంవత్సరాలు. ఒక్కో మన్వంతరంలో భూమిని ఒక్కో మనువు పాలించాడు. ప్రస్తుతం నడుస్తున్నది ఏడో మన్వంతరం. దీన్ని పాలిస్తున్నది వైవస్వత మనువు. అందుకే దీన్ని 'వైవస్వత మన్వంతరం' అంటారు. ఒక్కో మన్వంతరానికి 71 మహా యుగాలు, ఒక్కో మహాయుగంలో నాలుగు యుగాలు... కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు ఉంటాయి.

పాలీ సాహిత్యంలో ఈ కాలమానానికి, బుద్ధుడికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. 'స్థవిరవాద' బౌద్ధ సాహిత్యం మాదిరిగానే సంస్కృత సాహిత్యంలో కూడా 'కల్ప' అనే పదాన్ని చాలాసార్లు వాడారు. బౌద్ధ సాహిత్యంలో ప్రధానంగా రెండు రకాలైన కల్పాలు ఉన్నాయి. ఒకటి సుజ్ఞకప్పము... అంటే శూన్యకల్పం, రెండోది అసుజ్ఞకప్పము... అంటే అశూన్యకల్పం. బుద్ధుడు, ప్రతిబుద్ధుడు, చక్రవర్తులు ఎవరూ జన్మించని కాలాన్ని 'సుజ్ఞకప్పము' అన్నారు. అంటే ఆ కల్పంలో సద్గురువులు జన్మించరు. అందుకే దాన్ని 'శూన్యకల్పం' అన్నారు. కానీ బుద్ధుడు, ప్రతిబుద్ధుడు, చక్రవర్తి... ఈ ముగ్గురిలో ఒక్కరైనా జన్మిస్తే దాన్ని 'అశూన్య కల్పం' అన్నారు. ఈ అశూన్యకల్పంలో కూడా అయిదు భాగాలు ఉన్నాయి. వాటిని వరుసగా... సరకప్ప, మండకప్ప, వరకప్ప, సరమండకప్ప, భద్దకప్ప అంటారు.

కొండఞ్ఞ, పదముత్తర, సిద్ధత్త విపస్సి బుద్ధులు సారకల్పంలో జన్మించారని పాలీ గ్రంథాలు చెబుతున్నాయి. సుమేధ, సుజాత, తిస్స, పుష్ప, శిఖి, వెస్సభు అనే బుద్ధులు మండకల్పంలో జన్మించారు. అనోమదస్సి, నారద, విపస్సి, అత్తదస్సి, ధమ్మదస్సి అనే బుద్ధులు వరకల్పంలో, తహ్లంకర, మేధంకర, శరణంకర, దీపంకర, మంగళ, సుమన, రేవత, శోభిత అనే బుద్ధులు సరమండకల్పంలో, కకుసంధ, కొణాగమన, కస్సప, గౌతమ బుద్ధ అనే బుద్ధులు భద్రకల్పంలో దర్శనమిచ్చారు. భవిష్యత్తులో జన్మించే మైత్రేయ బుద్ధుడు కూడా భద్రకల్పంలోనే కనిపిస్తాడు. ఈ విధంగా పాలీ సాహిత్యంలో శూన్య కల్ప, అశూన్య కల్పాలు, అయిదు కల్ప భేదాలు కనిపిస్తాయి.



'ఒక కల్పం 4.32 బిలియన్ సంవత్సరాలకు సమానం' అని హిందూ మత పురాణాలు నిర్వచించాయి. ప్రత్యేకంగా 'విష్ణుపురాణం'లో, 'భాగవత పురాణం'లో కల్పం గురించి పేర్కొన్నారు. బౌద్ధ గ్రంథమైన 'విశుద్ధ మగ్గం'లో కల్పాలు, వాటి కాల వ్యవధుల వివరణలు ఉన్నాయి.



ఆచార్య చౌడూరి ఉపేంద్రరావు
జెఎన్‌యూ, ఢిల్లీ.

చింతన

కాలమహిమ

కాలచక్రం నిర్విరామంగా పరిభ్రమిస్తూ ఉంటుంది. దాన్ని నిలువరించడం ఎవరికీ సాధ్యంకాని పని. కాలగమనంలో ఎన్నో పరిణామాలు సంభవిస్తూ ఉంటాయి. వాటిని తెలుసుకొని, సాక్షులుగా ఉండడం తప్ప మనకు వేరే మార్గం ఉండదు. ఒకప్పుడు నిరుపేదగా ఉన్న వ్యక్తి... కొంతకాలానికి గొప్ప ఐశ్వర్యవంతుడిగా కనిపిస్తాడు. అదే కాల మహిమ.

కాలం అత్యంత పవిత్రమైనది. నిర్ణీత కాలంలో చేసిన కార్యం ఏదైనా విజయవంతమై తీరుతుంది. చేయబోయే పనికి సరైన సమయాన్ని నిర్దేశించడం, ఆ నిర్దేశించిన సమయాన్ని మరే కార్యానికీ ఖర్చు చేయకుండా... దేనికోసం కేటాయించారో దానికే ఉపయోగించడం వివేకవంతులు తీసుకొనే తెలివైన నిర్ణయం. కార్యసాధకుడు ఏనాడూ కాలానికి తలవంచడు. తన ప్రయత్నం తాను చేస్తూ ముందడుగు వేస్తాడు. కార్యసాధనలో మొదట నిరాశ ఎదురైనా... దాన్ని లక్ష్యపెట్టకుండా, పట్టుదలతో ముందుకు సాగి విజయాన్ని కైవసం చేసుకుంటాడు.

ఈ విషయంలో మనకు హనుమంతుడు స్ఫూర్తిప్రదాత. సీతాన్వేషణలో హనుమంతుడికి ముందుగా మైనాకుడు ఎదురై, తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆ ఆహ్వానాన్ని ఆయన సున్నితంగా తిరస్కరించి, లంకకు చేరుకుంటాడు. అక్కడ తనకు శాప విముక్తి ప్రసాదించే వానరుడి కోసం లంకిణి ఎంతో కాలంగా నిరీక్షిస్తోంది. చివరకు హనుమ చేతిలో ఆమెకు శాపవిమోచన కలిగింది. అదే కాలమహిమ. కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుంది. కాలం ఎప్పుడూ తక్షణమే సత్ఫలితాలను ఇవ్వదు. అలాగని వెంటనే దుఃఖాలను కూడా ఇవ్వదు. ఎవరికి ఏ సమయంలో ఏది అనుకూలమో దాన్ని మాత్రమే ఇవ్వగలుగుతుంది.

శ్రీరామచంద్రుడికి మరునటిరోజు పట్టాభిషేకం జరగబోతోందని అయోధ్యలో ప్రజలు ఎంతో ఆనందంగా గడిపారు. కానీ ఆ మర్నాడు... అదే సమయానికి సీతారామ లక్ష్మణులు నార వస్త్రాలను ధరించి వనవాసానికి బయలుదేరుతారని ఎవరూ ఊహించలేదు. కానీ రాముడు వనవాసానికి వెళ్ళకపోతే రావణ వధ జరిగి ఉండేది కాదు కదా! కాలమహిమ అంటే అదే మరి! రామ దర్శనం కోసం శబరి పన్నెండేళ్ళపాటు నిరీక్షించింది. ఆ తరువాతే ఆమెకు రామదర్శనం అయింది.



కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ఆమె పునీత అయింది, చివరకు పవిత్ర నదిగా మారింది.

మహా భారతాన్ని గమనిస్తే... మాయా ద్యూతంలో ఓడిన పాండవులు పన్నెండేళ్ళపాటు వనవాసం, ఒక ఏడాది అజ్ఞాత వాసం చేయవలసి వచ్చింది. అయితే వాళ్ళు కుంగిపోలేదు. ఆ కఠినతరమైన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వనవాస సమయంలోనే అర్జునుడు ఇంద్రకీలాద్రిపై తపస్సు చేసి, శివుణ్ణి మెప్పించి, పాశుపతాస్త్రాన్ని వరంగా పొందగలిగాడు. అదే విధంగా స్వర్గలోకంలో ఒక రోజు తన సన్నిధిలో ఉండడానికి నిరాకరించాడని అర్జునుణ్ణి ఏడాదిపాటు బృహన్నలగా మారిపోతావని ఊర్వశి శపించింది. ఆ శాపాన్ని ఆయన వరంగా మార్చుకున్నాడు. అజ్ఞాత వాస సమయంలో... విరాట రాజు కొలువులో నాట్యాచార్యుడిగా చేరి... ఆ శాపాన్ని ఉపయోగించుకున్నాడు. సాక్షాత్తూ నారాయణుడైన కృష్ణుడే కంసుడు, శిశుపాలుడు తదితర దుష్టుల్ని శిక్షించడానికి సమయం తీసుకున్నాడు. పాపం పండితే కాదని ఫలితం బయటకు రాదన్నది సత్యం.

కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రస్తుతం పరిగెడుతున్న కాలంతో మనం సహజీవనం చేస్తున్నాం. ఈ ప్రహసనంలో దుఃఖం మనకు చేరువైన వెంటనే... దానికి సరైన నివారణ వెతకడానికి ప్రయత్నించాలి. అప్పుడు తప్పకుండా విజయం వరిస్తుంది. కాబట్టి కాలాన్ని గౌరవిద్దాం. కాలంతోపాటు పయనిస్తూ... కష్టాలు ఎదురైనప్పుడు వాటికి ఎదురీదుదాం. పట్టుదలతో ముందుకు సాగితే విజయం లభిస్తుంది. కాలం ఎప్పుడూ మనకు అర్థమైన విజయాన్ని ఇవ్వకుండా ఉండదని గుర్తు పెట్టుకొని ముందుకు సాగినప్పుడు జీవితం ఫలప్రదం అవుతుంది.

• మందరపు వి.జె.శంకరాచారి

మామయ్య ఆశీస్సులు



సాయిదుర్గ తేజ్ తెలుగు చిత్రపరిశ్రమలో తన పదేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నారు. ఆయన నటించిన తొలి చిత్రం 'పిల్లా నువ్వు లేని జీవితం' 2014 నవంబర్ 14న విడుదలైంది. ఇక అప్పటినుంచి వరుసగా సినిమాలు చేస్తూ హీరోగా తన స్థాయిని పెంచుకున్నారు సాయిదుర్గా తేజ్. తన మేనమామ పవన్‌కల్యాణ్‌తో కలసి 'బ్రో' చిత్రంలో నటించి తన కల నెరవేర్చుకున్నారు. రోడ్ యాక్సిడెంట్ తర్వాత మళ్లీ కొత్త జీవితాన్ని పొందిన సాయిదుర్గా తేజ్ 'విరూపాక్ష'తో హిట్ కొట్టారు. 'బ్రో' తర్వాత కొంత గ్యాప్ తీసుకుని ఇప్పుడు తన 18వ చిత్రంలో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నిర్మాణం శరవేగంతో జరుగుతోంది. తన పదేళ్ల సినీ జీవితం పూర్తయిన సందర్భంగా సాయిదుర్గా తేజ్ గురువారం సాయంత్రం మంగళగిరిలో మామయ్య పవన్‌కల్యాణ్‌ను కలసి ఆశీస్సులు పొందారు.

వెన్నెల వచ్చింది



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. పెన్ స్టూడియోస్ అధినేత డాక్టర్ జయంతిలాల్ గడా చిత్ర సమర్పకుడు. ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా తమిళ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ నటిస్తోంది. 'అల్లరి పిల్ల వెన్నెల' అంటూ పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. హాఫ్ సారీ ధరించి, సైకిల్ నడుపుతున్న అదితీ లుక్ ఆకట్టుకుంటోంది. సాయిశ్రీనివాస్ సరసన ఆమె నటిస్తోంది.

కొత్తగా..

క్రైమ్ థ్రిల్లర్



త్రిగుణ్ హీరోగా హెబ్బా పటేల్, ఇషా చావ్లా, వర్షిణి హీరోయిన్లుగా నటించిన 'టర్నింగ్ పాయింట్' చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, దర్శకుడు విజయ్ కనకమేడల విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్ దత్తి మాట్లాడుతూ 'ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌కు సస్పెన్స్, మాస్ అంశాలు జోడించి తీస్తున్నాం. త్వరలోనే టీజర్‌ను కూడా విడుదల చేస్తాం. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులను అలరించే సినిమా ఇది.' అన్నారు. దర్శకుడు కుహన్ నాయుడు మాట్లాడుతూ 'క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో త్రిగుణ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ప్రతి సన్నివేశం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి' అని చెప్పారు.

కామెడీ ఎంటర్‌టైనర్



నివాస్, అమితశ్రీ జంటగా నటించే 'తెలియదు.. గుర్తులేదు.. మర్చిపోయా' చిత్రం షూటింగ్ గురువారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో మొదలైంది. వెంకటేశ్ వీరవరపు దర్శకత్వంలో శరత్ చెన్నా నిర్మిస్తున్నారు. పృథ్వీపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ కెమెరా స్విచ్ఆన్ చేయగా, నటుడు రఘుబాబు తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ 'ఇందులో ఓ ఇంట్రెస్టింగ్ రోల్ చేశాను. ఏ పాత్రకు ఎవరు సరిపోతారో వారినే తీసుకుని నిర్మిస్తున్నారు. నిర్మాత శరత్ బాగా చదువుకున్న వ్యక్తి. ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా తీస్తున్నారు' అని చెప్పారు. ఇది ఫుల్‌లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు వెంకటేశ్ చెప్పారు. 18 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు నిర్మాత శరత్ తెలిపారు. వినోద్‌కుమార్, రఘుబాబు, జెమిని సురేశ్, భరద్వాజ్, ఖయ్యూం ఇతర ముఖ్య తారాగణం.

డబ్బు కోసం సాహసాలు



హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న యూనిక్ యాక్షన్ ఫిల్మ్ 'రాబిన్‌హుడ్'. ఈ సినిమాను మైత్రీ మూవీస్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా హై ఫై ఇళ్లను టార్గెట్ చేసుకుని దోపిడిలు చేసే మోడరన్ రాబిన్‌హుడ్‌గా నితిన్‌ని టీజర్‌లో పరిచయం చేశారు. పవర్‌ఫుల్ కుటుంబ నేపథ్యం కలిగిన శ్రీలీలను ఇష్టపడడం, అప్పటికే డేంజర్‌లో ఉన్న అతని లైఫ్‌ని మరింత కాంప్లికేట్ చేస్తుంది. వినోదం, యాక్షన్, బ్రీత్ టేకింగ్ మూమెంట్స్‌తో దర్శకుడు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఇందులో ఓ సీన్‌లో నితిన్ అరబ్ షేక్‌గా కనిపించి అలరించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

జపాన్ వెళ్లిన మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం జపాన్‌లో ఉన్నారు. అయితే ఇది హాలీడే ట్రిప్ కాదు.. 'విశ్వంభర' చిత్రం షూటింగ్ కోసం. ఒక పాట, కొన్ని కీలక సన్నివేశాలను ప్రస్తుతం అక్కడ చిత్రీకరిస్తున్నారు. పది రోజుల పాటు జపాన్‌లో ఉండి తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వస్తారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో చిరంజీవి పోస్ట్ చేసిన లేటెస్ట్ స్టిల్ ఇప్పుడు వైరల్ అవుతోంది. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' వచ్చే సంక్రాంతికి రిలీజ్ కావాలి. అయితే రామ్‌చరణ్ నటిస్తున్న 'గేమ్‌ఛేంజర్' కోసం సంక్రాంతి నుంచి వేసవికి విశ్వంభర చిత్రాన్ని షిఫ్ట్ చేశారు. వశిష్ఠ దర్శకత్వంలో ప్రమోద్, వంశీకృష్ణారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



అందుకే రాటుదేలా


'నా కెరీర్ ఆరంభం నుంచి ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నాను. అందులో రిస్క్ ఎక్కువ ఉంటుంది అని తెలుసు. కానీ నటిగా రాటుదేలాలంటే అదొక్కటే మార్గం అని అర్థం చేసుకున్నాను' అని జాన్వీకపూర్ చెప్పారు. తన సినిమాల ఎంపిక గురించి ఆమె మాట్లాడుతూ 'కమర్షియల్ హంగులు, డ్యూయెట్‌లు, డాన్స్‌లు, ఎక్కువ మందికి రీచ్ అయ్యే అవకాశం ఉన్న సినిమా కథలు నా దగ్గరకు చాలా వచ్చాయి. అలాంటి సినిమాలకు సక్సెస్ రేటు కూడా ఎక్కువే ఉంటుంది. కానీ నన్ను నేను సవాల్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. స్క్రిప్ట్ చదివినప్పుడు నన్ను ఆశ్చర్యపరిచినవాటినే ఎంచుకున్నాను. సినిమా విజయానికి బాక్సాఫీసును ఎప్పుడూ కొలమానంగా చూడను. నేను మొదట్నుంచి కఠినమైన మార్గాన్నే ఎంచుకున్నాను. సులభంగా ఉండే కథలు, పాత్రలకు దూరంగా ఉన్నాను. నాకు సవాల్‌గా అనిపించే వాటినే అంగీకరించాను. అలా ఇండస్ట్రీలో నా ప్రత్యేకతను నిలబెట్టుకున్నాననే అనుకుంటున్నాను' అన్నారు.

విక్కీ మహావతార్

యోధుడు, చిరంజీవి అశ్వత్థామ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. విక్కీ కౌశల్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. 'మహావతార్' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. స్త్రీ 2 చిత్రానికి దర్శకత్వం వహించిన అమర్ కౌశిక్ 'మహావతార్'ను తెరకెక్కిస్తున్నారు. దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను యూనిట్ ఇటీవలే విడుదల చేసింది. అగ్నికీలల మధ్యన తీక్షణంగా చూస్తున్న పరశురాముని పాత్రలో విక్కీ కౌశల్ ఆకట్టుకున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభమైంది. వచ్చే ఏడాది నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 2026 క్రిస్మస్‌కు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం విక్కీ కౌశల్ 'ఛావా' అనే చిత్రం చేస్తున్నారు. ఇందులో ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ పాత్రను ఆయన పోషిస్తున్నారు.




రిపబ్లిక్‌డే నాడు రిలీజ్



అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కై ఫోర్స్'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే నాడు సినిమాను విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. అలాగే క్రిస్మస్ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. 1947లో భారతదేశం పాకిస్థాన్‌పై జరిపిన తొలి వైమానిక దాడుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ దేశభక్తి లాంటి అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ కథానాయికలు. సందీప్ కేల్వానీ, అభిషేక్ అనిల్ కపూర్ ద్వయం దర్శకత్వం వహించారు. దినేశ్ విజన్ జియో స్టూడియోస్‌తో కలసి నిర్మిస్తున్నారు.

కుందాపూర్‌లో కాంతార



రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'కాంతార' సక్సెస్ తర్వాత దీనికి ప్రీక్వెల్‌గా వస్తున్న 'కాంతార: చాప్టర్ 1' పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ఖర్చుకు వెనుకాడకుండా భారీస్థాయిలో సినిమాను తెరకెక్కించే పనిలో పడింది. కర్నాటకను పాలించిన కదంబ రాజుల నేపథ్యంలో కథ సాగుతుంది. ఆ నాటి కాలాన్ని ప్రతిబింబించేలా కుందాపూర్‌లో మేకర్స్ భారీ సెట్స్‌ను నిర్మించి షూటింగ్ చేస్తున్నారు. కొన్ని ఎకరాల విస్తీర్ణంలో రాజ భవనాలు, దేవాలయాల సెట్స్‌ను వేశారు. ఈ చిత్రానికి రిషబ్‌శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ కిరంగందూర్ నిర్మిస్తున్నారు.

అపరిచితుడు కాన్సెప్ట్‌తో



జగదీష్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉపశీర్షిక. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. గురువారం 'యముడు' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి చేతుల మీదుగా విడుదల చేశారు. జగదీశ్ ఆమంచి మాట్లాడుతూ 'విక్రమ్ నటించిన 'అపరిచితుడు' చిత్రం కాన్సెప్ట్ తరహాలోనే మా సినిమా కథ కూడా ఉంటుంది. అధర్మానికి పాల్పడేవాళ్లకు యముడు గరుడ పురాణం ప్రకారం శిక్షలు వేస్తుంటాడు. తెలుగు ప్రేక్షకులకు నచ్చే అన్ని హంగులూ మా సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి కథానాయిక. ఆకాశ్ చల్లా కీలకపాత్ర పోషించారు. సంగీతం: భవానీ రాకేశ్. సినిమాటోగ్రఫీ: విష్ణురెడ్డి వంగా

తెలంగాణ నేపథ్యంలో తొలి డిటెక్టివ్ వెబ్ సిరీస్



నరేశ్ అగస్త్య, మేఘా ఆకాశ్ ప్రధాన పాత్రలు పోషించిన 'వికటకవి' వెబ్ సిరీస్ ఈ నెల 28 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ సిరీస్‌కు ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. తెలంగాణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న తొలి డిటెక్టివ్ వెబ్ సిరీస్ ఇదే. తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ మాట్లాడుతూ 'స్వాతంత్ర్యం రాకముందు మన దేశంలో చాలా సంస్థానాలు ఉండేవి. వాటిల్లో తెలంగాణకు చెందిన అమరగిరి ప్రాంతం ఒకటి. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తి చేస్తున్నారు. కొన్నాళ్లకు ఊరు మునిగిపోతుంది అనగా ఏం జరిగింది అనే బ్యాక్‌డ్రాప్‌లో తీసిన సిరీస్ ఇది. 1940ల్లో అమరగిరి ప్రాంతంలో ఒక సంఘటన జరుగుతుంది. 1970లో అది పునరావృతమవుతుంది. ఇలా జరగడాన్ని అమ్మోరు శాపంగా అక్కడి ప్రజలు భావిస్తుంటారు. హీరో ఈ సమస్యను ఎలా పరిష్కరించాడన్నది ఆసక్తికరం. అప్పటి ప్రపంచాన్ని క్రియేట్ చేసి తెరకు ఎక్కించడం కిక్ ఇచ్చింది. కంటెంట్ ప్రకారం రాయల్ లుక్‌తో చూపిస్తూ మంచి థ్రిల్లర్‌గా రూపొందించాను.' అన్నారు. ఇందులో నరేశ్ డిటెక్టివ్‌గా, అమరగిరి యువరాణిగా మేఘా ఆకాశ్ అద్భుతంగా నటించారని ప్రదీప్ చెప్పారు.

దీపిక పాంచ్ పటాక


దీపికకు అభినందన

13-0తో థాయ్‌పై భారత్ గెలుపు

రాజ్‌గిర్ (బిహార్): చిచ్చర పిడుగు దీపిక ఐదు గోల్స్‌తో మోతెక్కించడంతో.. మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంప్ భారత్ సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకొంది. గురువారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 13-0తో పసికూన థాయ్‌లాండ్‌ను చిత్తు చేసి టోర్నీలో మూడో విజయాన్ని నమోదు చేసింది. దీపిక (3వ, 19వ, 43వ, 45వ, 45వ నిమిషాలు) ఐదు గోల్స్ చేయగా.. ప్రీతి దూబే (9, 40), లాల్‌రిమ్సి యామి (12, 56), మనీషా చౌహాన్ (55, 58) తలో రెండు గోల్స్ సాధించారు. డుంగ్ డుంగ్ (30), నవనీత్ కౌర్ (53) చెరో గోల్ కొట్టారు. శనివారం జరిగే నాలుగో మ్యాచ్‌లో ఒలింపిక్ రజత పతక విజేత చైనాతో భారత్ తలపడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో జరుగుతున్న టోర్నీలో ప్రస్తుతం భారత్ 9 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

సూర్య ఇచ్చిన చాన్స్‌తోనే..


తిలక్ వర్మ

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో తిలక్ వర్మ వన్‌డౌన్‌లో బరిలోకి దిగి శతకంతో అదరగొట్టాడు. అయితే ఈస్థానంలో కెప్టెన్ సూర్యకుమార్ ఆడుతుంటాడు. కానీ ఆ మ్యాచ్‌లో మాత్రం తిలక్ రావడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఇందుకు కారణం.. సూర్యనే అతడి బ్యాటింగ్ ఆర్డర్ మార్చాడట. 'మ్యాచ్ ముందు రోజు రాత్రి కెప్టెన్ సూర్య నా గదికి వచ్చి నీవు మూడో నెంబర్‌లో ఆడబోతున్నావని చెప్పాడు. ఇది చక్కటి అవకాశం.. సద్వినియోగం చేసుకోమని సలహా ఇచ్చాడు. మైదానంలో నా సత్తా ఏమిటో చూపిస్తానని అప్పుడే అతడితో అన్నాను. అలాగే నిరూపించుకోవడం సంతోషంగా ఉంది' అని మ్యాచ్ ముగిశాక తిలక్ తెలిపాడు. అయితే కెప్టెన్ సూర్య మాత్రం.. గెబెహాలో తిలక్ తన గదికి వచ్చి వన్‌డౌన్‌లో చాన్స్ ఇవ్వమని అడిగినట్టు చెప్పడం గమనార్హం.

ప్రీక్వార్టర్స్‌లోనే సింధు ఓటమి

కుమామోటో (జపాన్): భారత ఏస్ షట్లర్ పీవీ సింధు.. జపాన్ మాస్టర్స్ ప్రీక్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సింధు 21-17, 16-21, 17-21తో మిషెల్లీ లీ (కెనడా) చేతిలో ఓడింది. గంటా 15 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను గెలిచిన సింధు.. ఆ తర్వాత తడబడింది.

అర్జున్ పరాజయం

కోల్‌కతా: టాస్ స్టీల్ చెస్ ఇండియా ఓపెన్ ర్యాపిడ్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి రెండు ఓటములు ఎదురయ్యాయి. టోర్నీకి రెండో రోజైన గురువారం జరిగిన నాలుగో రౌండ్‌లో సొవెస్లీ (అమెరికా), ఆరో రౌండ్‌లో టాప్ ర్యాంకర్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో పరాజయం పాలైన అర్జున్.. ఐదో రౌండ్‌లో సహచరుడు నారాయణ‌ లైనాతో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఇక, మహిళల విభాగం నాలుగో రౌండ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌పై గెలిచిన హారిక.. ఐదో రౌండ్‌లో వంతిక అగర్వాల్, ఆరో రౌండ్ వాలెంటినా గునియాతో గేమ్‌లను డ్రాగా ముగించింది. కాగా, మరో జీఎం కోనేరు హంపి రెండు గేమ్‌లు ఓడి ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకొంది. మొత్తంగా ఆరు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ 2 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో.. మహిళల్లో హారిక 3.5 పాయింట్లతో నాలుగు, హంపి 2 పాయింట్లతో 8వ స్థానంలో ఉన్నారు.

సిరీస్‌పైనే గురి!

రాత్రి 8.30 గం. నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో

గెలుపే ధ్యేయంగా భారత్
సమం కోసం దక్షిణాఫ్రికా
నేడు నాలుగో టీ20



జొహాన్నెస్‌బర్గ్: నాలుగు టీ20ల సిరీస్ ఆఖరి అంకానికి చేరింది. శుక్రవారం వాండరర్స్ మైదానంలో భారత్-దక్షిణాఫ్రికాల మధ్య చివరిదైన నాలుగో మ్యాచ్ జరుగనుంది. 2-1 ఆధిక్యంలో ఉన్న టీమిండియాకు సిరీస్ దక్కాలంటే మరో విజయం చాలు. బ్యాటింగ్ పూర్తి స్థాయిలో పటిష్ఠంగా కనిపించకపోయినా.. బౌలర్లు మాత్రం అండగా నిలుస్తున్నారు. అటు ఆతిథ్య జట్టు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాచ్‌ను చేజారనీయకూడదనే కసితో ఉంది. మూడో టీ20లో విజయానికి చేరువగా వచ్చినా ఫలితం సాధించలేకపోయింది. దీంతో నేటి మ్యాచ్‌లో నెగ్గి సిరీస్‌ను సమం చేయాలన్న ఆలోచనలో ఉంది. మరోవైపు వాండరర్స్‌లో భారత్‌కు మెరుగైన రికార్డే ఉంది. ఇక్కడే తొలి టీ20 వరల్డ్‌కప్ గెలవడంతోపాటు, ఈ ఫార్మాట్‌లో సూర్య తన చివరి శతకాన్ని కూడా ఇక్కడే సాధించాడు.

రింకూపై ఆందోళన: ఫినిషర్ రింకూ సింగ్ ఆటతీరుపై జట్టు ఆందోళనలో ఉంది. ఐపీఎల్‌లో సంచలన ఆటతీరుతో టీమిండియాలో చోటు దక్కించుకున్న తను కొంత కాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో కలిపి 28 పరుగులే సాధించాడు. ఆత్మవిశ్వాసం లోపించడంతో సెంచూరియన్‌లో వేగంగా ఆడాలని చూసినా బంతిని సరిగ్గా కనెక్ట్ చేయలేకపోయాడు. ఆరు, ఏడో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగడం కూడా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తోంది. రింకూ ఉత్తమ ఇన్నింగ్స్ అన్నీ ఐదో నెంబర్‌లో ఆడినప్పుడే వచ్చాయి. క్రీజులో నిలదొక్కుకునేందుకు కాస్త సమయం చిక్కితే ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు బ్యాటింగ్ ఆర్డర్‌లో హార్దిక్‌కన్నా ముందుగా పంపితే ఫలితం ఉంటుందేమో. ఇక ఓపెనర్ శాంసన్ రెండు వరుస డకౌట్లతో నిరాశపరిచినా.. అభిషేక్ బ్యాట్ ఝుళిపించడం సానుకూలాంశం. వన్‌డౌన్‌లో దిగిన తిలక్ వర్మ శతకంతో అదరగొట్టాడు. నేటి మ్యాచ్‌లో ఈ ముగ్గురూ చెలరేగితే మరోసారి భారీ స్కోరు ఖాయమే. కెప్టెన్ సూర్యకుమార్ మాత్రం బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. బౌలింగ్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తోంది. అయితే ఈ మ్యాచ్‌లోనైనా పేసర్లు వైశాఖ్, యష్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుందా అనేది వేచిచూడాల్సిందే.

అన్ని విభాగాల్లో రాణిస్తేనే..: చివరి రెండు టీ20ల్లో ఆతిథ్య జట్టు ప్రదర్శన మెరుగ్గానే ఉంది. రెండో టీ20లో సఫారీ బౌలర్లు తేలిపోయినా బ్యాటర్లు మాత్రం భారత్‌ను కాసేపు భయపెట్టారు. విఫలమవుతున్న క్లాసెన్ తన బ్యాట్ పవరేంటో చాటుకున్నాడు. అలాగే జాన్సెన్ అనూహ్య బ్యాటింగ్‌తో దాదాపు గెలుపు దిశగా మ్యాచ్‌ను తీసుకెళ్లాడు. మిల్లర్ ఒక్కడే స్థాయికి తగ్గట్టుగా ఆడడం లేదు. బౌలింగ్‌లో స్పిన్నర్ కేశవ్ అండగా నిలుస్తుండగా పేసర్లు కొట్జీ, సిమెలానె ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. జాన్సెన్ మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయగలిగాడు. నేటి మ్యాచ్ జట్టుకు అత్యంత కీలకం కావడంతో అన్ని విభాగాల్లోనూ చెలరేగితేనే భారత్‌ను ఓడించి సిరీస్‌ను సమం చేసే అవకాశం ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, రమణ్‌దీప్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: రికెల్టన్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కొట్జీ, సిమెలానె, కేశవ్, సిపామ్లా.

పిచ్, వాతావరణం

వాండరర్స్ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఆఖరి పది మ్యాచ్‌ల్లో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 174గా ఉంది. దీంతో నేటి మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లు ఖాయమే. ఇక్కడ ఆడిన చివరి పోరులో భారత్ 200+ స్కోరు చేయగా.. కుల్దీప్ ఐదు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను 100లోపే కట్టడి చేశాడు. ఆకాశం మేఘావృతంగా ఉండనుంది.

ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం



హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 18న జరిగే ఫిఫా ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ పోస్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో భారత్-మలేసియా జట్ల మధ్య ఈ మ్యాచ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్స్‌వెల్ మెరుపులు

తొలి టీ20లో ఆసీస్ గెలుపు

బ్రిస్బేన్: మ్యాక్స్‌వెల్ (43) మెరుపు దాడితో.. తొలి టీ20లో ఆస్ట్రేలియా 29 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. వర్షం కారణంగా 7 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత ఆసీస్ 4 వికెట్లకు 93 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 64/9 స్కోరు మాత్ర మే చేసింది. టాపార్డర్ బ్యాటర్ల పేలవ ప్రదర్శనతో 24/6తో పీకల్లోతు కష్టాల్లో నిలిచిన పాక్‌ను టెయిలెండర్లు అబ్బాస్ అఫ్రీది (20), షహీన్ అఫ్రీది (11) ఘోర పరాభవం నుంచి కాపాడారు. బ్రాట్‌లెట్, నాథన్ ఎలీస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌తో బాబర్ ఆజమ్ పాక్ తరపున అత్యధిక (124) వన్డేలాడిన షోయబ్ మాలిక్ రికార్డును దాటేశాడు.

గోవా కుర్రాళ్ల చరిత్ర

రంజీల్లో 606 పరుగుల భాగస్వామ్యం


కశ్యప్ బక్లే (300 నాటౌట్)
స్నేహల్ కౌతాంకర్ (314 నాటౌట్)

పోర్వోరిమ్ (గోవా): గోవా ఆటగాళ్లు స్నేహల్ కౌతాంకర్ (215 బంతుల్లో 314 నాటౌట్), కశ్యప్ బక్లే (269 బంతుల్లో 300 నాటౌట్) త్రిశతకాలతోపాటు 90 ఏళ్ల రంజీ చరిత్రలో రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ప్లేట్‌గ్రూప్‌లో అరుణాచల్‌పై గోవా ఇన్నింగ్స్ 551 పరుగుల భారీ తేడాతో గెలిచింది. మూడో వికెట్‌కు స్నేహల్, కశ్యప్ ఏకంగా 606 పరుగులు చేసి రంజీ చరిత్రలో అత్యధిక భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో గోవా తొలి ఇన్నింగ్స్‌ను 92 ఓవర్లలో 727/2 వద్ద డిక్లేర్ చేసింది. ప్లేట్ డివిజన్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు. అరుణాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 84, రెండో ఇన్నింగ్స్‌లో 92 పరుగులు సాధించింది. 2016లో ఢిల్లీతో మ్యాచ్‌లో మహారాష్ట్ర ప్లేయర్లు ఎస్ఎం గుగాలె, ఏఆర్ బావ్నే మూడో వికెట్‌కు 594 పరుగుల భాగస్వామ్య రికార్డును స్నేహల్, కశ్యప్ బద్దలు కొట్టారు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు బ్యాటర్లు ట్రిపుల్ సెంచరీలు చేయడం రంజీ చరిత్రలో ఇది రెండోసారి. ఇక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో శ్రీలంక ఆటగాళ్లు సంగక్కర-మహేల జయవర్దనె సాధించిన 624 పరుగుల (2006లో దక్షిణాఫ్రికాతో టెస్టు) భాగస్వామ్యం తర్వాత ఇదే అత్యధికం. మనోళ్లు మరో 19 పరుగులు చేసివుంటే ప్రపంచరికార్డు బద్దలైవుండేది.

హైదరాబాద్ 301

ఆంధ్ర 168/2 ● రషీద్ అర్ధసెంచరీ

హైదరాబాద్: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ఎలీట్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 301 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (159) భారీ శతకం సాధించాడు. స్పిన్నర్ విజయ్‌కు ఐదు, రఫీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 2 వికెట్లకు 168 పరుగులు చేసింది. రషీద్ (79 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో నిలవగా, కరణ్ షిండే (41 బ్యాటింగ్) అండగా ఉన్నాడు.

షమికి 4 వికెట్లు

ఇండోర్: పేసర్ మహ్మద్ షమి (4/54) అదరగొట్టాడు. దీంతో బెంగాల్‌తో రంజీలో రెండో రోజు గురువారం మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకే కుప్పకూలింది. 61 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలెట్టిన బెంగాల్ 170/5 స్కోరుతో నిలిచింది. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 228 రన్స్ చేసింది.

బిజినెస్

రెండేళ్ల గరిష్ఠానికి ఎగుమతులు



అక్టోబరులో రూ. 3.33 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం అక్టోబరులో మంచి వృద్ధిని నమోదు చేసింది. వాణిజ్య ఎగుమతులు గత ఏడాది అక్టోబరుతో పోల్చితే 17.25 శాతం పెరిగి 3,920 కోట్ల డాలర్లకు (రూ.3.33 లక్షల కోట్లు) చేరాయి. ఎగుమతుల రంగం 2022 జూన్‌లో నమోదు చేసిన వృద్ధి 30.12 శాతం తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదే. వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) గత ఏడాది అక్టోబరుతో పోల్చితే తగ్గినా ఈ ఏడాది సెప్టెంబరు నెలతో పోల్చితే మాత్రం పెరిగి 2,714 కోట్ల డాలర్లకు (రూ.2.31 లక్షల కోట్లు) చేరింది. ఇది సెప్టెంబరు నెలలో 2,078 కోట్ల డాలర్లుంటే (రూ.1.77 లక్షల కోట్లు) గత అక్టోబరులో 3,042 కోట్ల డాలర్లుగా (రూ.2.59 లక్షల కోట్లు) నమోదైంది. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 3.9 శాతం వృద్ధితో 6,386 కోట్ల డాలర్ల (రూ.5.43 లక్షల కోట్లు) నుంచి 6,634 కోట్ల డాలర్లకు (రూ.5.64 లక్షల కోట్లు) పెరిగాయి. క్రూడాయిల్ దిగుమతులు 13.34 శాతం పెరగడం ఇందుకు కారణం.

ఇతర ముఖ్యాంశాలు...

- ఏప్రిల్-అక్టోబరు నెలల కాలంలో ఎగుమతులు 3.18 శాతం పెరిగి 25,228 కోట్ల డాలర్లకు (రూ.21.44 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 5.77 శాతం పెరిగి 41,693 కోట్ల డాలర్లకు (రూ.35.44 లక్షల కోట్లు) చేరాయి.
- 7 నెలల వాణిజ్య లోటు 14,967 కోట్ల డాలర్ల (రూ.12.72 లక్షల కోట్లు) నుంచి 16,465 కోట్ల డాలర్లకు (రూ.13.99 లక్షల కోట్లు) చేరింది.
- 7 నెలల కాలంలో సేవల రంగం ఎగుమతులు 21,598 కోట్ల డాలర్లుగా (రూ.18.36 లక్షల కోట్లు) నమోదయ్యాయి.
- అక్టోబరులో క్రూడాయిల్ దిగుమతులు 1,610 కోట్ల డాలర్ల (రూ.1.37 లక్షల కోట్లు) నుంచి 1,820 కోట్ల డాలర్లకు (రూ.1.55 లక్షల కోట్లు) చేరాయి.
- ఇంజనీరింగ్ ఎగుమతులు 39.37 శాతం, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 45.7 శాతం పెరిగాయి. అయితే పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం 22 శాతం తగ్గాయి.


తగ్గిన బంగారం దిగుమతులు

అక్టోబరు నెలలో బంగారం దిగుమతులు స్వల్పంగా తగ్గి 723 కోట్ల డాలర్ల (రూ.61,455 కోట్లు) నుంచి 713 కోట్ల డాలర్లకు (రూ.60,605 కోట్లు) దిగి వచ్చాయి. వెండి దిగుమతులు కూడా 131 కోట్ల డాలర్ల (రూ.11,135 కోట్లు) నుంచి 33 కోట్ల డాలర్లకు (రూ.2,805 కోట్లు) తగ్గాయి.

2.36 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార వస్తువుల ధరల పెరుగుదల ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై కూడా పడింది. అక్టోబరులో ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 2.36 శాతానికి దూసుకుపోయింది. కూరగాయలు, తయారీ వస్తువుల ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. టోకు ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 1.84 శాతం ఉండగా గత ఏడాది అక్టోబరులో మైనస్ 0.26 శాతం ఉంది. సెప్టెంబరుతో పోల్చితే ఆహార వస్తువుల ధరల వృద్ధిరేటు 11.53 శాతం నుంచి 13.54 శాతానికి పెరిగింది. కూరగాయల ధరల్లో వృద్ధి 48.73 శాతం నుంచి 63.04 శాతానికి చేరింది. బంగాళాదుంప ధరల్లో వృద్ధి 78.73 శాతం, ఉల్లిపాయల ధరల పెరుగుదల 39.25 శాతం వద్ద యథాతథంగా ఉంది. తయారీ వస్తువుల ధరలు 1.50 శాతం పెరిగాయి. టోకు ద్రవ్యోల్బణం వృద్ధిలో 0.63 శాతం వాటా ఆహార ద్రవ్యోల్బణానిదేనని ఇక్రా సీనియర్ ఎకనామిస్ట్ రాహుల్ అగర్వాల్ అన్నారు.

క్విక్ కామర్స్‌తో కిరాణా హైరానా



రాజకీయ సమస్యగా మారే ప్రమాదం
ఎఫ్‌పీఐల పెట్టుబడులపై జర జాగ్రత్త
ఉదయ్ కోటక్

ముంబై: క్విక్ కామర్స్ సంస్థల విజయంతో దేశంలోని కిరాణా దుకాణాలకు సవాళ్లు తప్పవని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ హెచ్చరించారు. ముందు ముందు ఇది రాజకీయ సమస్యగానూ పరిణమించే ప్రమాదం ఉందన్నారు. సీఎన్‌బీసీ టీవీ 18 నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ ఆందోళన వ్యక్తం చేశారు. క్విక్ కామర్స్ కంపెనీ స్విగ్గీ ఐపీఓ విజయవంతమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ప్రపంచంలో అనేక దేశాల్లో పెద్దగా రాణించని క్విక్ కామర్స్ సంస్థలు మన దేశంలో మాత్రం బాగా రాణిస్తున్నాయన్నారు. మన దేశ క్విక్ కామర్స్ కంపెనీల సృజనాత్మకత ఇందుకు ప్రత్యేక కారణమని కోటక్ అన్నారు. మన దేశ కంపెనీలు సృజనాత్మకంగా ఆలోచించి సరికొత్త ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని సూచించారు.

కాగా భారత స్టాక్ మార్కెట్‌పై పెరుగుతున్న ఎఫ్‌పీఐల పట్టుపైనా ఉదయ్ కోటక్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంస్థలు మన మార్కెట్లో 90,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.75.98 లక్షల కోట్లు) వరకు పెట్టుబడులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక విధానాలు లేదా ఇతర అంతర్జాతీయ పరిణామాలతో ఈ సంస్థలు ఇందులో 5 నుంచి 10 శాతం పెట్టుబడులను వెనక్కి తీసుకున్నా, తట్టుకునేలా మన విధానాలు ఉండాలన్నారు.

మనకు ఢోకా లేదు: ఆర్‌బీఐ గవర్నర్ దాస్

అంతర్జాతీయంగా కొన్ని ఆటుపోట్లు ఉన్నా మన ఆర్థిక వ్యవస్థకు ప్రస్తుతం ఎలాంటి ఢోకా లేదని ఇదే సదస్సులో ప్రసంగించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించాలన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. అక్టోబరులో 6 శాతం దాటిన రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు నుంచి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు.. మన మొత్తం విదేశీ రుణాల తీర్చివేసినా.. ఏడాది దిగుమతులకు సరిపోయే స్థాయిలో ఉన్నట్టు దాస్ తెలిపారు డాలర్‌తో రూపాయికి నిర్దిష్ట మారకం రేటు నిర్ణయించే ఆలోచన లేదని కూడా దాస్ స్పష్టం చేశారు. కాకపోతే అనుచిత ఆటుపోట్లను అడ్డుకునేందుకు మాత్రం అపుడప్పుడు జోక్యం చేసుకుంటామన్నారు.

కొన్ని స్టార్టప్స్ మిణుగురు పురుగులే
రాజీవ్ బజాజ్

ఇదే సదస్సులో ప్రసంగించిన బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్, స్టార్టప్ కంపెనీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సరికొత్త ఉత్పత్తులు, మార్కెట్ వ్యూహం, టెక్నాలజీ లేకుండా కొన్ని స్టార్టప్ కంపెనీలు ఉన్నదంతా తగలబెట్టుకుంటున్నాయన్నారు. ఇలాంటి స్టార్టప్‌లను ఆయన మిణుగురు పురుగులతో పోల్చారు. స్టార్టప్ కంపెనీల్లో 90 నుంచి 95 శాతం మూతపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లోనూ ఏటా సగం మంది గుడ్‌బై చెబుతున్నారన్నారు. విక్రయానంతర సేవలు పేలవంగా ఉండడంతో స్టార్టప్‌ల వినియోగదారులూ తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్టు బజాజ్ తెలిపారు.

పిట్టీ ఇంజనీరింగ్ లాభంలో 73% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.38.02 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికం (రూ.22.01 కోట్లు)తో పోల్చితే లాభం 72.74 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 44.39 శాతం వృద్ధితో రూ.315.30 కోట్ల నుంచి రూ.455.25 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు ముగిసే నాటికి కంపెనీ నికర రుణ భారం రూ.330.42 కోట్లుగా ఉంది. సెప్టెంబరు త్రైమాసికంలో నిర్వహణ, ఆర్థికపరంగా కంపెనీ పనితీరును మరింత మెరుగుపరుచుకోగలిగామని, రానున్న త్రైమాసికాల్లో వ్యూహాత్మకంగా కొనుగోళ్లు చేపట్టంతో పాటు కార్యకలాపాలను ఇంటిగ్రేట్ చేసే అవకాశాలను కొనసాగించనున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ ఎండీ,సీఈఓ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు. ఈ ఏడాది జూలైలో కంపెనీ దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్‌ను చేజిక్కించుకుంది.

హీరో మోటోకార్ప్ లాభం రూ.1,066 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజ సంస్థ హీరో మోటోకార్ప్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,066 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 6 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం రెవెన్యూ రూ.9,533 కోట్ల నుంచి రూ.10,483 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం 15.2 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కాగా వచ్చే ఆరు నెలల్లో ప్రీమియం విభాగంలో ఎక్స్‌పల్స్ 210, ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, కరిజ్మా ఎక్స్ఎంఆర్ 250 విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

• మాగెల్లానిక్ క్లౌడ్ ఆదాయం రూ.157 కోట్లు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మాగెల్లానిక్ క్లౌడ్.. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.157.30 కోట్ల రెవెన్యూపై రూ.24.42 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 10.7%, రెవెన్యూ 2.1 శాతం వృద్ధి చెందింది. ఐటీ, ఐటీ సర్వీసులు, డ్రోన్ టెక్నాలజీ విభాగాల్లో మంచి పనితీరు కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	540
వరంగల్	532	గోదావరి	545
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	105
కరీంనగర్	90	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	91
కర్నూలు	90	నెల్లూరు	91
విశాఖపట్నం	103	అనంతపురం	91
గోదావరి	109		



నిఫ్టీ..ఆరో రోజూ నష్టాలే..

• నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం ట్రేడింగ్‌లో మరింత నష్టపోయాయి. సెన్సెక్స్ మరో 110.64 పాయింట్లు కోల్పోయి 77,580.31 వద్దకు జారుకుంది. సూచీ జారుకోవడం వరుసగా ఇది మూడో రోజు. కాగా, నిఫ్టీ 26.35 పాయింట్ల నష్టంతో 23,532.70 వద్ద ముగిసింది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది ఆరో రోజు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠానికి ఎగబాకడంతో ట్రేడింగ్ సెంటిమెంట్ మరింత బలహీనపడింది. కాగా, గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు ప్రకటించారు.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ గురువారం సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు క్షీణించి 84.46 వద్ద ముగిసింది.

అదరగొట్టిన నవ లిమిటెడ్

క్యూ2 లాభంలో 365% వృద్ధి
2:1 నిష్పత్తిలో షేర్ల విభజన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్ కంపెనీ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.430.5 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.146.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.31.40 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 365.3 శాతం వృద్ధి చెందగా ఆదాయం 21.3 శాతం (రూ.355 కోట్లు) వృద్ధి చెందింది. త్రైమాసిక కాలంలో మెరుగైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రూ.942.90 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.331.90 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మరోవైపు గురువారం జరిగిన సమావేశంలో రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లను రూ.1 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా (2:1 నిష్పత్తి) విభజించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

మరో 18 జిల్లాల్లో గోల్డ్ హాల్‌మార్కింగ్ తప్పనిసరి

న్యూఢిల్లీ: దేశంలోని మరో 18 జిల్లాల్లో గోల్డ్ హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్,బిహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌కు చెందిన 18 జిల్లాల్లో ఈ నెల 5 నుంచే ఇది అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

రిలయన్స్, డిస్నీ మీడియా ఆస్తుల విలీనం పూర్తి

- రూ.70,352 కోట్ల విలువైన జేవీ ఏర్పాటు
- విలీన సంస్థ చైర్మన్‌గా నీతా అంబానీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీకి చెందిన భారత ఆస్తులతో రిలయన్స్ ఇండస్ట్రీస్ మీడియా వ్యాపారం విలీన ప్రక్రియ పూర్తయింది. తద్వారా రూ.70,352 కోట్ల విలువైన జాయింట్ వెంచర్ (జేవీ)గా అవతరించింది. ఆర్ఐఎల్ అధిపతి ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ ఈ జేవీకి చైర్మన్‌గా నియమితులయ్యారు. డిస్నీకి చెందిన ఉదయ్ శంకర్ వైస్ చైర్మన్ హోదాలో జేవీకి వ్యూహాత్మక మార్గనిర్దేశం చేస్తారు. విలీన ఒప్పందంలో భాగంగా ఈ జేవీ వ్యాపారాభివృద్ధి కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.11,500 కోట్లు సమకూర్చింది. ఈ విలీన సంస్థ ఆర్ఐఎల్ నియంత్రణలో ఉండనుంది. సంస్థలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 16.34 శాతం, తన మీడియా అనుబంధ విభాగమైన వయాకామ్ 46.82 శాతం, డిస్నీ 36.84 శాతం వాటా కలిగి ఉంటాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,650 ▼	69,360 ▼	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

మాజీ మంత్రి మల్లారెడ్డి మోసం చేశారు

- నా భూమి కొని డబ్బులివ్వడం లేదు
- న్యాయం చేయండి : సీఎంకు బాధితుడి వినతి

బర్కత్‌పుర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తన వద్ద భూమిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని, డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని 87 ఏళ్ల బాధితుడు కళ్లెం నర్సింహారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నర్సింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... శామీర్‌పేట మండలం యాడారంలో సర్వే నం. 249, 250ఏ లోని తనకు చెందిన 9ఎకరాల 29 గుంటల భూమిని రూ.21.88 కోట్లకు కొనుగోలు చేయడానికి చామకూర మల్లారెడ్డి రూ.8.3 కోట్లు చెల్లించి ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత రూ.14 కోట్లకు చెక్కు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, తీరా అది బౌన్స్ అయిందని వాపోయారు. చెక్కు బౌన్స్ కావడంతో తనకు డబ్బులు ఇవ్వాలని 40 రోజులుగా అడుగుతుంటే వేధింపులకు గురి చేయడమే కాకుండా, కేసులు బనాయిస్తానని బెదిరిస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని, మాజీ మంత్రి మల్లారెడ్డి నుంచి డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు.

రాష్ట్రంలో 'కార్పొరేట్ సర్కారు' పాలన

- కాంగ్రెస్.. పేదల, రైతు వ్యతిరేకి: మావోయిస్టు జగన్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పని చేస్తోందని మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి కార్పొరేట్ల లాభాల కోసం పని చేస్తూ.. వారి పెట్టుబడుల నుంచి పెద్ద మొత్తంలో కమీషన్లు పొందుతున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో పేదలపై సర్కారు బుల్డోజర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా దామగుండంలో రేడార్ స్టేషన్ నిర్మాణంతో అనంతగిరి కొండలు ధ్వంసం అవుతున్నాయని, వేలాది మంది అడవి బిడ్డలు జీవించే హక్కును కోల్పోతున్నాయని పేర్కొన్నారు. లగచర్లలో ఫార్మాసిటీ నిర్మించి ప్రకృతి వనరులతోపాటు రైతుల భూములు కొల్లగొట్టడానికి పథకం పన్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో విప్లవకారులపై దాడులకు పూనుకున్నారని జగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా కమిషన్‌కు వేణుస్వామి తరపున 15 మంది అడ్వకేట్లు

- కమిషన్ ఎదుట హాజరుకారని చెప్పేందుకు వచ్చిన బృందం

హైదరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయానికి జ్యోతిష్కుడు వేణుస్వామి అడ్వకేట్లు పెద్ద సంఖ్యలో వెళ్లారు. ఇటీవల వేణుస్వామిపై పలువురు మహిళా జర్నలిస్టులతో పాటు మరికొంత మంది కలిసి మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించి తమ ఎదుట హాజరుకావాలంటూ మహిళా కమిషన్ వేణుస్వామికి నోటీసులు పంపింది. అయితే కమిషన్ ముందు హాజరుకానంటూ ఆయన రిజిస్టర్ పోస్టు ద్వారా కమిషన్‌కు తెలిపారు. అదే విషయాన్ని తెలిపేందుకు మళ్లీ 15 మంది అడ్వకేట్లను గురువారం కమిషన్ కార్యాలయానికి పంపారు. కమిషన్ ఎదుటకు రాలేకపోయినా ఆ విషయాన్ని చెప్పడానికి ఇంతమంది అడ్వకేట్లు అవసరమా అని కమిషన్ కార్యాలయం సిబ్బంది ప్రశ్నించారు. అడ్వకేట్ల బృందం రావడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అడ్వకేట్ల బృందం వ్యవహరించిన తీరు చూసి కమిషన్ సిబ్బంది విస్తుపోయారని మహిళా కమిషన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



గాంధీభవన్‌లో జరిగిన నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న భట్టి, దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్

గాంధీభవన్‌లో ఘనంగా నెహ్రూ జయంతి

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని, భారత రత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన దార్శనికుడని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షుడె మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో జరిగిన నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా... నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ ఇన్‌చార్జి సామ రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోత వ్యాఖ్యలతో అందరినీ బాధించా

- తప్పు చేశా.. క్షమించండి.. కేసుల నుంచి తప్పించండి
- మంత్రి లోకేశ్‌కు నటి శ్రీరెడ్డి లేఖ

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోమ్ మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో కేసులు ఎదుర్కొంటున్న సినీ నటి శ్రీరెడ్డి గురువారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. తనను మన్నించాలంటూ ఇప్పటికే ఒకసారి వీడియోద్వారా లోకేశ్‌ను శ్రీరెడ్డి అభ్యర్థించారు. ఆ వీడియోలోని అంశాలనే లోకేశ్‌కు రాసిన లేఖ ఆమె ప్రస్తావించారు. "నా రోత భాషతో ఎంతమందిని బాధ పెట్టానో గత పదిరోజుల్లో జరిగిన పరిణామాలతో తెలుసుకున్నాను. సోషల్ మీడియాలో చాలాసార్లు నేను మొరటుగా ప్రవర్తించాను. ఎన్డీయే కూటమిలోని టీడీపీ, జనసేన, వాటి అనుబంధ విభాగాల నేతలు, వారి కుటుంబాలు, కొన్ని పత్రికలు, చానల్స్‌పై జుగుప్సాకర వ్యాఖ్యలు చేశాను. అందుకుగాను వారం రోజులుగా అందరినీ పేరుపేరున క్షమాపణలు కోరుతున్నాను. ఇప్పటి పరిస్థితుల నుంచి బయటపడటానికి నేను ఇదంతా చేస్తున్నానని అనుకోవద్దు. ఒకవేళ భవిష్యత్తులో వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా నా బుద్ధి వక్రమార్గం పట్టదు. ఇది నా కుటుంబంపై ఒట్టేసి చెబుతున్న మాట. నన్ను కేసుల నుంచి బయటపడేయండి. నా కుటుంబాన్ని రక్షించండి" అని ఆ లేఖలో శ్రీరెడ్డి కోరారు. కాగా, మాజీ సీఎం జగన్, ఆయన సతీమణి భారతిరెడ్డికి తన తీరుతో బాధ కలిగించానని, వైసీపీని ఇబ్బంది పెట్టానని, అందువల్ల అందరికీ దూరంగా ఉండాలనుకుంటున్నానని సినీ నటి శ్రీరెడ్డి తెలిపారు. ఈ మేరకు జగన్, భారతిని ఉద్దేశించి గురువారం ఆమె లేఖ రాశారు. తన చేష్టలు, కామెంట్లతో జగన్, వైసీపీల ప్రతిష్ఠ దిగజార్చానని ఆ లేఖలో పేర్కొన్నారు. అందుకే.. వైసీపీకి, కార్యకర్తలకు దూరంగా ఉండాలనుకుంటున్నానని ఆ లేఖలో తెలిపారు.

పోసానిపై ఫిర్యాదుల వెల్లువ

- 22 చోట్ల ఫిర్యాదులు... 5 కేసులు

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఒక్కరోజే ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా 22 ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్లలో టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదులు చేశారు. వీటిలో ఐదుచోట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతపురంలో పోసాని దిష్టి బొమ్మను తెలుగు యువత, ఎస్సీ సెల్ నాయకులు దహనం చేశారు. పోసాని తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన ఇంటిని ముట్టడించి, చెప్పులతో దేహశుద్ధి చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అసభ్యకరంగా దూషించారంటూ నమోదైన కేసులో విచారణకు హాజరు కావాలని పోసానికి రెండు, మూడు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామని విజయవాడ భవానీపురం పోలీసులు తెలిపారు. కాగా, సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆ వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన సినీ నటి శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు నాలుగు చోట్ల పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

కేసు పెట్టాల్సింది.. సీఎం బ్రదర్స్‌పైనే

(మొదటిపేజీ తరువాయి)



పెట్టాల్సింది తమ పార్టీ నేత నరేందర్‌రెడ్డిపైన, తనపైన కాదని, కేసులు పెట్టాల్సింది ఎనుముల బ్రదర్స్‌పైన అని చెప్పారు. లగచర్ల రైతులు రేవంత్‌రెడ్డి చేసిన పనులకు ఆయన భాషలోనే సమాధానం చెప్పారన్నారు. రేవంత్ జైలుకెళ్లారు కాబట్టి తననూ ఏదోలా పంపాలని అనుకుంటున్నారని ఆరోపించారు. లగచర్ల కేసులో ఆధారాలుంటే కోర్టులో పెట్టాలని సవాల్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ నుంచి తాజాగా లగచర్ల కేసు వరకు వరుస ఆరోపణలు.. కొనసాగుతున్న విచారణలు.. అరెస్టు చేస్తారన్న ప్రచారాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి కేటీఆర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

లగచర్ల కేసులో మీ పార్టీ నేతలను రెచ్చగొట్టింది మీరే అని, దానికి సంబంధించిన వాయిస్ రికార్డులు కూడా ఉన్నాయని పోలీసు వర్గాలు చెప్తున్నాయి కదా?

వదంతులు, గాసిప్స్, చెవి కొరకడాలు, ఇచ్చికాల మాటలు వీటిమీదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 11నెలలుగా టైమ్‌పాస్ చేసింది. పేదలు, ప్రజలికిచ్చిన హామీలు నెరవేర్చిన పాపాన మాత్రం పోలేదు. అతనో విఫల ముఖ్యమంత్రి. మొదట కాళేశ్వరంలో అవినీతి అన్నారు. తర్వాత విద్యుత్తు రంగంలో ఏదో జరిగిందన్నారు. ఆ తర్వాత ఫోన్ ట్యాపింగ్ అంశం తెరపైకి తెచ్చారు. ఫార్ములా వన్ అన్నారు. మా బావమరిది ఇంట్లో డ్రగ్స్ పార్టీ అన్నారు. ఇప్పుడు లగచర్ల దాడి అంటున్నారు. ఆయన జైలుకెళ్లారు కాబట్టి నన్నూ ఏదోలా పంపాలని అనుకుంటున్నారు. లగచర్ల కేసులో ఆధారాలుంటే కోర్టులో పెట్టమనండి. అసలు అక్కడ జరిగిందేంటి? పేద, గిరిజన రైతుల భూములు ప్రభుత్వం లాక్కుంటానంటే వారు తిరగబడ్డారు. 9నెలల తర్వాత సహనం నశించడంతో అక్కడికి వెళ్లిన అధికారులను నిలదీశారు. కలెక్టర్ నామీద దాడి జరగలేదు అని రికార్డెడ్‌గా చెప్పారు. ఆయన జిల్లా మెజిస్ట్రేట్. ఆయన చెప్పింది సరైందా? లేకుంటే రేవంత్ ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులు చెప్పింది సరైందా? గతంలో ఏపీలో ఇలానే చేసిన ఐపీఎస్ అధికారుల పరిస్థితి చూస్తున్నాం. ప్రైవేటు సైన్యంలా వ్యవహరిస్తున్న కొందరు పోలీస్ అధికారులకూ అదే గతి పడుతుంది.

కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట రెడ్డి, మరో అధికారిపై హత్యాయత్నం జరిగిందని రిమాండ్ రిపోర్టులో ఉంది కదా?

అసలు కేసులు పెట్టాల్సి వస్తే కేసు ఎనుముల తిరుపతి రెడ్డి మీద పెట్టాలి. ఎనుముల తిరుపతిరెడ్డి లగచర్లలోని పేద, గిరిజన రైతులను ఎవడ్రా ఫార్మా క్లస్టర్ ఆపేది అంటూ బండబూతులు తిట్టాడు. చెప్పేందుకు వీళ్లేని ఆ బూతుల ఆడియో ఉంది. అతనెవరు? 144సెక్షన్ అమల్లో ఉన్నా 200 మందితో అక్కడ తిరుగుతున్నాడు. స్థానిక ఎంపీ వెళ్తే, మా పార్టీ నేత, శాసనమండలిలో విపక్ష నాయకుడు సిరికొండ మధుసూధనాచారి వెళ్తే మాత్రం పోలీసులు అడ్డుకున్నారు. తిరుపతిరెడ్డి డీఫ్యాక్టో సీఎంలా వ్యవహరిస్తున్నాడు. ఇంక రెండో కేసు సీఎం రేవంత్‌రెడ్డిపై పెట్టాలి. తన సొంత నియోజకవర్గంలో రైతులు ఆందోళన చేస్తుంటే ఒక్కరోజు వారి బాధలు వినలేదు. తన బంధువుల కోసం గిరిజన భూములు లాక్కుంటున్నారు మరోవైపు పోలీసులకు ఒక నిఘా యంత్రాంగం ఉంటుంది. అక్కడ 9నెలలుగా జరుగుతున్న నిరసనలు, ఆందోళనలు వీళ్ల కళ్లకు కనిపించలేదా? వారి వీడియోలన్నీ ఉన్నాయి. ఆందోళనలు జరుగుతున్నాయని తెలిసినా ఏ సమాచారంతో అక్కడికెళ్లారు? లగచర్ల ఘటన వెనుక నేనున్నానని, నరేందర్‌రెడ్డి నాపేరు చెప్పారని రిమాండ్ రిపోర్ట్‌లో రాశారు. అదంతా బక్వాస్ అని ఆయన జైలు నుంచి లేఖ రాశారు. సీఎం నియోజకవర్గంలో కలెక్టర్‌పై దాడిచేసేంత బలమైన వ్యక్తులమా? మేంచెబితే రైతులు దాడులు చేస్తారా? సొంత నియోజకవర్గం మీదకూడా పట్టులేని నువ్వు అసలు ఏం సీఎంవేనా? నీ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు మాపై అక్రమకేసులు పెట్టిస్తావా?

దాడిచేయాలంటూ మీరే ఫోన్‌లో చెప్పారని?

ప్రజల ఆగ్రహం ఒకసారి కట్టలు తెంచుకుంటే నియంతలే పోయారు. ఒక ప్రాజెక్టు పెట్టాలంటే ప్రజలను బెదిరిస్తే సరిపోతుందనే వైఖరి సరికాదు. ఆ ఇంగితం రేవంత్‌కు ఉండాలి. ఒక్కటంటే ఒక్కసారి ఆ రైతులకు సమయం ఇచ్చారా? ఫార్మా అంటేనే కాలుష్యం, విషం. ఫార్మా వస్తే ఇక అంతే అని గతంలో ముచ్చర్లలో, యాచారంలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రెచ్చగొట్టింది రేవంత్‌రెడ్డి కాదా? సంయమనం పాటించాల్సింది భూమి కోల్పోయే రైతులా? ప్రభుత్వమా? 11నెలల నుంచి చంపుతా, నరుకుతా, గుడ్లు పీకుతా, అని మాట్లాడింది ముఖ్యమంత్రి కాదా? ముఖ్యమంత్రికి అర్థమైన భాషలోనే ప్రజలు కూడా ఆయనకు సమాధానం చెప్తున్నారు? నరేందర్‌రెడ్డితో ఆరోజు మాట్లాడానో లేదో నాకు గుర్తులేదు. ఒకవేళ మాట్లాడాననుకో. మా ఎమ్మెల్సీ, మా పార్టీ నేత.. ఒకసారి కాదు. 10సార్లు మాట్లాడొచ్చు. నన్ను అరెస్టు చేస్తే జైలునుంచి వచ్చాక కూడా పోరాటం చేస్తా. ఈ ప్రభుత్వం రైతులపట్ల అమానుషంగా వ్యవహరిస్తోంది. లగచర్ల ఘటనలో 50మంది రైతులను స్థానిక ఎస్పీ దగ్గరుండి కొట్టించారు. ఒక అమ్మాయి ఛాతీమీద కాలుపెట్టి ఆమెభర్తను అరెస్ట్‌చేసి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టను. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవహక్కుల సంఘం, మహిళా కమిషన్‌వరకు తీసుకెళ్తా. రాష్ట్రంలో ఇంత అరాచకం జరుగుతుంటే గతంలో మానవహక్కుల గురించి మాట్లాడిన కోదండరాం,హరగోపాల్ ఎందుకుమాట్లాడటం లేదు

ఫార్ములా వన్ రేసు కేసులో రూ.55కోట్లను మంత్రి మండలి అనుమతి లేకుండా మీరే ఇప్పించారని ఆరోపణలున్నాయి. ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి ఇవ్వడం అక్రమం అంటున్నారు?

హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు ఫార్ములా వన్ రేస్ నిర్వహించాం. ఇక్కడ రేస్ కాదు ముఖ్యం. రాష్ట్రానికి లాభం జరుగుతుందనేది ప్రధానం. తెలంగాణ మొబిలిటీ వ్యాలీ అని పెట్టి ఎలక్ట్రిక్ వాహనాలు విస్తరించేలా ఒక చిన్న విత్తనం నాటి మహావృక్షం చేసే ప్రయత్నం చేశాం. మొదటి ఏడాది స్పాన్సర్‌గా గ్రీన్‌కో కంపెనీ 100 కోట్ల వరకు ఖర్చుచేసింది. ప్రభుత్వం 30-40కోట్లు ఖర్చు చేసింది. రెండో ఏడాదికి గ్రీన్‌కో కంపెనీ స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకుంటున్నాం అన్నారు. దీంతో 2023 జూన్, జూలైలో వేరే స్పాన్సర్‌ను వెదకండి అని అరవింద్ కుమార్‌కు ఆదేశాలిచ్చా. ఫార్ములా రేస్ కోసం మొదటి విడత కట్టాల్సిన రూ.55కోట్లు కట్టండి. ఆ తర్వాత ప్రైవేటు స్పాన్సర్‌ను ఒకరు లేదా ఇద్దరిని పట్టుకుందాం. ఈలోపు అంతర్గత సర్దుబాటే కదా! ఇవ్వాలని ఆదేశాలిచ్చా. ఫైలుపై నేనే సంతకం చేశా. ఇక్కడ నేనే అంటే ప్రభుత్వం. హెచ్‌ఎండీఏ స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ. ఆ సంస్థకు బోర్డు ఉంటుంది. ఆ బోర్డు చైర్మన్‌గా నిర్ణయం తీసుకున్నా. దానికి మంత్రిమండలి, ఆర్థిక శాఖ, ఆర్బీఐ అనుమతి అక్కర్లేదు. తెలుసుకుని మాట్లాడితే మంచిది.

అధికారంలోకి వచ్చిన సుమారు ఏడాది కాలంలోనే రుణమాఫీ, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, ఉచిత గ్యాస్ అమలుచేశామని, అయినా అధికారం పోయిందన్న ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ ఉన్నారని మంత్రులు విమర్శిస్తున్నారు?

అధికారం పోయిందని ఎలాంటి ఫ్రస్ట్రేషన్‌లేదు. గతంలో అధికారంలోకి వస్తామని.. కలలోకూడా ఊహించలేదు. కానీ ఈ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి వందరోజుల్లో ఏదో పొడుస్తా అన్నారు. ఏం పొడిచారు? ఏం చేశారు? అనేవి చర్చించేందుకు రేవంత్‌రెడ్డి మొగాడైతే ఆయన గ్రామం కొండారెడ్డిపల్లి, లేకుంటే ఆయన నియోజకవర్గం కొడంగల్‌కు సెక్యూరిటీ లేకుండా రావాలి. అక్కడే చర్చ చేయవచ్చు. ఎక్కడనేది అతనిష్టం. వెళ్లిన తర్వాత ప్రభుత్వం బాగుందా? బాగాలేదా? అడుగుదాం. లేదంటే ఆయన కొడంగల్‌లో అయినా...నేను సిరిసిల్లలో అయినా రాజీనామా చేద్దాం. ఎక్కడంటే అక్కడ అతనిష్టం. రాజీనామా చేసి పోటీచేస్తే ఈ ప్రభుత్వం అద్భుతమా? వైఫల్యమా? తేలిపోతుంది.

ఎవనిదిరా.. కుట్ర?

ఎవనిదిరా కుట్ర? నీకు ఓటేసిన పాపానికి రైతుల భూములు కాజేయాలనుకోవడం కుట్ర కాదా? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. 'నీ అల్లుని కోసమో, అన్నకోసం రైతన్ననోట్లో మట్టికొట్టడం కుట్రకాదా?' అంటూ సీఎం రేవంత్‌ని ఉద్దేశించి ఎక్స్ వేదికగా నిలదీశారు. ఏదో ఒకకేసులో తనను ఇరికించి అరెస్ట్ చేస్తావని తెలుసునని, రైతుల గొంతైనందుకు అరెస్ట్ చేస్తే గర్వంగా జైలుకు వెళ్తానని కేటీఆర్ పేర్కొన్నారు.

ఫార్ములా వన్ రేస్ కేసులో మిమ్మల్ని విచారించేందుకు రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇవ్వకుండా చూడాలంటూ ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలతో మిలాఖత్ మంతనాలు చేశారని మంత్రులు విమర్శిస్తున్నారు?

గవర్నర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి కలిస్తే అర్థమేంటి? సీఎం వెళ్లి గవర్నర్ ద్వారా మోదీకి సందేశాలిచ్చారా? సీఎం మీద, మంత్రి పొంగులేటి మీద ఈడీ కేసులు పెట్టొద్దని చెప్పారా? నేను రేవంత్ బావమరిది సృజన్‌రెడ్డికి అమృత్ టెండర్లు ఇవ్వడంపై ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేశా. రేవంత్‌రెడ్డి భాషలో చెప్పాలంటే.. నువ్వు మగాడివైతే సిట్టింగ్ న్యాయమూర్తి, లేకుంటే మాజీ న్యాయమూర్తితో అమృత్ టెండర్లపై విచారణ వేయించు. నిజాలు నిగ్గుతేలతాయి.

ఫోన్‌ట్యాపింగ్ కేసులోను మీ ప్రమేయమే ఉందని అంటున్నారు?

ఏ కేసు పెట్టుకుంటారో పెట్టుకోవచ్చు. ఏ విచారణ చేసుకుంటారో చేసుకోవచ్చు. నేను సిద్ధం బురదలో ఉన్నా కాబట్టి బురద పూస్తా. జైలుకు పోయా కాబట్టి జైలుకు పంపుతా అంటే అది ఆయన పైశాచికం.

అన్ని కేసుల్లోను మీ పేరే ఎందుకు తెరమీదకు వస్తుంది?

రేవంత్‌రెడ్డికి నాపై ప్రేమ. అభిమానం. సర్వదా కృతజ్ఞుడిని.

ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా విపక్షంగా మీరు కూడా ఏదైనా కార్యక్రమం చేస్తున్నారా?

మా విమర్శకులు ఏడాదిలోనే ఇంత స్పీడా? అని అంటున్నారు. ఏడాదైనా సమయం ఇవ్వాలని కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ఆయన మౌనంపైనా వీళ్ల విమర్శలు చేస్తున్నారు. ఆయన మౌనం కూడా వీళ్లకు భయం కలిగిస్తోంది. ప్రభుత్వ ఏడాది పాలనపై ద్వితీయ శ్రేణిలో మేం వైఫల్యాల వారోత్సవం చేద్దామనే ఆలోచనలో ఉన్నాం. ఈ ప్రభుత్వం పనితీరు ప్రజలకూ తెలిసిపోయింది. ప్రభుత్వానికి నేనైతే మైనస్ 10మార్కులు వేస్తాను.

కేటీఆర్‌తో కేసీఆర్‌ను...ఆ తర్వాత హరీశ్‌తో కేటీఆర్‌ను ఫినిష్ చేయిస్తాం అన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏమంటారు?

కేసీఆర్‌ను ఫినిష్ చేయాలనుకున్నవాళ్లు అడ్రస్ లేకుండా పోయారు. గత 24ఏళ్లలో కేసీఆర్‌ను ఫినిష్ చేయాలని అన్నవాళ్లు ఎక్కడున్నారో చూడాలి. రేవంత్‌రెడ్డి జాగ్రత్తగా ఆయన శ్రేయోభిలాషులతో మాట్లాడితే తెలుస్తుంది.

దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవు

అప్పట్లో నేను, రేవంత్ కలిసి నీ ప్రగతిభవన్ గేట్‌నే తన్నినం.. మేం ఇప్పుడు అధికారపక్షం.. కేటీఆర్, హరీశ్ ఆలోచించుకోండి

- మీ హయాంలో భూసేకరణకు ఒక్క గ్రామసభ నిర్వహించారా?
- వందల గ్రామాల్లో రైతులపై దాడులు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వారి కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడతాం
- మా పాలన ఎలా ఉందో మహిళలను అడుగుదాం.. సిద్ధమేనా?
- ప్రజలకిచ్చిన హామీలను సీఎం, మంత్రులు అమలు చేస్తున్నారు
- మా సోషల్ మీడియా స్లో.. చేసినవీ చెప్పుకోలేకపోతున్నాం
- కేటీఆర్ నాజూకు లీడర్.. రేవంత్‌ను తట్టుకోలేకపోతున్నారు
- డిప్రెషన్‌లో ఎప్పుడు ఏం చేస్తున్నాడో తెలియట్లేదు: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అధికారులపై దాడులకు పాల్పడితే ప్రతిదాడులు తప్పవని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న మంచి పనులను సోషల్ మీడియా ద్వారా వక్రీకరించి చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులను పోలీసులతో కొట్టించి మల్లన్నసాగర్ కోసం భూములను గుంజుకోలేదా? అప్పుడే మరిచిపోయారా? అని ప్రశ్నించారు. వేములఘాట్ దగ్గర రైతులను కొట్టించింది మీరు కాదా? భూములు ఇవ్వకపోతే మీ సంగతి చూస్తానని ఎర్రబెల్లి బెదించలేదా? అని నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏనాడైనా గ్రామసభ పెట్టారా? ప్రగతి భవన్, ఇందిరా పార్కుకు వచ్చిన రైతులతోపాటు వందలాది గ్రామాల్లో అన్నదాతల నడ్డి విరగొట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దని మండిపడ్డారు. అధికారం పోయేసరికి బీఆర్‌ఎస్ నేతలు రాబందుల్లా ప్రజలపై పడ్డారని అన్నారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో ఒక్క రైతునైనా కొట్టామా? లగచర్లలో రైతులపై ఎక్కడ దాడి జరిగిందో చెప్పాలని, ఫొటోలుంటే చూపించాలని సవాల్ విసిరారు. కొందరు బీఆర్‌ఎస్ నేతలే ఉద్దేశపూర్వకంగా కలెక్టర్‌పై దాడి చేశారని, ఘటనకు బాధ్యుడిగా కేటీఆర్ అడ్డంగా దొరికిపోయారని పేర్కొన్నారు. భూములను గుంజుకోవడం కాంగ్రెస్ సర్కారు పాలసీ కాదని, గ్రామ సభల ద్వారా అందరి ఆమోదం తీసుకోవాలన్నదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న తమపై కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని, గతంలో బీజేపీతో కలిసి రేవంత్‌ను దించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఇలాంటి కుట్రలను ఎలా ఎదుర్కోవాలో తమకూ తెలుసన్నారు. బీఆర్‌ఎస్ దొంగల ముఠా సోషల్ మీడియా ద్వారా తమ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తోందని ధ్వజమెత్తారు. తమ సోషల్ మీడియా కొంచెం నెమ్మదిగా ఉందని, చేసిన పనులను సైతం చెప్పుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. "ఒక్క ఫ్యాక్టరీ కోసం ఇంత చేస్తామా? సీఎం రేవంత్‌రెడ్డికి 20ఎకరాలు దొరకడం పెద్ద కష్టమా? ఎవరికి చెప్పినా 50ఎకరాలు ఇస్తారు. కేసీఆర్ చేసిన అప్పులు చూస్తే మాకు నిద్ర పట్టడం లేదు. కేటీఆర్ నాజూకు లీడర్..రేవంత్ రెడ్డి అటాకింగ్‌కు తట్టుకోలేక పోతున్నారు. డిప్రెషన్‌లో ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు" అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ తీరు చూస్తుంటే.. రుణమాఫీ చేయడం, హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడం ఇష్టం లేనట్టుందని అన్నారు. "సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్.. అందరం కలిసి బస్సు ఎక్కి మహిళలతో మాట్లాడుదాం. లక్ష రుణ మాఫీ అయిన రైతుల ఇంటికి వెళ్దాం. సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుద్దాం.. మా పాలన ఎలా ఉందని అడుగుదాం. వారు చెప్పే సమాధానాలు వినేందుకు సిద్ధమేనా? లేదంటే మహిళా ప్రయాణికులనే మీ ఇంటికి తీసుకొస్తాం..మీరు రెడీనా?" అని సవాల్ విసిరారు. తమ కార్యకర్తలతోపాటు తామంతా సీఎం రేవంత్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. తాను, విపక్ష నాయకుడిగా ఉన్న రేవంత్.. గతంలో పోలీస్ నిర్బంధంలో ఉన్న ప్రగతి భవన్ గేట్‌నే తన్నామని గుర్తు చేశారు. ఇప్పుడు తాము అధికారపక్షంలో ఉన్నామన్న విషయాన్ని కేటీఆర్, హరీశ్ గుర్తుంచుకోవాలన్నారు.

రేవంత్‌రెడ్డిది మిడిమిడి జ్ఞానం

కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇంకా రాలేదని బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేననడం సీఎంకు తగదు

- తెలంగాణకు నష్టం వాటిల్లేలా ఆయన వ్యాఖ్యలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



భారత్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన-2024ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి


న్యూఢిల్లీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇంకా రాకపోవడం వల్ల బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేనని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం ఆయన స్థాయికి సరికాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్ మిడిమిడి జ్ఞానంతో తొందరపాటు వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణకు నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారన్నారు. గురువారం 'భారత్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన-2024'లో కేంద్ర గనుల శాఖ, కోలిండియా పెవిలియన్లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి అనేది చాలా చిన్న విషయమని, అనుమతి ఇవ్వాలా, ఇవ్వకూడదా అనేది గవర్నర్ విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇలాంటి విషయాల్లో గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా న్యాయ సలహా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో కొంత జాప్యం జరగడం సహజమని, అంతమాత్రానికే సీఎం తొందరపాటు వ్యాఖ్యలు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. కేటీఆర్‌పై విచారణకు డిమాండ్ చేస్తున్నారా అని మీడియా ప్రశ్నించగా అవినీతి ఎక్కడ జరిగినా, ఏ పార్టీ చేసినా నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. అమృత్ టెండర్లపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావాలన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి ఘటనను ఖండించారు. అధికారులపై దాడులకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి తప్ప.. అమాయక గ్రామస్థులపై అక్రమ కేసులు పెట్టవద్దన్నారు.

రైతులను బెదిరిస్తున్న దళారులు: ఈటల

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు పేరిట లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచర్ల పరిధిలో కొంత మంది దళారులు అసైన్డ్ భూములు పొందిన వారిని బెదిరిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. పట్టా భూములు ఉన్న మరికొంతమంది నుంచి వాటిని బలవంతంగా సేకరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతుల నుంచి రూ.40 లక్షల విలువైన భూమిని రూ.10 లక్షలకే గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో ఓట్లేసి గెలిపించిన ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి హింసిస్తున్నారని ఆరోపించారు. అధికారులు సైతం రేవంత్‌కు బానిసలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమ భూములు గుంజుకోవద్దని అడ్డుకున్న రైతులకు బేడీలు వేసి, కేసులు పెట్టిన పాపం రేవంత్‌దేనన్నారు.

11 నెలల్లో రూ.36 వేల కోట్ల పెట్టుబడులు!

- ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ పాత్ర కీలకం
- సీఎం అమెరికా పర్యటనతో సత్ఫలితాలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత గత 11 నెలల్లో 140 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 36వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఫార్మారంగంలో లైఫ్‌సైన్సెస్ పురోగతి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. హెచ్ఐసీసీలో గురువారం విలేకరులతో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం పురోగతిని వివరించారు. ఫార్మా రంగంలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పనను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఫార్మా మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు, ఆర్ అండ్ డీ సెక్టార్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, ఇన్నోవేషన్ హబ్స్ ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందన్నారు. ప్రత్యక్షంగా 51వేల మందికి పరోక్షంగా లక్షా 50వేలమందికి ఉపాధి దొరకనుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఎలా ఆహ్వానిస్తున్నామో, ఇప్పటికే ఉన్నవారు వ్యాపార విస్తరణ చేసేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. జీనోమ్ వ్యాలీలో అంతర్జాతీయ స్థాయిలో రిసెర్చ్ సెంటర్లు పని ప్రారంభించాయని, లారెస్ యూరోపియన్ కంపెనీ రూ.2వేల కోట్ల పెట్టుబడితో రిసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందన్నారు. భారతీయ పరిశ్రమలతో కలిసి జపాన్‌కు చెందిన కంపెనీ ఏటా 5 కోట్ల డెంగ్యూ టీకాలు ఉత్పత్తి చేయనుందని తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సత్ఫలితాలను ఇచ్చిందని అమెరికాకు చెందిన ప్రముఖ బయోటెక్నాలజీ కంపెనీ జీనోమ్ వ్యాలీలో కార్యాలయం ప్రారంభించిందని తెలిపారు. పశు వైద్యానికి సంబంధించి మరో సంస్థ వెటర్నరీ మందుల ఉత్పత్తి ప్రారంభిస్తుందని చెప్పారు. హెల్త్ కేర్ ఉత్పత్తుల తయారు చేసే మరో కంపెనీ కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందన్నారు. మెట్రానిక్స్ అనే ఐటీ కంపెనీ కూడా తెలంగాణలో తమ కార్యకలాపాలు ప్రారంభించనుందని తెలిపారు. కాగా, లగచర్లలో ఘటనలో కుట్రకోణం నిర్ధారణ అయితే కుట్రదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నిరుపేద దళితుల ముసుగులో సంఘ విద్రోహకశక్తులు అధికారులపై దాడికి పాల్పడ్డారని అన్నారు.

నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

» ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి

» కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్రాన్ని కోరారు. గతేడాది అక్టోబరులో ప్రధాని మోదీ జాతీయ పసుపు బోర్డును ప్రకటించారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లా పసుపు సాగులో ప్రసిద్ధి గాంచిందని, అక్కడి రైతులు దశాబ్దాలుగా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. పసుపు, అనుబంధ ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులకు నిజామాబాద్ జిల్లాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు అనివార్యమని తెలిపారు. ఇక రాష్ట్రంలో 3,300 ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగులో ఉన్నాయని, ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,757 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 696 ఎకరాల్లో తోటలున్నాయన్నారు. ఈక్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని తుమ్మల కేంద్రాన్ని కోరారు. తెలంగాణలో ఇప్పటివరకు 91,200 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారని, ఏటా 40వేల హెక్టార్లలో సాగు విస్తీర్ణం పెంచే ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యేకంగా ప్రాంతీయ ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు.

నెహ్రూకు నివాళులర్పించిన సీఎం



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించిన సీఎం రేవంత్. చిత్రంలో మధుయాష్కీ, రోహిన్‌రెడ్డి

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయనతో పాటు మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి ఉన్నారు. కాగా, సీఎం రేవంత్‌ను బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు.

సిక్కు సోదరులకు గురునానక్ జయంతి శుభాకాంక్షలు

వినయం, సేవాభావాలతో జీవితాన్ని గడపాలనే గురునానక్ సందేశం సదా అనుసరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం... సిక్కు మత స్థాపకులు గురునానక్ జయంతి సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు, సిక్కు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. గురునానక్ ప్రవచించిన ప్రేమ, కరుణ, మానవతా సందేశాలు మనల్ని వెలిగించాలని, సరైన మార్గంలో నడిపించాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

» హోంగార్డుల తరహాలో వారికి జీతభత్యాలు: రేవంత్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లను నియమించడంపై దృష్టిసారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తొలిదశలో రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌జెండర్లను నియమించాలని సూచించారు. హైదరాబాద్‌లో సిగ్నల్ జంపింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వెళ్లేవారిని నిరోధించేందుకు హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లోనూ వారి సేవలను వాడుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. తద్వారా తాగి వాహనాలు నడిపే వారి సంఖ్యను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. హోంగార్డుల తరహాలో వారికి జీతభత్యాలు సమకూర్చేలా విధివిధానాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు గురువారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

రాజన్న ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్

» మరో వందేళ్లు చెక్కుచెదరకుండా ఉండాలి: సురేఖ

» భక్తులందరికీ అన్నప్రసాదం అందించాలి: పొన్నం

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మరో వందేళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా వేములవాడ రాజరాజేశ్వర దేవాలయాన్ని అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారుల్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆలయ అభివృద్ధిపై మంత్రి సురేఖ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ ప్రాశస్త్యానికి, భక్తుల మనోభావాలకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఒక ధర్మగుండం, ఇతరులకు ఒక ధర్మగుండం ఏర్పాటు చేయాలని సూచించారు. భూసేకరణపై నివేదిక అందించాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌ను ఆదేశించారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కొత్తగా అన్నదాన సత్రం నిర్మించాలని, అవసరమైన ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

ట్రాన్స్‌కో సీఎండీగా కృష్ణభాస్కర్ బాధ్యతల స్వీకరణ

ట్రాన్స్‌కో సీఎండీగా డి.కృష్ణ భాస్కర్ గురువారం విద్యుత్‌సౌధలో బాధ్యతలు స్వీకరించారు. ఉప ముఖ్యమంత్రి వద్ద ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న కృష్ణ భాస్కర్‌ను ఈ నెల 11వ తేదీన ప్రభుత్వం ట్రాన్స్‌కో సీఎండీగా నియమించింది. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన 11 నెలలుగా ఉప ముఖ్యమంత్రి వద్ద పనిచేస్తున్నారు.

గ్రూప్-4 ఫలితాలు విడుదల

» 8,084 మందికి ఉద్యోగాలు..96 పోస్టుల భర్తీ పెండింగ్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్-4 పరీక్ష ఫలితాలను వెల్లడించింది. పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను గురువారం విడుదల చేసింది. ఆ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని.. అభ్యర్థులు పరిశీలించుకోవచ్చని అధికారులు సూచించారు. మొత్తం 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 1న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది జూలై 1న అభ్యర్థులకు పరీక్షలను నిర్వహించారు. ఆ తర్వాత అభ్యర్థులను షార్ట్ లిస్టు చేసి, ఈ ఏడాది జూన్ నుంచి నవంబరు 10వ తేదీ వరకు దశల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఫలితాలను వెల్లడించారు. ప్రస్తుతం 8,084 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మరో 96 పోస్టులను భర్తీ చేయలేదు. ఇందులో 59 పోస్టులను వివిధ కారణాలతో 'విత్ హోల్డ్'లో ఉంచారు. మరో37 పోస్టులకు సంబంధించి ఆయా కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో భర్తీ చేయలేదు. ఇక పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామక పత్రాలు అందించనున్నారు.

ఓటుకు నోటు కేసు విచారణకు ఉదయ్, సండ్ర వెంకట వీరయ్య హాజరు

» కోర్టుకు రాని సీఎం రేవంత్, వేం నరేందర్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణలో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఉదయ్ సింహా నాంపల్లి ఈడీ కోర్టులో హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, వేం.నరేందర్ రెడ్డి ఈ విచారణకు రాలేదు. కాగా, తదుపరి విచారణను కోర్టు 16వ తేదీకి వాయిదా వేసింది.

కులగణన.. అధిక నిధులకే

(మొదటిపేజీ తరువాయి)

విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంచేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో ఆహారాన్ని పెడితే ఊరుకోబోమని, నాసిరకం అన్నం పెట్టేవారు, సరఫరాదారులు కటకటాలపాలేనని హెచ్చరించారు. సన్న బియ్యంతో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పండిట్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో 'బాలల దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి ముందుగా నెహ్రూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అంగన్‌వాడీ విద్యార్థుల కోసం 'ప్రియదర్శిని' పేరిట రూపొందించిన పాఠ్య పుస్తకాన్ని, ప్రత్యేక యూనిఫామ్‌ను, తెలంగాణ విద్యా ప్రత్యేక సూచికను ఆవిష్కరించారు. చెడు వ్యసనాలకు బానిసలం కాబోమంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "కలెక్టర్లు వారంలో రెండుసార్లు పాఠశాలలు, గురుకులాలను సందర్శించాలని ఆదేశించాం. అలాగే, నాతో సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా సందర్శించాలి. విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు వినాలి. విద్యార్థులే తెలంగాణ ఆత్మ గౌరవం. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకపోతే వారి బంగారు భవిష్యత్తుకు బాట వేసే బాధ్యత ప్రభుత్వానిది" అని స్పష్టం చేశారు. లని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే, వారు కోరిన ఉద్యోగం ఇచ్చే బాధ్యత తనదని చెప్పారు.



ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బాలల దినోత్సవ సంబరాల్లో మాట్లాడుతున్న సీఎం రేవంత్

నాసిరకం అన్నం పెడితే కటకటాలే

గురుకులాల్లో నాసిరకం అన్నం, కూరగాయలు పెడుతున్నట్లు ఇటీవల వార్తలు వెలువడుతున్నాయని, కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారని సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకం పదార్థాల సరఫరాదారులను, నాసిరకం భోజనం పెట్టేవారిని కటకటాల వెనక్కి తోయాల్సిందేనని, వాళ్లంతా ఊచలు లెక్కపెట్టాల్సిందేనని నిర్దేశించారు. "రాష్ట్రంలో పదేళ్లుగా డైట్ చార్జీలు పెంచలేదు. మేం ఇటీవలే డైట్, కాస్మెటిక్ చార్జీలను 40 శాతం పెంచాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పేదవారు. అందుకే డైట్ చార్జీలను ప్రతి నెలా మొదటి వారంలోనే గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేస్తున్నాం. కనక, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి" అని స్పష్టం చేశారు. అవసరమైతే కాంట్రాక్టర్ల బిల్లులను పక్కన పెట్టి, డైట్ చార్జీలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే తాము ఇంతవారమయ్యామని, గురుకులాలను తక్కువ అంచనా వేయవద్దని, గురుకులాలే రాష్ట్ర నాయకత్వాన్ని అందించాయని చెప్పారు. సీఎం, మంత్రులు ఏ సన్న బియ్యం అన్నం తింటున్నారో.. గురుకుల విద్యార్థులకు కూడా దానినే పెట్టాలని చెప్పారు. విద్యార్థులే దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే వారవుతారని, దేశాన్ని నిర్మించే డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు అవుతారని, ఆ గొప్ప లక్ష్యం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు.

మూతపడిన పాఠశాలలను తెరిపించాం

గత పదేళ్లలో ఐదు వేలకుపైగా పాఠశాలలు మూతపడి, దళిత, గిరిజన, ఆదివాసి విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి తెరిపించామని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్రంలో రూ.12 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల వ్యయంతో సమీకృత గురుకుల భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యా శాఖకు బడ్జెట్‌లో అత్యధికంగా 7 శాతం నిధులు అంటే.. రూ.21 వేల కోట్లను కేటాయించామన్నారు. పదేళ్లుగా ఉపాధ్యాయ బదిలీలు జరగలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 35 వేల మందిని చిన్న వివాదం కూడా లేకుండా బదిలీలు చేశామని గుర్తు చేశారు. 11,062 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేశామన్నారు. గతంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు సకాలంలో అందేవి కావని, కానీ.. తాము బడి తెరిచిన మొదటి రోజే అందించామన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, అటెండర్లను నియమించుకునేలా చేశామని, బ్లాక్ బోర్డులు, ఇతర సౌకర్యాల కోసం మరో రూ.650 కోట్ల నిధులను కేటాయించామని వివరించారు. వర్సిటీల్లో త్వరలోనే బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తామన్నారు. విద్యార్థుల నుంచి వచ్చే వినతులు, ఆలోచనలను అమలు చేయడానికి ప్రభుత్వం వెనక్కిపోదని స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు 7న ఎల్బీ స్టేడియంలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈనెల 14 నుంచి డిసెంబరు 9 వరకు విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించామని, వాటికి ఇదే ప్రారంభ కార్యక్రమమని చెప్పారు. ఈ 11 నెలల్లో అత్యధిక సంతోషం ఇచ్చిన రోజు ఇదేనని, విద్యార్థుల సంతోషం, చప్పట్లు, కళ్లలో కాంతి సంపూర్ణమైన విశ్వాసాన్ని కల్పించిందని, వాళ్ల భవిష్యత్తును నిర్మిద్దామని సంకల్పించారు. కాగా, ఎమ్మెల్యేగా పోటీ చేసేవారి వయసు 21 ఏళ్లు ఉండేలా రాజ్యాంగ సవరణ చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టండంటూ మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. దీనిని ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిద్దామని తెలిపారు.



ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

గత ముఖ్యమంత్రి మిమ్మల్ని కలిశారా!?

"పదేళ్లలో గత ముఖ్యమంత్రిని మీరు చూశారా!? ఆయన్ను కలిశారా? అప్పటి మంత్రి ఎప్పుడైనా మిమ్మల్ని కలిశారా? మీరు ఏం తింటున్నారని అడిగారా? ఆనాటి సీఎం మనవడి కుక్క చనిపోతే డాక్టర్లను జైల్లో వేశారు. కానీ.. మీ గురుకులాల్లో పిల్లలు చనిపోతే, మాసాయిపేటలో బడి బస్సును రైలు ఢీకొని 30 మంది పిల్లలు చనిపోతే అప్పటి సీఎం కనీసం కన్నీళ్లు కూడా కార్చలేదు. మీరు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో మీ రేవంతన్నను కలిశారా లేదా? నేరుగా చేయి కలిపారా లేదా? మీ మధ్యలోకి నడుచుకుంటూ వచ్చిన సీఎంతో చెయ్యి కలిపిండ్రా లేదా?" అని ప్రశ్నించి విద్యార్థుల నుంచి సానుకూల సమాధానాలు చెప్పించారు. కొన్ని పాఠశాలల్లో విపరీత పోకడలు చోటు చేసుకుంటున్నాయని, కొంతమంది విద్యార్థులు గంజాయికి బానిసలవుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ బాలల దినోత్సవం సందర్భంగా ఎలాంటి వ్యసనాలకు బానిసలు కాబోమంటూ మాట ఇవ్వాలి. ఫామ్‌హౌజ్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా, మొన్న దీపావళి సందర్భంగా చెడు వ్యసనాలతో దావత్ చేసుకున్నవారి గుండెలు పగిలేలా చప్పట్లు కొట్టండి. వ్యసనాలకు దూరంగా ఉంటామని చెప్పండి. వ్యసనపరులకు మీరు సింహస్వప్నం కావాలి" అంటూ ప్రమాణం చేయించారు.

21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ

» ఈ మేరకు వయో పరిమితి తగ్గించాలి

» అప్పుడే యువత రాణించే చాన్స్

» పిల్లల మాక్ అసెంబ్లీలో సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): "ఓటు హక్కు పొందేందుకు వయో పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. కానీ, ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేసేందుకు ప్రస్తుతం 25 ఏళ్ల వయసు నిబంధన ఉంది. ఈ వయో పరిమితిని కుదించాలి. 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అప్పుడు మరింతమంది యువత రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు చట్టాన్ని సవరించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో గురువారం చిల్డ్రన్ మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీకి వయో పరిమితిని 21 ఏళ్లకు తగ్గిస్తేనే యువత రాజకీయాల్లో రాణిస్తుందని చెప్పారు. ఈ మేరకు పిల్లల మాక్ అసెంబ్లీ తీర్మానం చేసి, రాష్ట్రపతికి పంపించాలని సూచించారు. ఈ అంశాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాలని తెలంగాణ ఎంపీలకు సూచించారు. యువత రాజకీయాల్లోకి వస్తే.. యువతకు ఏం అవసరమనే అంశంపై చట్ట సభల్లో చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. మీలో కొందరైనా శాసన సభకు ఎన్నిక కావాలని, రాజకీయాలను వృత్తిగా ఎంచుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ వంటి బిల్లులను పిల్లల మాక్ అసెంబ్లీలో ఆమోదించడం అభినందనీయమన్నారు. ఇలాంటి మాక్ అసెంబ్లీ సమావేశాలు సమాజానికి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. "శాసన సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, వాటికి ఇచ్చిన సమాధానాలు వంటి అంశాలను విద్యార్థులు గమనించాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిలదీయడం విపక్షాల బాధ్యత. సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడు ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయి. సభను సమర్థంగా నడిపే బాధ్యత స్పీకర్‌పై ఉంటుంది. విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం సమన్వయంతో సభను నడిపించేలా చూడాలి. కానీ, దురదృష్టవశాత్తు ఈ రోజుల్లో కొందరు సభను ఎలా వాయిదా వేయాలా? అనే విధంగా వ్యవహరిస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. మాక్ అసెంబ్లీని స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. దేశంలో విద్య, వ్యవసాయ రంగాల్లో నెహ్రూ విప్లవాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. దాంతో, ప్రతి వారికీ చదువుకునే అవకాశం దక్కిందని, ఆయన వల్లే సమాజంలో ఇవాళ ఇన్ని అవకాశాలు వచ్చాయని చెప్పారు. దేశంలో నిర్బంధ విద్య అమలు చేసేందుకు సోనియా, మన్మోహన్ సింగ్ ఎంతో కృషి చేశారని చెప్పారు.

ప్రభుత్వ విజయాలు తెలిసేలా..

ప్రజాపాలన విజయోత్సవాలు

» వచ్చే నెల 9దాకా కార్యక్రమాలు


హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి డిసెంబరు 7నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అలాగే, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే, డిసెంబరు 9న సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణ, పర్యవేక్షణ సహా వివిధ అంశాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం(నవంబరు 14) నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు అర్థమయ్యేలా కార్యక్రమాలను రూపొందించాలని ఆదేశించారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, సచివాలయం, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని తెలిపారు. కాగా, నవంబరు 19, 25, 30 తేదీలు, డిసెంబరు 7, 8, 9 తేదీల్లో నిర్వహించే వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమీక్షలో నిర్ణయించినట్లు తెలిసింది.

యూజీ నీట్- 24

ఆయుష్ కటాఫ్ స్కోరు తగ్గింపు

వరంగల్ మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ యూజీ, పీజీ సీట్ల ఖాళీల భర్తీకి కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐఏపీజీఈటీ, యూజీ నీట్ 2024 ఆయుష్ కటాఫ్ స్కోరును 15 శాతం తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయుష్ యూజీ, పీజీ క్వాలిఫైయింగ్ కటాఫ్ జనరల్ కేటగిరీ 35 పర్సంటైల్, దివ్యాంగుల (జనరల్)కు 30, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వుడు కేటగిరీలకు 25 పర్సంటైల్‌గా నిర్ణయించారు. కటాఫ్ మార్కులు తగ్గడంతో అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ ఆయుర్వేదం, హోమియో, యునానీ కోర్సుల్లో కన్వీనర్, ఆల్ ఇండియా కోటాలకు, అదే విధంగా బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీఎన్‌వైఎస్, బీయూఎంఎస్ కన్వీనర్ కోటా అలాగే బీహెచ్ఎంఎస్ యాజమాన్య కోటాలలో దరఖాస్తు చేసుకోవడానికి వెలుసుబాటు కల్పిస్తూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరోసారి ప్రకటన జారీ చేసింది.

ఆ 2 ఫోన్ నంబర్లు ఎందుకు పంపారు?



తిరుపతన్న, భుజంగరావుతో ఉన్న పరిచయమేంటి?

» ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే లింగయ్యను ప్రశ్నించిన అధికారులు

» 2 గంటల పాటు విచారణ.. వాంగ్మూలం నమోదు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు తొలిసారిగా ఓ రాజకీయ నాయకుడ్ని ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురు పోలీస్ అధికారుల్ని అరెస్ట్ చేయగా, పెద్ద సంఖ్యలో సాక్షుల్ని విచారించారు. ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును భారత్‌కు తిరిగి రప్పించే ప్రయత్నంలో ఉన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులకు ట్యాపింగ్ కేసుతో ఉన్న సంబంధంపై దర్యాప్తు అధికారులకు సాంకేతిక ఆధారాలు లభించాయి. వాటి ఆధారంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట లింగయ్య విచారణకు హాజరయ్యారు. సుమారు 2 గంటల పాట ఆయన్ను ప్రశ్నించి, వాంగ్మూలం నమోదు చేశారు. విచారణ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో లింగయ్య రెండు ఫోన్ నంబర్లను తిరుపతన్నకు మెసేజ్ చేశారు. అప్పుడు లింగయ్య పంపిన నంబర్లు ప్రస్తుత నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులుగా ఉన్న మదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌కు సంబంధించినవి కావడం గమనార్హం. ప్రైవేటు వ్యక్తుల నంబర్లు ఎందుకు పంపారని అధికారులు ప్రశ్నించగా.. ఏవో అవసరాల నిమిత్తం వారు అడిగి ఉండొచ్చని, అందుకే తన అనుచరుల నుంచి తీసుకుని పంపించినట్లు లింగయ్య సమాధానం చెప్పారు. మునుగోడు ఎన్నిక సమయంలో తిరుపతన్నతో ఫోన్‌లో ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది, ఏం మాట్లాడారన్న ప్రశ్నలకు.. కేవలం ఎన్నికల పరిస్థితి ఎలా ఉందనే అంశంపైనే మాట్లాడినట్లు తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన భుజంగరావు, తిరుపతన్నలతో ఉన్న పరిచయంపైనా పూర్తి వివరాలు రాబట్టే ప్రయత్నం చేయగా.. పోలీసులు, నాయకుల మధ్య ఉండే పరిచయమేనని, స్థానిక ప్రజలు, కార్యకర్తల నుంచి వచ్చే అభ్యంతరాల మేరకు అవసరాన్ని బట్టి వారితో మాట్లాడినట్లు జవాబు ఇచ్చారు. పోలీస్ బదిలీలు, పోస్టింగ్‌లపైనా మాట్లాడినట్లు చెప్పారని తెలిసింది. కీలక అంశాలపై ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు అవసరమైతే మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పి లింగయ్యను పంపించారు.

కాల్ లిస్ట్ ఆధారంగా ప్రశ్నించారు :లింగయ్య

విచారణ ముగిసిన తర్వాత తిరిగి వెళ్తూ లింగయ్య మీడియాతో మాట్లాడారు. తిరుపతన్నతో తాను మాట్లాడిన కాల్ లిస్ట్ ఆధారంగా విచారించారని చెప్పారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. మునుగోడు ఎన్నిక సమయంలో ప్రచారం ఎలా జరుగుతుందని తిరుపతన్న తనను అడిగేవాడని, బాగానే జరుగుతోందని చెప్పానని వివరించారు. వేముల వీరేశం అనుచరుల ఫోన్‌లు ట్యాప్ చేశారనడం అవాస్తవమన్నారు. ట్యాపింగ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని లింగయ్య స్పష్టం చేశారు.

ఇక వరసగా నోటీసులు

లింగయ్యను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన దర్యాప్తు అధికారులు ఈ కేసులో మిగతా రాజకీయ నాయకులకూ నోటీసులిచ్చి, ప్రశ్నించేందుకు రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ కీలక నేతతోపాటు మరికొందరికి నోటీసులు ఇచ్చి, స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మరో ప్రధాన బీఆర్ఎస్ నేతకూ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు అధికారుల కోణంలో కొనసాగిన విచారణ ఫోరెన్సిక్ నివేదికలో బట్టబయలైన ఆధారాలతో రాజకీయ నాయకుల వైపు మళ్లింది.

భుజంగరావు మధ్యంతర బెయిల్ 18 వరకు పొడిగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడో నిందితుడిగా భుజంగరావుకు ఇప్పటికే లభించిన మధ్యంతర బెయిల్‌ను 18 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనారోగ్యం రీత్యా మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టేసింది. దీంతో ఆయన హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భుజంగరావు ఇప్పటికే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఆయనకు స్టెంట్ కూడా వేశారని తెలిపారు. ఈ పిటిషన్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. పిటిషనర్ రెగ్యులర్ బెయిల్ తిరస్కరణకు గురైందని, గురువారం లొంగిపోవాల్సి ఉందని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల 18 వరకు మధ్యంతర బెయిల్‌ను పొడిగించింది. ఇదే కేసులో ఐదో నిందితుడు రాధాకిషన్‌రావు రెగ్యులర్ బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

కాళోజీ కళాక్షేత్రం.. ఆవిష్కరణకు సిద్ధం

» 19న సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం



విద్యుత్ దీపాల వెలుగులో కాళోజీ కళాక్షేత్రం

వరంగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజా కవి కాళోజీ నారాయణ రావు పేరుతో హనుమకొండలో నిర్మించిన కళాక్షేత్రం ఆవిష్కరణకు సిద్ధమైంది. ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 సెప్టెంబరు 9న కాళోజీ జయంతి రోజున అప్పటి సీఎం కేసీఆర్ హనమకొండ బస్‌స్టేషన్ సమీపంలో ప్రెస్‌క్లబ్ ఎదురుగా 4.25 ఎకరాల్లో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించేందుకు భూమి పూజ చేశారు. రూ.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతుండటంతో 2022 అక్టోబరు 22న పర్యాటక శాఖ నుంచి నిర్మాణ బాధ్యతలను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా)కు బదిలీ చేశారు. కరోనాతో నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవటంతో అంచనా వ్యయం రూ.85 కోట్లకు పెంచారు. 2023 డిసెంబరు వరకు కూడా పనులు పూర్తి కాకపోవటంతో పాటు కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పాలన పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ సర్కారు కాళోజీ కళాక్షేత్రం పనులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అంచనా వ్యయం రూ.95కోట్లకు పెరిగింది. పెండింగ్‌లో ఉన్న రూ.45కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయటంతో పాటు ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి కళాక్షేత్రం పనులను అక్టోబరులో పూర్తి చేశారు. బీఆర్ఎస్ పదేళ్లలో పూర్తి చేయని కళాక్షేత్రం పనులను తాము పది నెలల్లోనే రూ.45కోట్లు వెచ్చించి పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు అందుకే అలజడులు సృష్టించే యత్నం

» మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జహీరాబాద్, నవంబరు 14: బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉందని గమనించిన బీఆర్ఎస్ నేతలు.. రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం నిమిత్తం వెళ్తున్న మంత్రి.. మార్గ మధ్యలో జహీరాబాద్‌లో ఆగారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వికారాబాద్‌లో అధికారులపై బీఆర్ఎస్ నాయకులు చేసిన దాడులను చూస్తుంటే.. వారు ఎంతకు తెగబడ్డారో అర్థం అవుతుందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు తెలంగాణలో విధ్వంసం సృష్టించారని, అన్ని రంగాలను విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగురోడ్డును లీజు పేరిట రూ.7వేల కోట్లకు అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్‌ది అని ధ్వజమెత్తారు. దోపిడీలకు పాల్పడినందునే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ హయాంలో 12వేల కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా పేరుతో విద్యావ్యవస్థను అభివృద్ధి చేసే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు.

నేతల చట్టవ్యతిరేక చర్యల్ని ఖండిస్తున్నాం

» పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు, అమాయక ప్రజలని నాయకులు రెచ్చగొట్టి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై దాడి చేయించడం సరైనది కాదని పోలీసు అధికారుల సంఘం పేర్కొంది. లగచర్లలో కలెక్టర్‌తోపాటు, ఇతర అధికారులపై దాడి జరిగిన నేపథ్యంలో ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పట్నం నరేందర్ రెడ్డి ఘటనకు ముందు రెచ్చగొట్టే విధంగా చేసిన ప్రసంగాన్ని అధికారుల సంఘం విడుదల చేసింది. పథకం ప్రకారం ముందు నుంచి దాడులు చేసేలా వ్యూహరచన చేసి, నేతలు బాధ్యతారహితంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తెలిపారు. "ఎవరొచ్చినా తరిమి కొడదాం... గతంలో జరిగిన దానికంటే మరింత ఎక్కువగా చేసి చూపిద్దాం. పోలీసులు వచ్చినా, అధికారులు వచ్చినా దాడి చేద్దాం"మని నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడటాన్ని ఆయన తప్పుబట్టారు. అధికారులపై దాడుల్ని ప్రోత్సహించే ఈ తరహా అరాచక చర్యల పట్ల పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.

కలెక్టర్‌పై దాడి ఘటనలో కేటీఆర్ హస్తం: అర్వింద్

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి సంఘటనలో మాజీ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని, విచారణ పకడ్బందీగా జరపాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో తనమీదా కేటీఆర్ దాడి చేయించారని ఆరోపించారు. కేటీఆర్ లాంటి వారిని రాజకీయాల్లో నామరూపాల్లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కేటీఆర్ చెల్లెలు కవిత జైలుకు వెళ్లి వచ్చిందని, కేటీఆర్‌ను సైతం జైలుకు పంపాలని అభిప్రాయపడ్డారు.

ధాన్యం కొనుగోళ్లపై హరీశ్‌రావు విష ప్రచారం!

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లపై మాజీ మంత్రి హరీశ్‌రావు విష ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ఆరోపణలు చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పాలనలో తాలు, తరుగు పేరుతో రైతులను నిలువు దోపిడీ చేశారని, రైస్‌మిల్లర్లతో బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై అడ్డగోలుగా ధాన్యం అమ్ముకొని ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ధాన్యం సేకరణకు ప్రత్యేక పాలసీ తయారుచేసి, మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకొని ధాన్యం అప్పగిస్తున్నామని తెలిపారు.

లగచర్లపై ఉన్నత స్థాయి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సలహాను తీసుకునేలా ఆయన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గురువారం ఆయన మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణతో కలిసి పరిగి పోలీస్‌స్టేషన్‌లో సుమారు మూడుగంటల పాటు లగచర్ల దాడి దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ భగవత్‌కు ప్రాథమిక నివేదిక వివరాలను ఐజీ సత్యనారాయణ అందజేశారు. కేసు దర్యాప్తులో పురోగతి, పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేయడానికి తీసుకుంటున్న చర్యలను గురించి వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి వివరించారు. ఈ కేసులో కుట్రదారులు మొదలు.. సూత్రధారులు, పాత్రధారులు ఎవరూ తప్పించుకోకుండా అనుసరించాల్సిన వ్యూహం గురించి దర్యాప్తు అధికారులకు మహేశ్ భగవత్ దిశానిర్దేశం చేశారు. పకడ్బందీగా చార్జిషీట్‌ను రూపొందించాలని, కోర్టులో కేసు వీగిపోకుండా ఉండేలా.. అవసరమైతే న్యాయనిపుణుల సలహాలను తీసుకుని, అభియోగపత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. రిమాండ్‌లో ఉన్న నిందితులు బెయిల్ పిటిషన్లు దాఖలు చేస్తే.. శక్తిమంతమైన కౌంటర్లను ఫైల్ చేయాలని ఆదేశించారు. కాగా.. లగచర్ల దాడిలో పోలీసులు మొత్తం 47 మంది నిందితులను గుర్తించగా.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మరో 21 మందిని రిమాండ్ చేశారు. దాడిలో కీలకంగా వ్యవహరించిన సురేశ్‌రాజ్, దేవదాస్, గోపాల్‌నాయక్, విజయ్, విఠల్ పరారీలో ఉన్నారు. వీరిని అరెస్టు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.

రిమాండ్ రిపోర్టులో అవాస్తవాలు: పట్నం

తన అరెస్టు సందర్భంగా పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో అవాస్తవాలున్నాయని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆరోపించారు. చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న నరేందర్‌రెడ్డి గురువారం ఈ మేరకు కొడంగల్ కోర్టులో బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదుల తరఫున ఓ అఫిడవిట్‌ను సమర్పించారు. తాను పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఎక్కడా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రోద్బలంతో దాడి జరిగిందని చెప్పలేదన్నారు. రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న అవాస్తవాలను బట్టి.. పోలీసులు కేటీఆర్‌ను అరెస్టు చేసే ఉద్దేశంలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిబాయి

ఉన్నట్లు కనిపిస్తోందని వివరించారు. అబద్ధాలను ఖండించకపోతే అనర్థం జరుగుతుందనే ఉద్దేశంతో అఫిడవిట్ సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఏ పోలీసు అధికారి కూడా నా వాంగ్మూలాన్ని నమోదు చేయలేదు. కోర్టులో హాజరుపరచడానికి 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకం తీసుకున్నారు. అరెస్టుకు ముందు కూడా నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ ప్రమేయం ఉందంటూ పోలీసులు కల్పితాన్ని సృష్టించారు. కోర్టుకు వచ్చాక నా అడ్వొకేట్ అడిగితే తప్ప రిమాండ్ రిపోర్టు ఇవ్వలేదు" అని ఆ అఫిడవిట్‌లో వివరించారు. మరోవైపు.. నరేందర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో గురువారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా ఆ రోజు దర్యాప్తు అధికారుల తరఫున వాదనలను వినిపించనున్నారు.

సంగారెడ్డి జైలుకు నిందితులు

పట్నం నరేందర్‌రెడ్డిని చర్లపల్లి జైలులో రిమాండ్ చేయగా.. మరో 16 మంది నిందితులను పోలీసులు పరిగి సబ్-జైలుకు తరలించిన విషయం తెలిసిందే..! పరిగి సబ్-జైలు సామర్థ్యం 50 మంది ఖైదీలు కాగా.. ప్రస్తుతం 80 మంది ఉండడంతో.. లగచర్ల నిందితులను గురువారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా జైలుకు తరలించారు.

హైకోర్టులో క్వాష్ పిటిషన్

ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా.. విధించిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేసి, తనను విడుదల చేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ లీగల్‌సెల్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌కు ఇంకా రిజిస్ట్రీ నంబర్ ఇవ్వలేదు. సోమవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశాలున్నాయి. "లగచర్ల గ్రామంలో ఈ నెల 11న జరిగిన దాడితో నాకు ఎలాంటి సంబంధం లేదు. అక్కడ టీజీఐఐసీ భూసేకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిగినట్లు తెలుసు. భూములు కోల్పోయే రైతులు, ప్రజలు అధికారులపై దాడి చేశారు. పోలీసులు ఈ దాడితో సంబంధం ఉన్న వారిని అరెస్టు చేశారు. అలా అరెస్టయిన వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నన్ను ఏ-1గా చేర్చారు. 13వ తేదీన నన్ను అరెస్టు చేసి, కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కేసును పరిశీలించకుండానే.. యాంత్రికంగా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించడం సరికాదు. నా అరెస్టు సమయంలోనూ పోలీసులు నిబంధనలను పాటించలేదు. అరెస్టుకు కారణాలను నాకు లేదా నా భార్యకు లిఖితపూర్వకంగా చెప్పలేదు" అని నరేందర్‌రెడ్డి ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. 'డీకే బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్' కేసును ఈ సందర్భంగా ఉటంకించారు.

ఫార్మాకు భూములు ఇచ్చేది లేదు: బాధితులు

ఫార్మావిలేజ్‌కు వ్యవసాయ భూములను ఇచ్చేది లేదని పలువురు గిరిజన మహిళలు తెగేసి చెప్పారు. తమ కుటుంబ సభ్యులను అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారని వాపోయారు. హకీంపేట, పోలపల్లి, లగచర్ల గ్రామాలకు చెందిన గిరిజన, స్థానిక మహిళలు జ్యోతిబాయి, గోపీబాయి, జయాబాయి తదితరులు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. "ఆరుగాలం కష్టపడి పనిచేసి, పంటలు పండించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఉన్న భూములను కోల్పోతే ఎలా బతకాలి? ఫార్మా కంపెనీలు వస్తే.. పచ్చని పొలాలు నాశనమవుతాయి. భూగర్భ జలాలు కలుషితమవుతాయి. పర్యావరణం దెబ్బతింటుంది. పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇస్తామన్నా.. మమ్మల్ని చంపుతామని బెదిరించినా.. మేం భూములను ఇచ్చేది లేదు" అని స్పష్టం చేశారు. తమవాళ్లు కలెక్టర్, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారే తప్ప.. దాడులు చేయలేదని వివరించారు. పోలీసులు అర్ధరాత్రి వేళ ఇళ్లపై దాడులు చేసి, తమ వారిని అరెస్టు చేశారని, వారిపై కేసులను ఎత్తివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మావిలేజ్‌ను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేటీఆర్ నివాసం వద్ద ఉత్కంఠ

నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు రావడంతో.. బుధవారం రాత్రి నుంచి ఆయన ఇంటి వద్ద పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున మోహరించారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. గురువారం కూడా అక్కడ పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేరుకోవడంతో.. తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఉద్యోగులపై దాడి దుర్మార్గం

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ సంఘాల ఆందోళనలు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో ప్రభుత్వ ఉద్యోగులపై జరిగిన దాడిని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండించారు. ప్రజలకు సేవ చేసే ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నాయి. దాడికి పాల్పడిన వారిని, ప్రోత్సహించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. రాజకీయ లక్ష్యాల కోసం ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగడం దుర్మార్గమని తెలంగాణ గెజిటెడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, నాలుగోతరగతి, కార్మికులు, పింఛన్‌దారుల ఐకాస ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. దాడికి నిరసనగా ఐకాస, ట్రెసా ప్రతినిధులు ప్రధాన భూపరిపాలనా కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇక, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ మాట్లాడుతూ వికారాబాద్ ఘటన ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం రెవెన్యూ ఉద్యోగులు చరిత్రలో వేల ఎకరాల భూసేకరణను ప్రశాంతంగా చేపట్టారన్నారు. లగచర్లలో రైతుల ముసుగులో గూండాలు దాడి చేశారన్నారు. ఆందోళనల్లో టీజీవో వైస్ ప్రెసిడెంట్ బి.శ్యామ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ఐకాస ప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీఎల్‌ఏ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు

అమాయకులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్

» కేటీఆర్.. ఏది సర్కారు వైఫల్యం: భట్టి

» ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర: పొంగులేటి

» కేటీఆర్‌కు శిక్ష తప్పదు: మహేశ్ గౌడ్

» రేపట్నుంచి ప్రజల్లోకి.. 2న బహిరంగ సభ!

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోవడంతో అమాయకులను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. ప్రభుత్వాన్ని కూల్చడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వ వైఫల్యమేంటో కేటీఆర్ చెప్పాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడమా? ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడమా? రుణమాఫీ చేయడమా? ప్రజలకు మంచి చేయడమేనా.. ప్రభుత్వ వైఫల్యం. కేటీఆర్ గురించి చాలా మాట్లాడవచ్చు. ఫార్మా క్లస్టర్స్ విస్తరించే పనిని వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని. ప్రతీకార రాజకీయాలకు మేం వ్యతిరేకం' అని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలను పెంచడానికే ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుందని.. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుందని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిర పరచాలనే కుట్ర జరుగుతోందని, అధికారం పోయిందన్న అక్కసుతో అమాయక రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిల్లర, అవకాశవాద, కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేమనే విషయాన్ని బీఆర్ఎస్ గుర్తించాలని హితవు పలికారు. లగచర్ల ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని.. ఎవరినీ ఉపేక్షించబోమని ఓ ప్రకటనలో తెలిపారు. ఇవ్వాళ అధికారులపై జరిగినట్లు రేపు నేతల మీద జరిగితే ఈ సర్కారు ఉపేక్షించబోదన్నారు. కలెక్టర్‌ను హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారన్నారు. గులాబీ గూండాల కుట్రలను రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. 11 నెలలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నియంతృత్వ పాలనలో ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేశారని.. నేరెళ్లలో దళితులను ఇసుక ట్రాక్టర్‌తో తొక్కించి పోలీసులతో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అసాంఘిక శక్తిగా మారిందని, దాని నిజస్వరూపం ప్రజలకు అర్థమవుతోందన్నారు. పరిశ్రమలు వస్తే తెలంగాణ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో కేటీఆర్ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలునాయక్ మండిపడ్డారు. లగచర్లలో అధికారులను అంతమొందించే పన్నాగం పన్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో మల్లన్నసాగర్ కోసం 12 గ్రామాల ప్రజలను బెదిరించి భూసేకరణ చేశారని.. వెయ్యి ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టుగా కేటీఆర్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. బందిపోట్లలా తెలంగాణను బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని.. కేటీఆర్ పాదయాత్ర కాదు.. మోకాళ్ల మీద యాత్ర చేసినా జనం నమ్మబోరని వ్యాఖ్యానించారు.



మొదటి ముద్దాయి కేటీఆరే..

లగచర్లలో కలెక్టర్‌పై దాడి చేసిన వారు.. ఎవరైనా వదిలేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దాడి ఘటనలో మొదటి ముద్దాయి కేటీఆర్ అని.. ఆయన నుంచి ఫోన్ వెళ్లగానే పట్నం నరేందర్ రెడ్డి తన కార్యకర్తలతో దాడి చేయించారన్నారు. ఈ-ఫార్ములా విషయంలో కేటీఆర్ డబ్బులు నొక్కేశారని.. ఆయనకు శిక్ష తప్పదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పీసీసీ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి జిల్లాల పర్యటన చేపడుతున్నట్లు తెలిపారు. కరీంనగర్ నుంచి ఇది ప్రారంభమవుతుందన్నారు. జిల్లా పర్యటనలు ముగిశాక డిసెంబర్ 2 లేదా 3న భారీ బహిరంగసభ ఏర్పాటు చేయనున్నామని.. దీనికి అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నట్టు తెలిపారు. అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ నేతలు సైకోలుగా మారారని టీపీసీసీ నేత సామ రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు. పచ్చటి తెలంగాణలో నెత్తురు పారించే కుట్రలు చేస్తున్నారని.. సీఎం సొంత నియోజకవర్గంలో అలజడి రేపి రాష్ట్రాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు.

కొడంగల్ నుంచే ప్రజల తిరుగుబాటు

ఎక్కడ తిరుగుబాటు జరిగినా అది బీఆర్ఎస్ కుట్రనా?.. అల్లుడిపై ప్రేమతో పేదల భూములను లాక్కుంటారా?

» సంబంధం లేకున్నా నరేందర్‌రెడ్డి పై కేసు

» మాజీ మంత్రి హరీశ్ ధ్వజం.

» రేవంత్‌ది నీచ బుద్ధి: సబిత

హైదరాబాద్, కుషాయిగూడ, పరిగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నుంచే ప్రజా వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. పేదల భూములను అన్యాయంగా లాక్కోవాలని ప్రయత్నించినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ సేకరించిన 14 వేల ఎకరాల్లో కాకుండా, అల్లుడిపై ప్రేమ చాటుకునేందుకు పేద రైతుల పచ్చని భూములను లాక్కోవడం తగదని రేవంత్‌కు సూచించారు. దీనిని తాము అడ్డుకుని తీరతామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ తిరుగుబాటు చేసినా బీఆర్ఎస్ కుట్ర అని ఆరోపించడం తగదన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి, కుట్ర కేసులో అరెస్టయి చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గురువారం హరీశ్ ములాఖత్ ద్వారా కలిశారు. కేసుతో ఎలాంటి సంబంధం లేకున్నా నరేందర్‌రెడ్డిని అరెస్టు చేశారని, రిమాండ్ రిపోర్టు చదివే అవకాశం కూడా ఇవ్వకుండా సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. కోర్టులపై తమకు నమ్మకం ఉందని, నరేందర్‌రెడ్డి నిర్దోషిగా బయటపడడం ఖాయమని స్పష్టం చేశారు.

పరిగి సబ్ జైలులో సబిత పరామర్శ

జైలుకు పోయి వచ్చిన రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపేందుకు పనిచేస్తున్నారని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని, దానిని ఎండగడుతున్నందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చనిపోవాలని కోరుకోవడం నీచమైన బుద్ధి అని అన్నారు. రాష్ట్రంలో అంతా అల్లకల్లోలం, ఎక్కడచూసినా ఆందోళనలు జరుగుతున్నాయని, రైతులు, కూలీలు నిరుద్యోగ యువత నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. రేవంత్ 11 నెలల్లో కక్షసాధింపు తప్ప ఏం సాధించారని ప్రశ్నించారు. లగచర్ల ఘటనలో పరిగి సబ్ జైలులో ఉన్నవారిని గురువారం వికారాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హరిప్రియతో కలిసి సబిత పరామర్శించారు. అరెస్టయినవారి కుటుంబ సభ్యులతో జైలు బయట మాట్లాడారు. అమాయకులను అన్యాయంగా జైలుకు పంపించారని, వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మహేశ్వరంలో 15 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ ఏర్పాటు తలపెడితే కాలుష్యం వస్తుందన్న రేవంత్.. కొడంగల్‌లో ఫార్మా కంపెనీలకు ఎలా అనుమతిస్తారని సబిత నిలదీశారు. రైతులతో ఫోన్‌లో మాట్లాడారని నరేందర్‌రెడ్డిని జైలు పంపారని, ఫాంహౌజ్ దావత్, కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఇరికించి కేటీఆర్‌నూ జైలుకు పంపాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. లగచర్లలో దాడే జరుగలేదని కలెక్టర్ అంటే.. దాడి జరిగిందని కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారిని వదిలి, బీఆర్ఎస్ వాళ్లనే జైలుకు పంపారని సబితారెడ్డి తెలిపారు. కాగా, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి గురువారం పరిగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఘటనకు దారితీసిన తీరుపై వేర్వేరు విభాగాల నుంచి వచ్చిన నివేదికపై చర్చించినట్లు సమాచారం. మరోవైపు లగచర్లలో గురువారం జన సంచారం కనిపించింది. మూడు రోజుల తర్వాత దుద్యాలలో ఇంటర్నెట్ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి.



అరెస్టయిన వారి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సబిత, కోవ లక్ష్మి

ప్రజలు తిరగబడితే కుట్రా?

ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు బహిరంగంగా తిరుగుబాటు చేస్తే అది కుట్ర అవుతుందా?అని బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యకర్తల నుంచి ఫోన్లు వచ్చినంత మాత్రాన పట్నం నరేందర్‌రెడ్డిని నిందితుడిగా అరెస్టు చేస్తారా? అని నిలదీశారు. ఈ మేరకు మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ బీఆర్ఎస్ విలేకరులతో మాట్లాడారు. నరేందర్‌రెడ్డి కేటీఆర్‌కు ఫోన్ చేసినంత మాత్రాన ఆయన్ను నిందితుడిని చేస్తారా? అని ధ్వజమెత్తారు. నరేందర్ రెడ్డి అదే రోజున వ్యవసాయ అధికారులకు, డీజీపీకి ఫోన్ చేశారని మరి వారు కూడా నిందితులేనా అని నిలదీశారు.

కేటీఆర్ నివాసం వద్ద ఉత్కంఠ

లగచర్ల ఘటనకు సంబంధించిన కేసులో కేటీఆర్‌ను పోలీసులు అరెస్ట్ చేయనున్నారంటూ జరిగిన ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగించింది. దీంతో హైదరాబాద్, నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు చేరుకున్నాయి. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఒక్కచోటుకి చేరడంతో ఉత్కంఠ నెలకొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.